ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 05.09.2024 | సంపుటి : 11 సంచిక : 57 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.APTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV
జనంసాక్షి tv

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# తెలంగాణపై ఎందుకీ వివక్ష?



## కేంద్ర తక్షణసాయం ఎందుకు అందలేదు!

- ఎన్డీయేపక్షాలకు ఓ న్యాయం.. ప్రతిపక్ష ప్రభుత్వాలకు మరో న్యాయమా..?
- సహాయ చర్యలకు సైనిక హెలికాప్టర్లు పంపకపోవడంపై సర్వత్రా విమర్శలు
- ఎక్కడా కనిపించని ఎన్డీఆర్ఎఫ్ బృందాలు..అందుబాటులో లేని పవర్ బోట్లు
- తక్షణ సాయం రూ.2వేల కోట్లు ఇవ్వాలని సీఎం కోరినా స్పందన కరువు

### ఇద్దరు కేంద్రమంత్రులున్నా కేంద్రం చేయూత సున్నా..

తెలంగాణ విషయంలో మొదట్నుంచీ మీనమేషాలు లెక్కిస్తున్న కేంద్రంలోని ఏన్డీయే సర్కార్ వరదల సందర్భంగా మరోసారి మొహం చాటేసింది. సాయం అందించే విషయంలోనూ.. సహాయక చర్యలు చేపట్టడంలోనూ ఉద్దేశపూర్వకంగా చేతులెత్తేసింది. తన భాగస్వామ్యంగా ఉంటే ఒక'లా'.. లేనివారికి మరో'లా' ఉంటుందని చాటింది. ఒకవైపు వరద విలయంతో ప్రజలు విలవిల్లాడిపోతుంటే తక్షణ సహకారమందించ చాల్సింది పోయి.. కంటితుడుపు చర్యగా హామీలిచ్చి చేతులు దులిపేసుకుంది. పక్క రాష్ట్రంలో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలకు సహకరించిన కేంద్రం.. తెలంగాణకు మాత్రం ఏ అంశంలోనూ అండగా నిలవలేకపోయింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్షంగా రంగంలోకి దిగి ప్రాణనష్టాన్ని నియంత్రించినప్పటికీ.. కేంద్రం నుంచి తగిన స్పందన లభించి ఉంటే కొంతమేరకైనా నష్టనివారణ ఉండేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.





స్పెషల్ కరస్పాండెంట్, హైదరాబాద్ (జనంసాక్షి):

తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు తుఫాను హెచ్చరికలు ఉన్నట్టు వాతావరణ శాఖ ముందే హెచ్చరించింది. ఇరురాష్ట్రాల ప్రభుత్వాలు కూడా ప్రభుత్వ యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశాయి. ఉద్యోగులెవరూ సెలవుల్లో ఉండకూడదని సీఎం రేవంత్ రెడ్డి కూడా ఆదేశించారు. కానీ నలువైపుల నుంచి ముంచుకొచ్చిన ఉపద్రవం ఖమ్మం జిల్లాను అతలాకు తలం చేసింది. పక్కన ఉమ్మడి జిల్లాలైన నల్లగొండ, వరంగల్ జిల్లాల్లోనూ తీవ్ర ప్రభావం పడింది. ప్రధానంగా మున్నేరు ముప్పు నుంచి ఖమ్మం తప్పించుకోలేకపోయింది. స్థానిక మంత్రులు, జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు చురుగ్గా స్పందించినప్పటికీ

మిగతా 2లో..



ఏపీలో వరదలు సంభవించిన తక్షణమే హెలికాప్టర్ల ద్వారా సహాయక చర్యలు చేపడుతున్న కేంద్రబృందాలు

## వినియోగంలో లేని ప్రభుత్వ భూముల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి

- రైతులకు ఉచిత సోలార్ పంపుసెట్లు అందించి ప్రొత్సహించాలి
- అందుకోసం పైలెట్ ప్రాజెక్టుగా కొండారెడ్డిపల్లెను ఎంచుకోవాలి
- విద్యుత్ శాఖపై సమీక్షలో అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి): రాబోయే రోజుల్లో తెలంగాణ ఒక బిజినెస్ హబ్ గా మారబోతోంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ అందుబాటులో ఉండేలా చూడాలి. ఐటీ, ఇండస్ట్రియల్ శాఖలతో సమన్వయం చేసుకుని యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలి. సోలార్ విద్యుత్ వినియోగం పెరిగేలా చర్యలు చేపట్టాలి. డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు కావాల్సిన చర్యలు చేపట్టండి. వివిధ శాఖల్లో వినియోగంలో లేని భూముల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి

మిగతా 2లో..

## వ్యూహాత్మక, ద్వైపాక్షిక భాగస్వామ్యం మరింత బలోపేతం

భారత్-బ్రూనై మధ్య నేరుగా విమాన సర్వీసులు

ప్రధాని మోదీ కీలక ప్రకటన

2లో



## సిరిసిల్లలో పవర్‌లూం క్లస్టర్ ఏర్పాటు చేయండి

కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ను కోరిన బండి

2లో

## కన్నీరు మిగిల్చిన మున్నేరు

- జోరుగా సహాయక చర్యలు
- బురద తొలగింపులో నిమగ్నమైన యంత్రాంగం





ఖమ్మం(జనంసాక్షి): ఎవరిని కదిపినా ఒకటే వ్యథ.. అందరిదీ ఒకటే గాథ. ఇదీ ఖమ్మంలోని మున్నేరు ముంపు బాధితుల పరిస్థితి. ఊహించని విధంగా వరద సృష్టించిన ప్రళయం ఎంతో మందిని నిరాశ్రయుల్ని చేసింది. ఏ కాలనీ చూసినా వరద మిగిల్చిన గాయాలే కనిపిస్తున్నాయి. వరద తగ్గడంతో తమ ఇళ్లకు చేరుకుంటున్న ప్రజలు జరిగిన నష్టం చూసి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఖమ్మంలో మున్నేరు ముంపు బాధితుల గోడు అత్యంత దయనీయంగా మారింది. ఏ కాలనీ చూసినా వరద మిగిల్చిన గాయాలే కనిపిస్తున్నాయి. ఎవరిని కదిలించినా కన్నీటి గాథలే వినిపిస్తున్నాయి. వరద తగ్గడంతో ఇళ్లకు చేరుకుంటున్న ప్రజలు సర్వం కోల్పోయామని బోరుమంటున్నారు. నాలుగురోజులుగా అంధకారంలోనే మగ్గుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్నేరు ఉగ్రరూపంతో ముంపు బారిన పడిన ఖమ్మంలోని కాలనీలు ఇంకా తేరుకోలేదు. ఖమ్మం నగరంలోని 15కాలనీలు, గ్రామీణ మండలంలోని 5 నుంచి 8కాలనీలు ఒక్కసారిగా విరుచుకుపడిన వరదతో పునరావాస కేంద్రాలకు తరలివెళ్లారు. వరద తగ్గడంతో ఇళ్లకు తరలివస్తున్న ప్రజలు జరిగిన నష్టం చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు. వెంకటేశ్వర కాలనీ, పద్మావతినగర్, బొక్కలగడ్డ, మోతీనగర్, దంసులాపురం, మంచికంటినగర్‌లో మున్నేరు వరద తీరని నష్టం మిగిల్చింది. వరద మిగిల్చిన నష్టానికి కట్టుబట్టలతో మిగిలామని తల్లడిల్లి పోతున్నారు. గ్యాస్ సిలిండర్లు, మంచాలు, వస్తువులు వరదార్పణ అయ్యాయని ఆవేదన చెందుతున్నారు.

మిగతా 7లో..




## రియల్ హీరో సుభాన్

- ప్రకాష్ నగర్ బ్రిడ్జిపై చిక్కుకున్న 9 మందిని కాపాడిన జేసిబి డ్రైవర్
- వికలాంగుడైనా ధైర్య సాహసలతో ముందడుగు..
- ప్రస్తుతం ఎక్కడ విన్నా సుభాన్ పేరే ట్రెండింగ్

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 4 (జనంసాక్షి):

నిజ జీవితంలో రీల్ మీద హీరోలనే ప్రతిరోజు చూస్తూ ఉండటం సర్వసాధారణం. కానీ కొందరూ తమ ధైర్య సాహసాలతో రియల్ హీరోలుగా నిలుస్తుంటారు. హరియానాకు చెందిన సుభాన్ అనే జెసిబి ఆపరేటర్ రియల్ హీరో అంటే నమ్మాల్సిందే..! దివ్యాంగుడు అయిన సుభాన్ మున్నేరు నది ప్రవాహానికి ఎదురెల్లి ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా తొమ్మిది మంది ప్రాణాలను కాపాడి రియల్ హీరో అనిపించుకున్నాడు. నది ప్రవాహానికి ప్రకాష్ నగర్ బ్రిడ్జిపై చిక్కుకున్న 9 మంది అర చేతిలో ప్రాణాలు పెట్టుకుని బిక్కుబిక్కుమంటున్న వేళ పోతే ఒకడినే తిరిగి వస్తే 9 మంది ప్రాణాలతో వస్తానని వెళ్లి వారిని కాపాడి రెండు తెలుగు రాష్ట్రాలే కాకుండా దేశం మొత్తం

మిగతా 2లో..



## రెజర్లను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన రాహుల్

లోక్‌సభ ప్రతిపక్షనేతతో భేటి అయిన స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్,బజ్‌రంగ్ పునియా

దిల్లీ(జనంసాక్షి): అధిక బరువు కారణంగా అనర్హత వేటు పడటంతో స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఒలింపిక్స్ కల చెదిరింది. అనంతరం భారమైన హృదయంతో కుస్తీకి వీడ్కోలు పలికింది. దీంతో ఆమె భవిష్యత్తు ప్రయాణం ఏంటనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈక్రమంలోనే ఆమె ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానున్నారంటూ గత కొంతకాలంగా జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే తాజాగా

మిగతా 2లో..

## మేడారంలో ప్రకృతి బీభత్సం

### టోర్నడోల వల్ల అడవుల్లో నేలకొరిగిన 50 వేల వృక్షాలు

ములుగు(జనంసాక్షి): మేడారం అడవుల్లో సుడిగాలి బీభత్సం సృష్టించింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవుల్లో భారీ వృక్షాలు నేలమట్టమయ్యాయి. 200 హెక్టార్లలో విస్తరించి ఉన్న ఈ అడవుల్లో పెద్ద ఎత్తున గాలిదుమారం, సుడిగాలులు బీభత్సం సృష్టించడంతో మహావృక్షాలు కిందకూలాయి. ఒకే చోట మూడు కిలోమీటర్ల విస్తీర్ణంలో లక్షకు పైగా చెట్లు నేలమట్టమయ్యాయి. సుడిగాలి బీభత్సానికి చెట్లు కూలడం చూసి స్థానికులు ఉలిక్కిపడ్డారు. టోర్నడోల కారణంగానే ఈ చెట్లు

మిగతా 2లో..



### సోషల్ వెల్ఫేర్‌లో పనిచేస్తున్న 6200 మంది తొలగింపు

## దుర్మార్గపు చర్య

మండిపడ్డ హరీశ్ • వరద బాధితులకు బీఆర్ఎస్ సాయం

ఎమ్మెల్సీలు,ఎమ్మెల్యే ఒక నెల వేతనం విరాళం అందిస్తామని వెల్లడి

2లో





బస్తర్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీకి

## భారీ నష్టం

### కేంద్ర కమిటీ సభ్యుడు జగన్ దాదా అలియాస్ ఏసోబు మృతి

హైదరాబాద్ (జనంసాక్షి) : ఛత్తీస్‌గఢ్ అడవుల్లో పోలీసులకు మావోయిస్టులకు జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత, తొలితరం నాయకుడు మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మావోయిస్టు పార్టీ తొలితరం నాయకుడు.. కేంద్ర కమిటీ సభ్యుడు మాచర్ల ఏసోబు అలియాన్ జగన్ ఊరఫ్ రణదేవ్ దాదా ఛత్తీస్‌గఢ్ అడవుల్లో జరిగిన ఎదురు కాల్పుల్లో మృతిచెందారు. రణ్‌దేవ్ దాదా కేంద్ర మిలటరీ ఫోర్స్ ఇంఛార్జ్‌గా పార్టీ కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. మహారాష్ట్ర – ఛత్తీస్‌గఢ్ బార్డర్ ఇంఛార్జి అయిన రణదేవ్ బాబాను

మిగతా 2లో..



## కోలుకుంటున్న ఖమ్మం



- సహాయక చర్యల్లో నిమగ్నమైన జిల్లా యంత్రాంగం
- ముంపు ప్రాంతాలపై కలెక్టర్ ముజామిల్ ఖాన్ ప్రత్యేక దృష్టి
- స్వయంగా పర్యటించి వరద నష్టంపై ఆరా
- ఆపత్కాలంలో పోలీస్, ఫైర్, ఎన్డిఆర్ఎఫ్ బృందాల సేవలు

బాధితుల వద్ద వరద నష్టం వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ముజామిల్ ఖాన్

2లో

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
05.09.2024



## కోదండరామ్ సేవలు అభినందనీయం

**ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించిన ఉప్పల శ్రీనివాస్ గుప్త**

**హైదరాబాద్(జనంసాక్షి):** చిక్కడపల్లి లోని త్యాగరాజ గానసభలో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్,రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో జేఏసీ చైర్మన్ గా రాష్ట్ర సాధన కోసం కోదండరామ్ సేవలు అభినందనీయం అని ఆయన చేసిన సేవలు గుర్తించి కాంగ్రెస్ పార్టీ గవర్నర్ కోటా ఎమ్మెల్సీ గా గుర్తింపు ఇవ్వడం చాలా సంతోషమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతల రజినీకాంత్ గుప్త జనగామ జిల్లా అధ్యక్షుడు బిజ్జల నవీన్ , రాష్ట్ర యువజన సంఘం నాయకులు నరేష్ గుప్త, భరత్ గుప్త సాయి గుప్త శ్రీధర్ వీరేందర్ గుప్త, టీజేఎస్ నాయకురాలు పుష్పలత పాల్గొన్నారు.

## బంగారు మైసమ్మ తల్లిని దర్శించుకున్న ఉప్పల



**హైదరాబాద్(జనంసాక్షి):** నాగోల్ లోని నువ్వుల బండ లోని బంగారు మైసమ్మ తల్లిని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్,రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ తల్లి ఆశీ స్సులతో అందరూ సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు .ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుంది అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్ర కళ, అనసూయ లక్ష్మణ్, జగదీశ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

### మళ్లీ గోదావరికి వరదపోటు

**భద్రాచలం(జనంసాక్షి):** ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో' భద్రాచలంలో గోదావరికి వరద పోటెత్తుతున్నది. గంట గంటకు వరధ ఉధృతి పెరుగుతున్నది. నీటి మట్టం 43.1 అడుగులు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ క్రమలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేష్‌వి పాటిల్ సూచించారు. వాగులు, చెరువులు వద్దకు ఎవరు వెళ్ల కూడదన్నారు

# తెలంగాణపై ఎందుకీ వివక్ష..?

వరద విలయం వేలాది మందిని నిరాశ్రయు లుగా మార్చింది. వందకుపైగా గ్రా మాలు జలదిగ్బంధమ య్యాయి. ఈ నేపథ్యంలో స్వయంగా సీఎం కూడా పరిస్థితిని పర్యవేక్షించేందుకు ఖమ్మంకు చేరుకున్నారు. రమారమి రూ.5వేల కోట్ల నష్టం వాటిల్లినట్టు, తక్షణ సాయంగారూ.2వేల కోట్లు ఇవ్వాలని కేంద్రానికి విన్నవించారు. కానీ ప్రధాని మోడీ, అమిత్ షాలు సీఎం రేవంత్‌కు ఫోన్ చేసి ఆరా తీయడం, హామీనియ్యడం మినహా తెలంగాణ కు ఎలాంటి తోడ్పాటూ అందించకపోవడం సర్వత్రా చర్చనీయాం శంగా మారింది.

**పక్కపక్కనే ఎందుకీ తారతమ్యం..?**

తెలంగాణ, ఏపీకి అతిభారీ వర్ష సూచనలు అందడం, అనుకు న్న ట్టుగానే రెండు రాష్ట్రాల్లో కుంభవృష్టి కురవడం క'న్నీళ్ల' పర్వాన్ని మిగిల్చింది. ఆదివారం కురిసిన భారీ వానలకు తెలంగాణ ఏపీ మధ్య రాకపోకలు కూడా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఆదివారం నాటి పరిస్థితులను తెలుసుకున్న మోడీ, అమిత్‌షాలు.. రెండు రాష్ట్రాలకు అవసరమైన సహకారం అందిస్తామని ముఖ్యమంత్రులకు హామీనిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి మేరకు కేంద్రం ప్రభుత్వం వెంటనే స్పందించి ఆగమేఘాల మీద స్పందించి కేంద్రబృందాలను పంపింది. మరు సటి రోజే సోమవారం ఉదయం నాటికి కేంద్రం నుంచి 40 వరకు పవర్ బోట్లు, పది హెలికాప్టర్లతో పాటు వంద మంది ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. సహాయక చర్యలు కూడా హెలికాప్టర్లు పంపుతున్నట్టు నేరుగా ముఖ్యమంత్రికి ప్రధాని నుంచి ఫోన్ వెళ్లింది. కానీ అవన్నీ ఏపీకి మాత్రమే పరిమితం కావడం గమనార్హం. ఆపదలో ఉన్న ఏ రాష్ట్రానికైనా తోడుండటం తప్పుకాదు కానీ.. వేలాది మంది ప్రమాదంలో ఉన్నప్పుడు స్పందించే తీరు వివక్షాపూరితంగా ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి. తెలంగాణకు తక్షణం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు కాదుకదా.. ఒక్క హెలీకాప్టర్ కూడా కేంద్రం నుంచి రాకపోవడం తెలంగాణ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు.

**బాధితులు సమానం కాదా..?**

ఇటీవల కేంద్ర బడ్జెట్‌లోనూ తెలంగాణ ఊసే లేకుండా పోగా.. ఎన్‌డీయే మిత్రపక్షాలకు పెద్దపీట వేయడం విదితమే. నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లు ఇదే వైఖరి ప్రదర్శించడమూ తెలిసిందే..! అయితే అదంతా కేటాయింపులకు సంబంధించిన అంశం కాగా.. ప్రజలు సమస్యల్లో ఉన్నప్పుడు మానవతా హృదయంతో చూడాల్సిందిపోయి ప్రతిపక్ష ప్రభుత్వాల పట్ల వివక్ష ప్రదర్శించడం 'వరద'సాక్షిగా బహిర్గతమైంది. ఒకవైపు వేలాదిమంది సర్వం కోల్పోయి ఆకలితో అలమటిస్తుంటే.. కనీస సహాయ సహకారాలు అందించకపోవడం తెలంగాణ రాజకీయాల్లో చర్చకు దారితీసింది. మిత్రపక్షాలకు ఒకన్యాయం.. ప్రతిపక్షాలకు మరో న్యాయమా అంటూ సామాన్యుల నుంచి ప్రశ్నలు తలెత్తాయి. తెలంగాణ పట్ల ఇప్పటికైనా స్పందించి నిరాశ్రయులు, రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణ ఆర్థిస సాయం ప్రకటించాలని డిమాండ్ వ్యక్తమవుతోంది.

### వ్యూహాత్మక, ద్వైపాక్షిక భాగస్వామ్యం మరింత బలోపేతం

**బందర్‌సెరీబెగవాన్(జనంసాక్షి):** బ్రూనై పర్యటన సందర్భంగా ఆ దేశ సుల్తాన్ హాజీ హసనల్ బోల్కియాతో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ భేటీ అయ్యారు. రక్షణ, వాణిజ్యం, ప్రాంతీయ సహకారం వంటి ద్వైపాక్షిక అంశాలపై ఇరువురు సుదీర్ఘ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ కీలక ప్రకటన చేశారు. త్వరలో ఇరు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం సుల్తాన్ అధికారిక నివాసం ఇస్తానా నురుల్ ఇమాన్‌కు చేరుకున్న ప్రధాని మోదీకి బోల్కియా ఆయన కుటుంబ సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "భారత యాక్ట్ ఈస్ట్ పాలసీ, ఇండో-పసిఫిక్ విజన్‌లో బ్రూనై మాకు ముఖ్య భాగస్వామి. ఇరు దేశాల సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల భావోద్వేగాలను పరస్పరం గౌరవించుకుంటాం. ఈ పర్యటనతో రెండు దేశాల మధ్య వ్యూహాత్మక, ద్వైపాక్షిక భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని విశ్వసిస్తున్నా" అని మోదీ వెల్లడించారు. ఈ భేటీ సందర్భంగా ఇరు దేశాల మధ్య పలు ఒప్పందాలు జరిగినట్లు భారత విదేశాంగ శాఖ అధికారులు వెల్లడించారు. రెండు దేశాల మధ్య త్వరలోనే నేరుగా విమాన సర్వీసులను ప్రారంభించేందుకు అంగీకారం కుదిరినట్లు తెలిపారు.

### సోషల్ వెల్ఫేర్‌లో పనిచేస్తున్న 6200 మంది తొలగింపు దుర్మార్గపు చర్య

**హైదరాబాద్(జనంసాక్షి):** సోషల్ వెల్ఫేర్ విద్యాలయాల్లో పనిచేస్తున్న 6,200 మంది పార్ట్‌టైం టీచర్లు, లెక్చరర్లు, డీఈవోలను ఏకకాలంలో విధుల నుంచి తొలగించడం దుర్మార్గమైన చర్య అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. దీన్ని బీఆర్‌ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. మూడు నెలలుగా జీతాలు చెల్లించరు. ఇదేంటని అడిగినందుకు ఉద్యోగాల నుండి తొలగిస్తారు.. ఇదేనా మీ ప్రజా పాలన? అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఇదేనా మీరు చెప్పిన ఇందిరమ్మ రాజ్యం? అని నిలదీశారు. విద్యా సంవత్సరం మధ్యలో టీచర్లను తొలగించి వారి కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయుల బతుకులను ఆగం చేశారని మండిపడ్డారు. మరోవైపు మీ నిర్లక్ష్య, అర్థం లేని నిర్ణయం వల్ల వేలాదిమంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలగించిన పార్ట్‌టైం లెక్చరర్లు, టీచర్లు, డీఈవోలను వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మూడు నెలల పెండింగ్ జీతాలను తక్షణమే చెల్లించాలని బీఆర్‌ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

**వరద బాధితులకు బిఆర్‌ఎస్ సాయం**

రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలో వరద బీభత్సం అంతాఇంతా కాదు. భారీ వరదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యవసర వస్తువుల కోసం అల్లాడిపోతున్న పరిస్థితి. ఈ క్రమంలో వరద బాధితులకు విరాళాలు ఇచ్చేందుకు అనేక మంది ముందుకు వస్తున్నారు. తాజాగా బీఆర్‌ఎస్ నేతలు కూడా వరద బాధితుల కోసం భారీ విరాళాన్ని అందజేయనున్నట్లు మాజీ మంత్రి హరీష్‌రావు ప్రకటించారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఒక నెల జీతం విరాళంగా ఇవ్వాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారని తెలిపారు. ఖమ్మం వరదల కారణంగా చాలా నష్టపోయారన్నారు. సిద్దిపేట కౌన్సిలర్లు కూడా ఒక నెల జీతం ఇవ్వాలని నిర్ణయించారని మాజీ మంత్రి ప్రకటించారు. మానవ సేవయే మాధవ సేవ.. ఆపదలో ఉన్న వారికి సేవ చేస్తే భగవంతుడికి సేవ చేసినట్టే అని చెప్పుకొచ్చారు. ఖమ్మంలో వరదలు వస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారన్నారు. అన్ని రకాల వస్తువులు పూర్తిగా ధ్వంసం అయ్యాయన్నారు. సిద్దిపేట నుంచి సేవలు అందించేందుకు చాలా మంది ముందుకు వచ్చారని తెలిపారు. సిద్దిపేట నుంచి రేపు 6 లారీల్లో సామాన్లు పంపిస్తున్నామని తెలిపారు.

### వినియోగంలో లేని ప్రభుత్వ భూముల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి

అవసరమైన చర్యలు తీసుకోండి.రైతులకు సోలార్ పంప్ సెట్ లను ఉచితంగా అందించి వారిని సోలార్ విద్యుత్ వైపు ప్రోత్సహించాలి.కొండారెడ్డి పల్లెను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని అధికారులకు ఆదేశం.సోలాట్ పంప్ సెట్ ల ద్వారా వచ్చే మిగులు విద్యుత్ పై రైతుకు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయండి.వంటగ్యాస్ బదులుగా సోలార్ సిలిండర్ విధానాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టండి.వీటిపై మహిళా సంఘాలకు శిక్షణ అందించి వారిని సోలార్ సిలిండర్ బిజినెస్ వైపు ప్రోత్సహించాలి.అటవీ భూముల్లోనూ సోలార్ విద్యుత్ ఉత్పత్తికి చర్యలు చేపట్టాలి.ప్రతీ ఏటా 40వేల మెగావాట్స్ విద్యుత్ అందుబాటులో ఉండేందుకు చర్యలు చేపట్టండి.ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి దుబారాను తగ్గించాలి.ఓవర్ లోడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టండి.ఒక్క నిమిషం కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉండొద్దు.వినియోగదారులకు 24గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామన్న నమ్మకం కలిగించాలి.వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బంది కలగనీయొద్దు.

### బస్తర్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీకి భారీ నష్టం

ఎదురు కాల్పుల్లో హతమార్చినట్టు దంతెవాడ పోలీసులు ధృవీకరించారు. రణదేవ్ బాబా స్వస్థలం హన్మకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడ గ్రామం అని పోలీసులు తెలిపారు. జగన్‌పై ఇప్పటికే రూ. 25 లక్షల రూపాయల రివార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. జగన్‌తో పాటు మరో ఎనిమిది మంది చనిపోయినట్లు పోలీసులు వెల్లడించారు.

**చనిపోయిన మావోయిస్టుల వివరాలు..**

రణధీర్.. డికెఎస్ జెడ్ సిఎం, వరంగల్ నివాసి (రివార్డు 25 లక్షలు), కుమారి శాంతి.. 31 పిఎల్ సభ్యులు (రివార్డు 05 లక్షలు), సుశీల మడకం.. ఎసిఎం (రివార్డు- 05 లక్షలు), గంగి ముచకి, హెూదా- కాటేకల్యాణ్. ఏరియా కమిటీ సభ్యుడు (రివార్డు-05 లక్షలు), కోసా మాద్వి, హెూదా- మలంగిర్, ఏరియా కమిటీ పార్టీ సభ్యుడు (రివార్డు- 05 లక్షలు), లలిత.. డివిసిఎం సురక్షా దళ్ సభ్యుడు (రివార్డు 05 లక్షలు), కవిత.. గార్డ్ ఆఫ్ ఏఓబిఎస్ జెడ్ సి (రివార్డు- 05 లక్షలు), 8. హిడ్మే మంకం.. డివిసిఎం సురక్షా దళ్ సభ్యుడు (రివార్డు 02 లక్షలు), కమలేష్.. ప్లాటూన్ సభ్యుడు, బీజాపూర్ నివాసి (రివార్డ్ 2 లక్షలు)

# రియల్ హీరో సుభాన్

గర్వించేలా రియల్ హీరో అనిపించుకున్నాడు. గడిచిన మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు మున్నేరు నది ఉగ్రరూపం దాల్చడంతో ఖమ్మం రూరల్ పరివాహక ప్రాంతాలు భారీ వర్షాల కారణంగా అతలాకుతలం అయ్యాయి. రూరల్ మండలం వెంకటగిరి కి చెందిన ఓజుబోయిన శ్రీనివాసరావు కుటుంబానికి మండలంలో మున్నేరు నది తీరంలో చికెన్ షాప్ పలు వ్యాపారాలు ఉన్నాయి. ఆయా దుకాణాల్లో 20 మంది వరకు పనిచేస్తుండగా వాళ్లలో 8 మంది ఆ దుకాణాల వెనకే నివాసం ఉంటున్నారు. ప్రతిరోజులాగే ఆదివారం ఉదయం కూడా దుకాణాలు తెరిచి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. భారీ వర్షాలకు మున్నేరు పొంగడంతో ఉదయం వరకు నీరు దుకాణాలకు తాకింది. దుకాణాలలో పనిచేసే నీ మంది అక్కడే మరో యువకుడుతో కలిసి ప్రకాష్ నగర్ వంతెన దాటేందుకు వెళ్లగా భారీ వరద ఒక్కసారిగా పోటెత్తింది. వారు వంతెనపై సగం దూరం వెళ్లేసరికి వెంకటగిరి వైపు కూడా వరద ముంచేత్తగా ఆ తొమ్మిది మంది వంతెనపై ఉండిపోయారు. సహాయక బృందాలు బాధితులను రక్షించేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా అన్ని విఫలమయ్యాయి. రాత్రి సమయం 11 గంటలు కాగా వంతెనపై ఉన్నవారిని రక్షించేందుకు సుభాన్ ప్రాణాలు ప్రణంగా పెట్టి జెసిబి సహాయంతో వారిని రక్షించారు.

**మా డాడీ సాధించాడు..**

సుభాన్ కూతురు భావోద్వేగంతో అన్న మాటలు సామాజిక మాధ్యమాలలో ట్రేండింగ్ అవుతున్నాయి. జెసిబి ఆపరేటర్ సుభాన్ బ్రిడ్జిపై చిక్కు కున్న 9 మందిని కాపాడి బయటకు తీసుకువచ్చి ఒకరి తర్వాత ఒకరు జెసిబి దిగుతున్న సమయంలో సుభాన్ కూతురు మొత్తానికి మా డాడీ సాధించాడు అనే మాటలు వింటుంటే నేటిజన్స్ పొగడ్తలతో ముంచేత్తుతున్నారు. కాగా బ్రిడ్జి మీద చిక్కుకున్న తర్వాత బాధితుల మాటల్లో వింటుంటే సముద్రపు అలలు గుర్తుకు వచ్చాయని అన్నారు. ఏ క్షణాన ఏమి జరుగుతుందో అని తెలియక బిక్కుబిక్కుమని అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని బ్రతికమని తెలిపారు.

**సాహసం ఒకరిది.. సత్కారం ఒకరికి..**

వరద బాధితులను పరామర్శించేందుకు మంగళవారం ఖమ్మం బీఆర్‌ఎస్ నేతలు సుభాన్ విషయంలో పొరపాటుపడ్డారు. అత్యుత్సాహంగా వ్యవహరించారో, ఆతృతపడ్డారో వారికే తెలియాలి. జెసిబి ఆపరేటర్ సుభాన్ అనుకొని మరొక వ్యక్తిని అభినందించి సన్మానించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు సన్మానం పొందిన వ్యక్తి ఎవరో అని చర్చించుకోవడం చర్చనీయాంశంగా మారింది.

# కోలుకుంటున్న ఖమ్మం

**ఖమ్మం జిల్లా ప్రతినిధి(జనంసాక్షి):** ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ఖమ్మం నగరం అతలాకుతలమైంది. మున్నేరు ఉగ్రరూపానికి ఖమ్మం నగరం జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. ముఖ్యంగా మున్నేరు పరివాహక ప్రాంతంలో ప్రజలు సర్వస్వం కోల్పోయారు. కట్టుబట్టలతో మిగిలారు. గత నాలుగు రోజులుగా బాధితుల అహంకారాల నడుమ అత్యంత దయనీయ పరిస్థితులను ఖమ్మం ప్రజలు అనుభవించారు. వరదల ధాటికి కకావికులమైన ఖమ్మం నగర ప్రజలకు ధైర్యం చెప్పి భరోసా కల్పించేందుకు జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ ప్రత్యేక దృష్టి సారించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో స్వయంగా తిరుగుతూ బాధితులకు భరోసా కల్పిస్తున్నారు. ఇప్పటికే ముంపు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి బాధితులను ఆ శిబిరాలకు చేర్చారు. అక్కడ వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి వేళల్లో అల్పాహారం, భోజనం అందిస్తూ వారికి అండగా నిలిచారు. దీంతోపాటు వరద ప్రభావంతో నీట మునిగిన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టి, పర్యవేక్షించేందుకు ఒక్కో ప్రాంతానికి ఒక్కో జిల్లా అధికారిని కలెక్టర్ కేటాయించారు. వీరిని నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లాస్థాయిలో కలెక్టర్ స్వయంగా పర్యవేక్షణ చేస్తున్నారు. వరద ప్రభావిత ముంపు ప్రాంతాల్లో ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ట్రైనీ కానిస్టేబుళ్ల సహాయక చర్యల్లో పాలుపంచుకుం టున్నారు. వీరికి జిల్లా పోలీస్ బాస్ సునీల్ దత్ దిశా నిర్దేశం చేస్తున్నారు. వరద బాధితులకు అండగా ధంసలాపురం, శ్రీనివాసనగర్, ప్రకాశ్ నగర్,రాజీవ్ గృహకల్ప, జలగం నగర్, కవిరాజ్ నగర్, బొక్కలగడ్డ ముంపు ప్రాంతాలలో స్వయంగా పర్యటించి పరిస్థితులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పర్యవేక్షించారు. నాలుగు రోజులుగా వీధుల్లోనే ఫైర్ సిబ్బంది భారీ వరద ఉధృతి నేపథ్యంలో ఫైర్ సిబ్బంది ఎనలేని సేవలు అందిస్తున్నారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ బి. అజయ్ కుమార్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వర్షాల వరద ఉధృతి తగ్గడంతో చురుగ్గా పారిశుద్ధ్య పనుల్లో వేగం పెరిగింది. ఇళ్లలోకి భారీగా చేరిన బురద‌ను వాటర్ ట్యాంకర్లు ద్వారా తొలగిస్తున్నారు. రోడ్లపై విరిగి పడిన విద్యుత్ స్తంభాలు తొలగించి పునరుద్ధరణ పనులు వేగవంతం చేస్తున్నారు. పోలీస్ శాఖతో సమన్వయం చేసుకొని అన్ని మాపక సిబ్బంది విశేష సేవలు అందిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఫైర్ స్టేషన్ లో సిబ్బందితోపాటు హనుమకొండ జిల్లా నుండి సైతం సిబ్బందిని తీసుకువచ్చి సహాయక కార్యక్రమాల్లో భాగస్వాములను చేశారు.

### రెజర్లను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన రాహుల్

ఆమె కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తో సమావేశమవడం ఈ ఊహాగానాలకు మరింత బలాన్నిచ్చినట్లయ్యింది. బుధవారం ఉదయం రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, బజరంగ్ పునియా కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. ఆ ఫొటోను కాంగ్రెస్ పార్టీ తమ 'ఎక్స్' ఖాతాలో షేర్ చేసింది. రాహుల్‌ను వీరు ఎందుకు కలిశారన్న దానిపై స్పష్టత లేనప్పటికీ.. హరియాణా అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్నవేళ ఈ పరిణామాలు ఆసక్తి రేపుతున్నాయి. ఎన్నికల్లో ఫొగాట్, పునియా పోటీ ఖాయమే అనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. వినేశ్ ఫొగాట్ కాంగ్రెస్‌లో చేరే అవకాశాలున్నాయని గత కొంతకాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. అందుకు తగ్గట్లుగానే ఇటీవల ఆమె ఒలింపిక్స్ ముగించుకొని స్వదేశానికి చేరుకున్న సమయంలో.. ఎయిర్‌పోర్టు వద్ద కాంగ్రెస్ ఎంపీ దీపిందర్ హుడా ఆమెకు స్వాగతం పలకడం ప్రాధాన్యం సంతరించుకుంది. అంతకుముందు కూడా వినేశ్‌ను రాజ్యసభకు పంపాలంటూ కొంతమంది కాంగ్రెస్ నేతలు అభిప్రాయం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. హరియాణా అసెంబ్లీ ఎన్నికల కు సంబంధించి కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సోమవారం భేటీ అయ్యింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై చర్చ జరిపి 34 మందిని ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. నేడో, రేపో అధికారికంగా అభ్యర్థుల జాబితాను ప్రకటించే అవకాశాలున్నాయి. ఈ సమయంలో పునియా-వినేశ్-రాహుల్ భేటీ జరగడం గమనార్హం. ఆమెను అసెంబ్లీ ఎన్నికల్లో నిలబెట్టాలని కాంగ్రెస్ యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక, పునియాకు కూడా టికెట్ ఇచ్చే అవకాశాలున్నాయి. గత హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు ముందు వినేశ్ సోదరి బబితా 2019లో భాజపా లో చేరిన సంగతి తెలిసిందే. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో దాద్రి స్థానం నుంచి పోటీ చేసిన ఆమె.. ఓటమి పాలయ్యారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి ఆమెకు కమలం పార్టీ టికెట్ ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు అదే స్థానం నుంచి వినేశ్‌ను దించాలని కాంగ్రెస్ ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. ఇదే నిజమైతే ఈసారి హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఫొగాట్ సిస్టర్స్ పోరు దేశవ్యాప్తంగా ఆసక్తికరంగా మారనుంది. అక్టోబరు 5న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

### నష్టం వివరాలు పంపండి

**అందుబాటులో 1345 కోట్ల ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులు**

**సీఎస్‌కు కేంద్ర హోంశాఖ లేఖ**

న్యూఢిల్లీ(జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కేంద్ర హోంశాఖ లేఖ రాసింది. తెలంగాణలో వరద నష్టం వివరాలు నిర్ణీత ఫార్మాట్లో తక్షణమే పంపాలని కేంద్ర హోమ్ శాఖ సూచించింది. 1345 కోట్ల రూపాయల ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులు ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. వరదల్లో సాయం చేసినందుకు ఇప్పటికే 12 ఎన్‌డీఆర్‌ఎఫ్ దళాలు, రెండు హెలికాప్టర్లు పంపించినట్లు కేంద్ర హోం శాఖ వెల్లడించింది. ఎస్డీఆర్‌ఎఫ్ నిధికి కేంద్రం వాటా నిధుల విడుదలకు తక్షణమే వివరాలు పంపాలని కేంద్రం ఆదేశించింది. జూన్‌లో 208 కోట్ల రూపాయల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి వినతి రాలేదని ఈ సందర్భంగా కేంద్రం తెలిపింది. ఇది వరకు ఖర్చు చేసిన వాటి యుటీలైజేషన్ సర్టిఫికెట్స్, వరద నష్టం వివరాలు పంపాలని కోరింది.

### సిరిసిల్లలో పవర్ లూం క్లస్టర్ ఏర్పాటు చేయండి

న్యూఢిల్లీ(జనంసాక్షి): సిరిసిల్లలో పవర్ లూం క్లస్టర్ ఏర్పాటు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ను బుధవారం నాడు బండి సంజయ్ కలిశారు. పవర్ లూం క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. నేషనల్ హ్యాండ్లూం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నేతన్నలు కొనుగోలు చేసేందుకు అవసరమైన ముడిసరుకు డిపో(యార్న్ డిపో)ను ఏర్పాటు చేయాలని రిక్వెస్ట్ చేశారు. ఫ్యాషన్ పెరిగిపోయి, సంప్రదాయ ఉత్పత్తులకు పోటీ పెరిగిపోయిందని, దాంతోపాటు ముడిసరుకు ధరలు పెరగడంతో ఉత్పత్తుల ధర అధికం అవుతుందన్నారు. కనుక ముడిసరుకు ఖర్చులు పెరగడంతో చేనేత కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని.. వారికి సబ్సిడీని 80 శాతం మేరకు పెంచాలని బండి సంజయ్ కోరారు. సిరిసిల్లలో పవర్ లూం క్లస్టర్ ను ఏర్పాటు చేస్తే, స్థానికంగా వేలాది మంది చేనేత కార్మికులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. సంప్రదాయ మెషీన్లు కాకుండా, ఆధునిక యంత్రాలు వారికి అందిస్తే.. ఉత్పాదకత పెరుగుతుందని తెలిపారు. కార్మికులు సాధ్యమైనంత త్వరగా నేత ఉత్పత్తులను అందిస్తూ, అప్పుల బాధ లేకుండా కుటుంబాన్ని పోషించుకుంటారని పేర్కొన్నారు. నాణ్యమైన వస్త్రాలను అందించడంతోపాటు వారి మధ్య ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంచుతాయన్నారు. పావలా వడ్డీకే రుణాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. తన అభ్యర్థనపై గిరిరాజ్ సింగ్ సానుకూలంగా స్పందించారని.. యార్న్ డిపో ఏర్పాటుతోపాటు పవర్ లూం క్లస్టర్ మంజూరుపై త్వరలోనే నిర్ణయం తీసుకుం టామన్నట్లు తెలిపారు.

### మేడారంలో ప్రకృతి బీభత్సం


కూలి ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. భారీ వృక్షాలు కూడా నేలకు ఒరగడాన్ని బట్టి కనీసం గంటలకు 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వచ్చి ఉంటాయని తెలిపారు. అయితే 50 వేలకు పైగా చెట్లు కూలిపోవడంపై సమగ్ర విచారణ జరుపుతున్నామని అటవీ శాఖ అధికారులు వెల్లడించారు. కాగా మేడారంలో 500 ఎకరాల్లో చెట్లు నేలకొరగడంపై మంత్రి సీతక్క ఆరా తీశారు. రాష్ట్ర సచివాలయం నుంచి పీసీసీఎఫ్, డీఎఫ్ఓలతో టెలిఫోన్లలో మంత్రి మాట్లాడారు. రెండు రోజుల క్రితమే చెట్లు నేలకొరిగిన ప్రాంతాన్ని సీతక్క సందర్శించారు. లక్ష చెట్ల వరకు నేలకూలడం పట్ల మంత్రి విస్మయం చెందారు. ఈ స్థాయిలో అటవీ విధ్వంసం జరగడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ములుగు అడవుల్లో సుడిగాలి వల్ల లక్ష చెట్ల వరకు నేలకొరిగాయన్నారు. వందల ఎకరాల్లో నష్టం వాటిల్లిందని తెలిపారు. వృక్షాలు కూలడంపై విచారణకు ఆదేశించామన్నారు. డ్రోన్ కెమెరాల సహాయంతో జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. అడవిలో సుడిగాలి వచ్చింది కాబట్టి ప్రాణనష్టం జరగలేదన్నారు. ఈ సుడిగాలి గ్రామాల్లో సంభవించి ఉంటే పెను విధ్వంసం జరిగేదన్నారు. మక్క సారలమ్మ తల్లుల దయ వల్లే సుడిగాలి ఊర్ల మీదకు రాలేదన్నారు. తల్లుల దీవెనతోనే ప్రజలకు సురక్షితంగా బయటపడగలిగారన్నారు. చెట్లు నేలకూలడంపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రం నుంచి పరిశోధన జరిపించి కారణాలు గుర్తించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అటవీ ప్రాంతంలో చెట్లను పెంచేలా ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని సీతక్క వినతి చేశారు. అడవిని తిరిగి పునరుద్ధరించేందుకు కేంద్రం ముందుకు రావాలని అన్నారు.

### భారీ వర్షాలతో రైతులకు తీరని నష్టం

**ఆందోళన వద్దు..అందరినీ ఆదుకుంటాం**

**వరద ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి పొంగులేటి**

**ఖమ్మం(జనంసాక్షి):** వరద నష్టాన్ని అంచనా వేస్తున్నామని, రైతులకు తీవ్రంగా నష్టం జరిగిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అందరినీ ఆదుకునే ప్రయత్నంలో ప్రభుత్వం ఉందని అన్నారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్, నేలకొండపల్లి మండలాల్లోని వరద ప్రాంతాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. అతి భారీ వర్షాల కారణంగా తెలంగాణ రాష్ట్రంలో చాలా జిల్లాలు అతలాకుతలం అవుతున్నాయన్నారు. ఉమ్మడి ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు మహబూబాద్, ములుగు, నలగొండ జిల్లాల్లో భారీ నష్టం జరిగిందన్నారు. వాగులు, వంకలు పొరడం వల్ల రైతులకు అధిక నష్టం వాటిల్లిందని పొంగులేటి అన్నారు. అకస్మాత్తుగా వరదలు పెరిగిపోవడంతో ఇల్లు వదిలేసి కట్టుబట్టలతో ప్రజలు రోడ్డెక్కాలన్నారు. ఇన్ని సంవత్సరాల్లో ఎప్పుడూ లేని విధంగా ఇంత ఉధృతంగా వర్షం వరదలు రాలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, విజయవాడ వరద ఖమ్మం జిల్లా నుంచి వెళుతుందని పొంగులేటి అన్నారు. వరదంతా పంట పొలాల్లో చేరి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. రైతుల బాధ, ఆవేదన వర్ణాతీతమన్నారు. ప్రత్యక్షంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల ఇళ్లకు వెళ్లి మరీ నష్టం ఎంత మేర జరిగిందో ప్రత్యక్షంగా చూసి చలించిపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపో యిన రైతులకు అండగా నిలవాలని ఆ దిశగా ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రతి గ్రామంలో జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నామన్నారు. దీనిని జాతీయ విపత్తుగా కేంద్రం స్వీకరించి నష్టాన్ని అందజేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణకు రూ. 5438 కోట్లు అన్ని విధాలా నష్టం జరిగినట్లు కేంద్రానికి లేఖ ద్వారా తెలియజేశారని పొంగులేటి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా సహకరించి నష్టాన్ని అందజేస్తుందని కోరుతున్నామని పొంగులేటి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన నష్టానికి ఎలా చేయాలనుకుంటుందో కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో జరిగిన విపత్తు కూడా అలానే సహాయం అందించాలన్నారు. ఈ రాష్ట్రంలో నష్టం జరిగిన రైతులు, ప్రజలకి ఈ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అత్యవసరంగా కొంత సహాయంతో పాటు జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం ఆదుకుంటుందని పొంగులేటి తెలిపారు. ఈ వర్షానికి తడిసిన ధాన్యాన్ని సివిల్ సప్లై అధికారులు తీసుకొని ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడం జరుగుతుందని భరోసా ఇచ్చారు. రైతులతో పాటు సామాన్య ప్రజానీకానికి ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని.. అవసరమైన సహాయాన్ని అందజేస్తుందని.. కాబట్టి ప్రజలు ఎవరు ఆందోళన చెందవద్దని పొంగులేటి తెలిపారు.



# వరదబాధితులకు సాయంగా టాలీవుడ్

- ఇరు రాష్ట్రాలకు కోటి సాయం ప్రకటించిన మెగాస్టార్



**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (జనంసాక్షి)** : దేశంలో ఎప్పుడు, ఎలాంటి కష్టం వచ్చినా టాలీవుడ్ పరిశ్రమ కూడా తనవంతుగా సాయం అందిస్తోంది. గత నెలలో కేరళ వాయనాడ్ వరదల నేపథ్యంలో మొదటగా స్పందించి సాయం అందించింది టాలీవుడ్ మాత్రమే. ఇప్పుడు మన రెండు ఉభయ తెలుగు రాష్ట్రాలు వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో బాధితులను ఆదుకునేందుకు టాలీవుడ్ సెలబ్రిటీలు చాలామంది ముందుకొచ్చి విరాళాలు ప్రకటిస్తున్నారు. ఇప్పటికే జూనియర్ ఎన్టీఆర్, సూపర్ స్టార్ మహేష్ బాబు, పవన్ కల్యాణ్, బాలకృష్ణ, విశ్వక్ సేన్, సిద్దు జొన్నలగడ్డ, కథానాయిక అనన్య నాగళ్ల, యాంకర్ స్రవంతి, దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాతలు రాధాకృష్ణ, వంశీ, ఆయ్ మూవీ టీం తమవంతు సాయంగా ప్రకటించగా తాజాగా మెగాస్టార్ చిరంజీవి రూ. 50 లక్షల చొప్పున రెండు తెలుగు రాష్ట్రాలకు రూ. కోటి విరాళం ప్రకటించారు. గత నెలలో వయనాడ్ వరదల నేపథ్యంలోనూ చిరంజీవి ఆ రాష్ట్ర సీఎం సహాయ నిధికి రూ. కోటి ఇవ్వడం విశేషం. ఈ సందర్భంగా చిరంజీవి తన సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ.. వరద ప్రభావం వల్ల ప్రజలకు కలిగిన, కలుగుతున్న కష్టాలు నన్ను కలిచివేస్తున్నాయి. పదుల సంఖ్యలో అమాయక ప్రాణాలు కోల్పోవడం ఎంతో విషాదకరం. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల నిర్దేశకరలో రెండు ప్రభుత్వాలు శాయాశక్తులా పరిస్థితిని మెరుగు పరచడానికి కృషి చేస్తున్నాయి. మనందరం ఏదో విధంగా సహాయక చర్యల్లో పాలుపంచుకోవాల్సిన అవసరం ఉంది. ఈ ప్రక్రియలో భాగంగా రెండు రాష్ట్రాల్లో ప్రజల ఉపశమనానికి తోడ్పాటుగా నా వంతు కోటి రూపాయలు సీఎంల రిలీఫ్ ఫండ్‌కు చెరో 50 లక్షలు విరాళంగా ప్రకటిస్తున్నాను. ఈ విపత్కర పరిస్థితులు తొందరగా తొలగిపోవాలని, ప్రజలంతా సురక్షితంగా ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని అంటూ తన సానుభూతిని తెలియజేశారు.

# హైడ్రా పేరు చెప్పి లంచాలు వసూలు చేస్తే చర్యలు

- బెదిరింపులకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తాం
- అలా బెదిరించే వారి గురించి ఎసిబికి ఫిర్యాదు చేయండి
- ఎసిబి డిజి సివి ఆనంద్ హెచ్చరిక



**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (జనంసాక్షి)** : హైడ్రా పేరు చెప్పి లంచాలు వసూలు చేస్తే చర్యలు తప్పవన్న ఏసీబీ డీజీ సివి ఆనంద్ గట్టిగా హెచ్చరించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... హైడ్రా పేరుతో కొందరు ప్రైవేటు , ప్రభుత్వ అధికారులు పాత నోటీసులు ఇస్తున్నారన్నారు. ఫిర్యాదులను సాకుగా చూపి ప్రజల నుంచి లంచాలు డిమాండ్ చేస్తున్నట్లు తమ నోటీసుకి వచ్చిందన్నారు. డబ్బులు డిమాండ్ చేసిన హైడ్రా పేరును చూపిస్తే ఏసీబీకి ఫిర్యాదు చేయాలన్నారు. అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్య తీసుకోవడానికి వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలన్నారు. అటువంటి ఇన్‌ఫార్మర్ల పేర్లు గోప్యంగా, సురక్షితంగా ఉంచబడతాయని ఏసీబీ డీజీ పేర్కొన్నారు. హైడ్రా పేరుతో బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అమీన్ పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎమ్‌సీఓఆర్ ప్రాజెక్ట్స్ ఎల్ఎల్‌పీని నిర్మిస్తున్న బిల్డర్‌కు హైడ్రా పేరిట బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తి పై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. హైడ్రా పేరిట బెదిరింపులకు పాల్పడుతున్న డాక్టర్ బండ్ల విప్లవ సిన్హా అనే వ్యక్తి పై బిల్డర్లు వాడల రాజేంద్రనాథ్, మంజునాథ్ రెడ్డి ఫిర్యాదు చేశారు. సోషల్ యాక్టివిస్ట్ , సోషల్ వర్కర్ అని బోర్డు పెట్టుకొని నిర్మాణం పనులు చూడడానికి వస్తున్న కష్టమర్లకు అసత్య ప్రచారం చేశాడు సదరు వ్యక్తి. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో దగ్గరి పరిచయం అని చెప్పి కలిసి దిగిన ఫోటోలు చూపి విప్లవ సిన్హా అనే వ్యక్తి వాట్స్అప్ కాల్ చేసి బెదిరింపులు పాల్పడుతున్నట్లు బిల్డర్లు తెలిపారు. పిస్తా హౌస్ వద్ద కలుద్దామని చెప్పి అక్కడికి పిలిచి హైడ్రా రంగనాథ్‌తో కలిసి దిగిన ఫోటోలు చూపిస్తూ, రంగనాథ్ తనకు బాగా దగ్గరని అమీన్పూర్‌లో ఎలాంటి విషయమైనా తననే అడుగుతారని బెదిరింపులకు పాల్పడ్డాడని బిల్డర్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. 'మీ నిర్మాణం జోలికి రావద్దు అంటే తనకు 20 లక్షల రూపాయలు ఇవ్వాలి. లేదంటే హైడ్రా నందు ఫిర్యాదు చేస్తా, ప్రతిరోజు వార్తా పత్రికల్లో మీ నిర్మాణం గురించి తప్పుగా రాయిస్తా' అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. బిల్డర్ల ఫిర్యాదుతో సదరు వ్యక్తిపై అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.



## వరదలో చిక్కుకున్న రైతులు

**కొత్తగూడ సెప్టెంబర్ 4 (జనంసాక్షి)** : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం లోని ముస్మి రైతులు అడవి పందుల బారి నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతన్నలు రాత్రి పంట పొలాలకు కాపలాగా వెళ్లి వరదల్లో చిక్కుకున్నారు. ముస్మి వాగు ఉధృతికి బిక్కుబిక్కుమంటూ రాత్రంతా అక్కడే గడిపారు. చెట్టును వాగుపై అడ్డం వేసి చెట్టు కొమ్మల సాయంతో ప్రమాదకరంగా వాగు దాటి ఒడ్డుకు చేరారు.

# గురుకులాలను శిథిలం చేసే కుట్ర

- రాత్రికిరాత్రే 2వేలమంది టీచర్ల తొలగింపు
- సిఎం రేవంత్ తీరుపై బిఆర్ఎస్ నేత ప్రవీణ్ ఆగ్రహం



**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (జనంసాక్షి)** : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం గురుకులాలను శిథిలం చేయాలని కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... కుట్రలో సమిధలు అవుతున్నది ఎస్సీలని తెలిపారు. ఎస్సీ గురుకులాల్లో 2000 మంది ఉపాధ్యాయులను రాత్రికి రాత్రే ఉద్యోగాల నుంచి తొలగించారన్నారు. రాజ్యాంగ, చట్టబద్ధంగా నిబంధనలకు లోబడి నియామకాలు జరిగిన వారిని తొలగించారని మండిపడ్డారు. 2000 మంది నోట్లో రేవంత్ రెడ్డి మట్టి కొట్టారంటూ విరుచుకుపడ్డారు. రెండు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ అగమ్య గోచరంగా మారిందన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో గతంలో ఇంజనీర్లు, డాక్టర్లు అయితే... ఇపుడు మళ్లీ పశువులు కాసే పరిస్థితికి తీసుకొచ్చారన్నారు. వెయ్యి మంది డాక్టర్లను చేసిన గౌలిదొడ్డి గురుకులంలో ఉపాధ్యాయులు సమ్మె చేసే పరిస్థితి వచ్చిందన్నారు. పేద పిల్లల కోసం ఏర్పాటు చేసిన క్రీడా అకాడమీలు మూత పడ్డాయన్నారు. బ్యాండ్ బాల్ క్రీడాకారుడు తిరుపతికి రెండు లక్షల రూపాయలు ప్రభుత్వం ఇవ్వకపోతే... కేటీఆర్ తాను సాయం చేస్తానని హామీ ఇచ్చారన్నారు. రుక్మాపూర్ గురుకుల సైనిక పాఠశాల, భువనగిరి సైనిక కళాశాల నుంచి సైనిక అధికారులు వెళ్ళిపోయే పరిస్థితి తీసుకొచ్చారన్నారు. మ్యూజిక్, ఒకేషనల్ కళాశాలల నుంచి సిబ్బందిని తొలగించారని మండిపడ్డారు. పేద విద్యార్థులు అంటే రేవంత్ రెడ్డికి ఎందుకంత కోపమని ప్రశ్నించారు. అన్ని వర్గాల వారు మేల్కొని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర నుంచి గురుకులాలను కాపాడుకోవాలన్నారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ డిమాండ్ చేశారు.

# వరదప్రాంతాల్లో మంత్రి జూపల్లి పర్యటన

- అందరికీ అండగా ఉంటామని హామీ



**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 4 (జనంసాక్షి)** : వరద బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ఎవరూ కూడా అధైర్యపడొద్దని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మూడు రోజుల క్రితం కురిసిన అతి భారీ వర్షాలతో నాగర్‌కర్నూల్ జిల్లా అతలాకుతలమై, ఆస్తి, పంట నష్టం జరిగిన నేపథ్యంలో మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చౌటబెట్ల, నర్సింగరావుపల్లి, తాళ్ల నర్సింగాపూర్ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ముంపుబారిన పడ్డ పంట పొలాలు, కోతకు గురైన రోడ్లు, తెగిపోయిన బ్రిడ్జిలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.6 వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా అని, ఇది ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. ఇంతటి విపత్తుపై తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి జాతీయ విపత్తుగా ప్రకటించాలన్నారు ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించి సాయాన్ని ప్రకటించాలని కోరారు.

# విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న సిలిండర్ల లారీ

- తప్పిన పెను ప్రమాదం

**వరంగల్, సెప్టెంబర్ 4 (జనంసాక్షి)** : గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడింది. ఈ సంఘటన వరంగల్ జిల్లా ఖానాపురం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి ఖానాపురం మండల కేంద్రంలో విద్యుత్ స్తంభాలను ఢీకొని బోల్తా పడింది. అదృష్టవశాత్తు కరెంట్ తగలక పోవడంతో సిలిండర్లు పేలకుండా పోయాయి. లేకుంటే భారీ అగ్ని ప్రమాదం సంభవించేది. ఈ ప్రమాదంలో రెండు విద్యుత్తు స్తంభాలు విరిగిపోయాయి. లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. వరంగల్ నుంచి మహబూబాబాద్ జిల్లా బయ్యారం వైపు వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. గాయపడిన డ్రైవర్‌ను హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, తృటిలో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# ప్రభుత్వం మారినా పోలీసుల తీరు మారలేదు

- ఎమ్మెల్యేనే గుర్తించకపోతే..రక్షణ ఎలా కల్పిస్తారు?
- పోలీసుల తీరుపై స్పీకర్‌కు ఫిర్యాదు చేశా
- ఎమ్మెల్యే వేముల వీరేశం ఆగ్రహం



**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (జనంసాక్షి)** : ప్రభుత్వం మారినా పోలీసుల తీరు మారలేదని ఎమ్మెల్యే వేముల వీరేశం ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో ఉన్న పోకడలనే పోలీసులు ఇంకా కొనసాగిస్తున్నారన్నారు. నల్గొండ జిల్లాలో ఒకరిద్దరు పోలీసు అధికారులు ఇంకా గత ప్రభుత్వంలో ఉన్నట్టే ఉన్నారన్నారు. 'మమ్మల్ని గుర్తు పట్టనివారు మాకు ఎలాంటి రక్షణ కల్పిస్తారు. ప్రోటోకాల్ పాటించని అధికారులను పిలిచి విచారణ చేస్తానని స్పీకర్ చెప్పారు. దళిత ఎమ్మెల్యేలపై మాత్రమే కాదు ఏ ప్రజాప్రతినిధికి కూడా ఇలా కావద్దు. పోలీసు అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని స్పీకర్‌కు ఫిర్యాదు చేశానని ఎమ్మెల్యే తెలిపారు. ఆగష్టు 30 వ తేదిన జరిగిన సమావేశంలో అధికారులు ప్రోటోకాల్ పాటించలేదన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 94, 19 ప్రకారం తనను అవమానించినందుకు డీసీపీ, ఏసీపీలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రోటోకాల్ నిబంధనల్ని తుంగలో తొక్కడం సరికాదన్నారు. నాపై మాత్రమే కాదు, ఏ ప్రజాప్రతినిధులపై ఇలా జరగకూడదు. గత ప్రభుత్వంలో అనేక హింసను, అవమానాలను ఎదుర్కున్నాం. అధికారులు కొందరు శత్రువుల ముందు మమ్మల్ని బలహీన పరిస్తున్నారు. డీసీపీ, ఏసీపీ తప్పు చేసి కానిస్టేబుల్స్‌పై చర్యలు తీసుకుంటే ఎలా? అంటూ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రశ్నించారు. కాగా.. నాలుగు రోజుక్రితం ప్రభుత్వ కార్యక్రమా నికి హాజరైన ఎమ్మెల్యేను పోలీసులు గుర్తుపట్టకపోవడం చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన నిమిత్తం మంత్రులు సహా ఉమ్మడి నల్గొండ జిల్లాకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఆగస్టు 30న భువనగిరికి వెళ్లారు. ఈ క్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశానికి చేదు అనుభవం ఎదురైంది. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆగస్టు 30న భువనగిరిలో పర్యటించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి నీటిపారుదల శాఖ పనులపై మంత్రులు సమీక్ష నిర్వహించారు. వారంతా ప్రత్యేక హెలికాప్టర్‌లో భువనగిరికి చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్దకు చేరుకోగానే మంత్రులకు స్వాగతం పలికేందుకు ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు క్యూ కట్టారు. అయితే వారికి స్వాగతం పలికేందుకు హెలిప్యాడ్ వద్దకు వెళ్లిన వేముల వీరేశాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే.. పోలీసులకు కామన్ సెన్స్ ఉండదా అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను గుర్తుపట్టే స్థాయిలో పోలీసులు లేరా? అంటూ ఆగ్రహించారు. చివరకు తాను ఎమ్మెల్యేలను అని పోలీసులకు చెప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. . ఈ అవమానంతో వీరేశం అక్కడి నుంచి అలిగి వెళ్లిపోవాలనుకున్నారు. అక్కడే ఉన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి కలగజేసుకుని సముదాయించే ప్రయత్నించారు. నేతలు చెప్పినా వినకుండా అలకబూని అక్కడి నుంచి వెళ్లిపోయారు.

## ప్రధానమంత్రి కుసుమ్ యోజనా పథకాన్ని వినియోగించుకోవాలి




**వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 4 (జనంసాక్షి)** : కృషి విజ్ఞాన కేంద్రం, మామునూరు పి .వి. నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయంలో ప్రధానమంత్రి కుసుమ్ యోజన పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహేందర్ రెడ్డి వరంగల్ జిల్లా పునర్ ఉత్పాదకత ఇంధన డైరెక్టర్ డైరెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్. ఎన్. రాజన్న కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మరియు అధిపతి మాట్లాడుతూ కూసుం యోజన పథకం ను వినియోగించుకొని అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందాలని కోరడం జరిగింది. తదుపరి కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథి మహేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు కుసుమ యోజన పథకం ద్వారా ప్రవేశపెట్టిన వివిధ సబ్సిడీల గురించి రైతులు మరియు మహిళలకు వివరించడం జరిగింది మరియు డాక్టర్. ఆర్ .అరుణ జ్యోతి, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త మాట్లాడుతూ రైతులకు ఇంధన పొదుపు విధానాలు మరియు రైతులకు, మహిళలకు ఇంధన వినియోగానికి సంబంధించిన సందేహాలను నివృత్తి చేయడం జరిగింది. తదుపరి సౌరఫలకాలను ఏ విధంగా ఇంటిలో అమర్చుకోవచ్చు అనే విధానాన్ని రైతులు మహిళలకు చూపించడం జరిగింది ఈ కార్యక్రమంలో డాక్టర్. ఎన్. రాజన్న కృషి విజ్ఞాన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త మరియు అధిపతి మహేందర్ రెడ్డి వరంగల్ జిల్లా ఇంధన పునర్ ఉత్పాతకత డైరెక్టర్ , డాక్టర్. ఆర్. అరుణ జ్యోతి గృహ విజ్ఞాన శాస్త్రవేత్త,డాక్టర్. సి. హెచ్. సౌమ్య. వ్యవసాయ శాస్త్రవేత్త మరియు కె వి కే శాస్త్రవేత్తలైన డాక్టర్. రాజు, డాక్టర్. శశాంక్ డాక్టర్ .గణేష్, డాక్టర్. సాయికిరణ్ రైతులు, మహిళలు పాల్గొన్నారు.

# గాలివాన బీభత్సానికి నేలకొరిగిన మొక్కజొన్న



**గంగారం సెప్టెంబర్ 4 (జనం సాక్షి)** : మహబూబాద్ జిల్లా గంగారం మండలంలో గత మూడు రోజుల నుంచి కురుస్తున్నటువంటి భారీ వర్షాల కారణంగా మొక్కజొన్న చేనులు మండల వ్యాప్తంగా బలమైన గాలులకు నేలకు 100 ల ఎకరాలు పడిపోయాయి పెద్ద ఎల్లాపురం గ్రామానికి చెందిన రాధారపు కొమురయ్య కు ఉన్నటువంటి 2 ఎకరాల మొక్కజొన్న చేను తాళ్లపెల్లి సారంగపాణి 2 ఎకరాల మొక్కజొన్న చేను బోయిని ఐలయ్య 2 ఎకరాల మొక్కజొన్న పంట చైన్లు నేలమట్టం కావడంతో అదే కాకుండా మండల వ్యాప్తంగా మూడు రోజుల నుండి కురుస్తున్నటువంటి భారీ వర్షాలకు భారీగా నేలమట్టం అయినాయని స్థానికంగా ఉన్న రైతులు తెలిపారు. సుమారు ఒక్క ఎకరాకు 20వేల రూపాయలను నష్టం జరిగిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు తెలిపారు తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులు పంట సర్వే నిర్వహించి ప్రభుత్వం వెంటనే ఎకరాకు 20000 చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# చౌకబారు ప్రకటనలు మానుకోవాలి

- ఎంప్లాయిస్ జేఏసి చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 04 (జనం సాక్షి)** : ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల జేఏసీ వరద బాధితులకు ఆపన్న హస్తం అందించడానికి ముందుకు వచ్చి ప్రభుత్వానికి సహకరించే రీతిలో 130 కోట్ల విరాళాన్ని ప్రకటించిన దరిమిలా అనేక సంఘాలు, సమాజం హర్షిస్తున్న తరుణంలో లచ్చిరెడ్డి జేఏసీ నాయకునిగా, బాధ్యునిగా పేర్కొంటూ వంద కోట్ల విరాళం తను ఇప్పిచ్చినట్లుగా ప్రకటన చేయడాన్ని కరీంనగర్ జిల్లా జేఏసి చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి ఘాటుగా ఖండించారు. ఉద్యమం అంటే పత్రిక ప్రకటనలు కాదని క్షేత్రస్థాయిలో పోరాటం చేయడమే ఉద్యమానికి నిరూపణ అని గత ప్రభుత్వానికి కొమ్ము కాసి, తొత్తుగా వ్యవహరించి నేడు వైఖరి మారినట్టుగా ప్రజలందరినీ, ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లని తప్పుదోవ పట్టిస్తున్న లచ్చిరెడ్డి వైఖరి సరికాదని ఆయన పేర్కొన్నారు. గుర్తింపు పొందిన ఉద్యోగసంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, పెన్షనర్ల సంఘాలు భాగస్వామిగా ఉన్నటువంటి జేఏసీ మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు ల నాయకత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికుల శ్రేయస్సు కొరకు పోరాటం చేస్తున్నదని నేడు ఉద్యోగుల హక్కుల పట్ల పోరాటం చేస్తూనే మరి అవసరమైన సందర్భంలో ప్రభుత్వానికి సమాజానికి వీలైనంత రీతిలో సహకరిస్తున్నదని నేడు ఒక పిలుపునిచ్చి పెన్షన్ విద్రోహ దినమున ఒక పెద్ద ఉద్యమంలా పోరాటం చేసిందని, తదనంతరం వచ్చినటువంటి వరదలలో ఆశ్రయం కోల్పోయిన నిరాశ్రయులైన అందరికీ కొంత సేవ చేయాలనే తలంపుతో ప్రభుత్వానికి విరాళం ప్రకటించిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో తహశీల్దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండి గత ప్రభుత్వానికి వీరవిధేయుడుగా కొమ్ము కాచి ప్రభుత్వం మారగానే ఈ ప్రభుత్వాన్ని నేనే తీసుకువచ్చానంటూ డబ్బా కొట్టుకుంటున్నాడని, నేను చెప్పింది ఈ ప్రభుత్వంలో నడుస్తుందని ప్రభుత్వ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల్లో గందరగోళం సృష్టిస్తూ గుర్తింపు సంఘాల్లో భాగస్వామ్యం దొరకని వ్యక్తులను కొందరిని ప్రోగు చేసి జేఏసీ నాయకునిగా పేర్కొంటూ ఇటు సంఘాలను అటు ప్రజలను గందరగోళానికి గురి చేయడం భావ్యం కాదని సంఘాలు అంటే వ్యక్తుల ప్రయోజనాలు కాదని వ్యవస్థ ప్రయోజనాల కోసం చూడాలని ఎలాంటి గుర్తింపు లేని సంఘం లచ్చి రెడ్డి సంఘమని ప్రభుత్వ గుర్తింపు సంఘాలన్నీ మారం జగదీశ్వర్, ఏలూరు శ్రీనివాసరావు ల అధ్యక్షతన చేపట్టిన జాయింట్ ఆక్షన్ కమిటీ లోనే టిజిఇజెఎసిలో భాగస్వామ్యమై ఉన్నాయని ప్రభుత్వ గుర్తింపు లేని కొన్ని సంఘాలను కొందరి వ్యక్తులను తన వెంట పోగు చేసుకుని ఉద్యోగుల్లో ఉద్యోగ సంఘాల్లో గందరగోళం సృష్టిస్తున్న లచ్చి రెడ్డి పై ప్రభుత్వం తగు చర్యలు కూడా తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈరోజు ప్రకృతి వైపరీత్యాలతో వరదలు వచ్చి ప్రాణ నష్టం పంట నష్టం ఆస్తుల నష్టం జరిగి ప్రజలకు ఎంతోమంది అనారోగ్యబారిన పడ్డారని వారిని ఆదుకోవడానికి ప్రభుత్వ గుర్తింపు పొందిన భాగస్వామ్య సంఘం మారం జగదీశ్వర్, ఏలూరు శ్రీనివాసరావు లు ఒకరోజు మూలవేతనాన్ని 130 కోట్లు ప్రజలకు చెల్లించే విధంగా ఏకగ్రీవ తీర్మానంతో ఆమోదించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఇస్తే తను కూడా పోటీపడుతూ 130 కోట్ల విరాళాన్ని తనే ఇప్పిస్తున్నట్లుగా చెప్పడం తన హేయమైన చౌకబారు దుందుడుకు చర్యలకు నిదర్శనమని కరీంనగర్ జిల్లా జేఏసి యాక్షన్ కమిటీ తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా తన వైఖరి మార్చుకోవాలని, లేకుంటే పర్యవసనాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసి యాక్షన్ కమిటీ అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి తో పాటు టీఎన్జీవోల జిల్లా కార్యదర్శి సంఘం లక్ష్మణరావు, టీజీవోల నాయకులు మడిపల్లి కాళీ చరణ్ గౌడ్, నాగుల నరసింహస్వామి, రాగి శ్రీనివాస్, మహిళా ఉద్యోగుల జేఏసీ చైర్మన్ తిరుమల, శారద, నాలుగోతరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కోట రామస్వామి, శంకర్, ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, సర్దార్ అరవింద సింగ్, బల్వీర్ సింగ్, రాజేష్ భరద్వాజ్, డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మంజీత్ సింగ్, డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటయ్య, పెన్షన్ల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పెండ్యాల కేశవరెడ్డి, మోసం అంజన్న, దామర మహేందర్ రెడ్డి, ఇల దాసరి లింగయ్య, కర్ణాకర్ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## మేడారం అడవుల్లో సుడిగాలి బీభత్సం..

- ఒకే ఏరియాలో 50వేలకు పైగా చెట్లు నేలమట్టం

**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 04(జనంసాక్షి)** : మేడారం అడవుల్లో సుడిగాలి బీభత్సం సృష్టించింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవుల్లో భారీ వృక్షాలు నేలమట్టమయ్యాయి. 200 హెక్టార్లలో విస్తరించి ఉన్న ఈ అడవుల్లో పెద్ద ఎత్తున గాలిదుమారం, సుడిగాలులు బీభత్సం సృష్టించడంతో మహావృక్షాలు మేడారం అడవుల్లో సుడిగాలి బీభత్సం సృష్టించింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవుల్లో భారీ వృక్షాలు నేలమట్టమయ్యాయి. 200 హెక్టార్లలో విస్తరించి మహావృక్షాలు సైతం నేల కూలాయి. ఒకే చోట మూడు కిలోమీటర్ల విస్తీర్ణంలో 50 వేలకు పైగా చెట్లు నేలమట్టమయ్యాయి. ఈ నెల 1న పరిశీలనకు వెళ్లిన అధికారులు సుడిగాలి బీభత్సానికి చెట్లు కూలడం చూసి స్థానికులు ఉలిక్కిపడ్డారు. టోర్నడోల కారణంగానే ఈ చెట్లు కూలి ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరుపుతున్నామని అటవీ శాఖ అధికారులు వెల్లడించారు.

# ఎంతమంది ఊపిరి తీస్తారు?



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్,
విశ్లేషకులు
9951865223




**గో రక్షకుల పేరిట కొందరు 70 నుంచి 80 శాతం మంది సంఘ విద్రోహశక్తులు, రాత్రి పూట తిరుగుతూ అరాచకం సృష్టిస్తున్నారు, గోవులు ఎక్కువ శాతం ప్లాస్టిక్ తినడం వల్ల మరణిస్తున్నాయి. కొందరు గూండాలు గో రక్షక్, గో సేవక్ పేరిట దుకాణం తెరిచారు. వారితో అప్రమత్తంగా ఉండాలి, అని పీఎం నరేంద్ర మోడీ 2016 లో పేర్కొన్నారు. రికార్డు మీద ఆయన మాటలు ఇంకా వినొచ్చు, ఆ సందర్భం ఏమిటంటే గుజరాత్ లో గో రక్షక్ పేరిట దళితుల మీద కొందరు దాడి చేశారు. విషయం చాలా వివాదాస్పదంగా మారింది.ఆ సమయంలో పీఎం మాట్లాడిన మాటలు అవి.**

**మూడు దాడులు**


ఈ ఏడాది ఆగస్టు నెలలోనే మూడు దాడులు తమని తాము గో రక్షక్ లమని చెప్పుకుని ఈ మూకలు మూడు దాడులు చేసాయి. ఆగస్టు 24 న ఫరీదాబాద్ కు చెందిన ఆర్యన్ మిశ్రా అనే 12 వ తరగతి చదువుతున్న 19 ఏండ్ల యువకుడిని ఒక కారులో ప్రయాణిస్తుండగా ఐదు గురు గోరక్షకులం అనే చెప్పుకునే ఐదు గురు తుపాకీ తో కాల్చి చంపారు. ఈ హత్య కూడ గోవులను దొంగిలించాడనే అనుమానంతో కాల్చి చంపినట్లు పోలీస్ లకు పట్టుబడిన ఆ ఐదుగురు పోలీస్ లకు చెప్పారట! ఆర్యన్ శరీరం లో రెండు బుల్లెట్ లు తగిలి అక్కడికక్కడే ఆయన మరణించాడు. కారు వెనుక నుంచి కాల్చారు. 30 కిలోమీటర్లు, కారును చేస్ చేస్తూ దుండగులు కాల్చడం వల్ల కారు వెనుక అద్దం మొత్తం పగిలి పోయింది. కారులో మరి కొందరు ఎలాంటి గాయాలు లేకుండా బయట పడ్డారు.

**జంగిల్‌రాజ్ అయిపోయింది**

మృతుడి తండ్రి ప్రభుత్వం మీద జంగల్ రాజ్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇదే నెల హర్యానా లోనే సాబీర్ అనే బెంగాల్ కు చెందిన 24 ఏండ్ల వలస కూలిని గో మాంసం తిన్నాడని, పరుగెత్తించి మరీ కొట్టి చంపారు. మహారాష్ట్ర లో ఒక వృద్ధుడిని గో మాంసం తీసుకెళ్లుతున్నాడని ట్రైన్ లో కాళ్ళతో తన్నారు. కడుపులో, ముఖం మీద పిడి గుద్దులు గుద్ది, తీవ్రంగా గాయపర్చారు.ఒక అక్లాక్, మసూద్, జునైద్, ఇమ్రాన్, నాసిర్, చెత్తిస్ గర్ లో ఇద్దరు ఆదివాసీలను ఇలా చాలా మందిని బీఫ్ పేరిట చంపేశారు.ఇప్పుడు ఒక ఆర్యన్ ను కాల్చి చంపారు.నిజానికి వీరికి మనుషులను చంపే, వారి మీద దాడి చేసే లైసెన్స్ ఎవరిచ్చారు. వీళ్ళ వద్ద తుపాకులు ఎక్కడివి? రాత్రి పూట వీరు గుంపులు గా తిరుగుతూ వాహనాలు చెక్ చేయడం ఏమిటి?

**నేతల పిల్లలు విదేశాల్లో.. కార్యకర్తలు జైల్లో..**

నేతల పిల్లలు విదేశాల్లో, కార్యకర్తల పిల్లలు స్వదేశీ జైళ్లలో అనే పరిస్థితి ఉన్నది.గోసేవక్ ల, గో రక్షక్ ల పేరిట తయారు అయిన బ్రిగెడ్ లో నేతల కొడుకులు ఉండరు, వారు విదేశాల్లో చదువుతారు. బిజెపి ప్రముఖ నేత డాక్టర్ అజయ్ అలోక్ ఇద్దరు కూతుర్లు అమెరికా లోనే ఉంటారట, అక్కడే పుట్టారట, అక్కడి నాగరికులు వారు, ఇతను మాత్రం ఇక్కడ జనంలో, కార్యకర్తల్లో విషం చిమ్మే, విద్వేషపు ట్వీట్ లు చేస్తుంటాడు.డిబేట్ లోనూ పాల్గొంటాడు!ఒక సామాజిక వర్గం మీద రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ ఉంటాడు. మరో విషం, విద్వేషం ను పార్లమెంట్ లో బయట చిమ్మే బీజేపీ నేత, ఎంపీ నిషికాంత్ దూబే పిల్లలు,కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్, హోమ్ మంత్రి అమిత్ షా కొడుకులు, ఎక్కడ కూడ బీజేపీ కార్యక్రమం లలో, కేసులలో ఉండరు.అమిత్ షా కొడుకుకు దేశం లోనే అద్భుతమైన క్రికెట్ బోర్డు పదవీ లభించింది. ఒక్క సారి పరిశీలిస్తే మొత్తం సామాన్యుల పిల్లలే ఇలా గొడవల్లో ఇరుక్కుపోయి, నేతల రెచ్చగొట్టే ఉపన్యాసాలు విని, తమ మెదడ్ల లో ఒక సామాజిక వర్గం పైన విషం నింపుకుని, విద్వేషం తో, దాడులు చేయడం, చంపడం కేసులలో ఇరుక్కోవడం, హత్య కేసులలో యావజ్జీవ శిక్షలకు గురి కావడం కూడ జరుగుతున్నది.ఇవన్నీ నేతలకు పట్టని విషయాలు!జనమే,ఇలాంటి కలుషిత రాజకీయాలకు బలి అవుతున్నవారు బుద్ధి చెప్పే పరిస్థితి రాక తప్పదు.









# గని కార్మికుల యూనియన్ కొమురయ్య

***సింగరేణి బొగ్గు గని కార్మికులు ఎంతో ప్రేమగా పిలుచుకునే యూనియన్ కొమురయ్య అలియాస్ మనబోతుల కొమురయ్య 28వ వర్ధంతి ఈ నెల 5న ఉన్నది. తెలంగాణ సాయుధ పోరాటంలోనూ పాల్గొన్న కొమురయ్య ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా తుది శ్వాస విడిచే వరకు పని చేసారు.***




గని కార్మికుల జీత భత్యాలను, ఫిల్లర్ కార్మికుల టబ్ ఫిల్లింగ్ లో లీడ్, పుష్ మొదలు, అన్ని క్యాటగిరిలా గురించి సమావేశాల్లో, సభల్లో గంటల తరబడి నిలబడి, చాలా వివరంగా చెప్పేవారు. కార్మికుల సమస్యల మీద ఆయనకు మంచి అవగాహన ఉండేది. ఆయన బతికి ఉన్నపుడు 'ది సింగరేణి' శీర్షికన సింగరేణి చరిత్రను ఒక డాక్యూమెంటరీ రూపంలో తెచ్చే ప్రయత్నం చేశాను. ఇల్లందులో సింగరేణి పుట్టిన చోట నుంచి షూటింగ్ ప్రారంభించినపుడు కొమురయ్య దానికి క్లాప్ కొట్టారు.వివిధ కారణాల చేత డాక్యుమెంటరీని రిలీజ్ చేయలేక పోయాము.

ఉమ్మడి ఖమ్మం జిల్లా సింగరేణి గనుల పుట్టినిల్లు ఇల్లందులో 1928 జూన్ 12న జన్మించిన, మనుబోతుల కొమరయ్య ప్రాథమికవిద్య అభ్యసిస్తున్న సమయములోనే కమ్యూనిస్ట్ పార్టీ రాజకీయాలకు ఆకర్షితుడయ్యారు. 1940 సంవత్సరంలో కొత్తగూడెం మెయిన్ వర్క్ షాప్ లో టర్నర్గా సింగరేణిలో ఉద్యోగం చేస్తూనే ప్రముఖ కమ్యూనిస్ట్ పార్టీ, యూనియన్ నాయకులు వెంట నాయకులు దేవూరి శేషగిరిరావు, మగ్దు మ్ మొయినొద్దీన్, రాజ బహదూర్ గౌర్,కేఎల్ మహేంద్ర, జె. కుమరస్వామి తదితరుల వెంట పోరాటాల్లో పాలు పంచుకున్నారు. 1942 మే 1న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ స్థాపించిన వారిలో కొమురయ్య ఒకరు, సింగరేణి కార్మికుల హక్కులతో పాటు, నిజాం కు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన చురుకుగా పాల్గొన్నారు.1947 నుంచి 1948 వరకు జైలు జీవితం అనుభవించారు. దాదాపు 44 సంవత్సరాలు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన, తన ఇంటిపేరు యూనియన్ కొమరయ్యగా కార్మికుల చేత పిలిపించుకున్న నాయకునిగా కీర్తి గడించారు.సింగరేణి లో కాంట్రాక్టరీ కరణ రద్దు, మహిళలు, పిల్లలను బొగ్గు బావుల్లో పనిచేయడాన్ని, యాజమాన్యంతో పోరాడి రద్దు చేయించారు. కాంట్రాక్టరీ కరణ వ్యవస్థ రద్దు, మహిళలకు భూగర్భగనుల్లో పని చేయకుండా ఉపరితలంలో పని కల్పించారు. 1946లో రేగా కమిటీ, 1949లో జాదవ్ కమిటీ, 1956లో ముజుందార్ కమిటీ, 1989లో లేబర్ ఆపిలేట్స్,



1960లో దాస్ గుప్తా అవార్డు కమిటీ సభ్యునిగా ఉంటూ 1967లో కోల్ వేజ్ కమిటీ 1973లో మొదటి జేబిసిఐ సభ్యునిగా కోల్ వేజ్ బోర్డు నెగోషియేషన్ కమిటీ ద్వారా 1 జనవరి 1975 నుంచి దేశవ్యాప్తంగా బొగ్గు గని కార్మికులకు మొదటిసారిగా వేజ్ బోర్డు అమలు పరిచి జీతాలు పెరగడానికి కృషి చేసిన సభ్యుల్లో కొమురయ్య ఒకరు. మొదటి వేజ్ బోర్డ్ నుంచి ఆరవ వేజ బోర్డ్( వేతన కమిటీ )1996 వరకు సింగరేణి నుంచి శాశ్వత వేజ్ బోర్డ్ సభ్యునిగా ఉండి ఇంక్రిమెంట్లు, ఎల్టిసి, ఎల్ఎల్టిసి, క్యాడర్ స్కీం సాధించడంలో, 1974లో రఘునాథ్ రెడ్డి అవార్డు ప్రకారం కోలిండియా కార్మికుని కంటే సింగరేణి కార్మికులకు ఒక కేటగిరి అదనంగా సాధించడం కోల్డ్ పిల్లర్ లకు మైన్ యావేరేజ్, మైనింగ్ స్టాప్ కు అదనపు ఇంక్రిమెంట్,లాంటివి సాధించడం లో కీలకంగా ఉన్నారు.

1976లో దేశం ఎమర్జెన్సీ రోజుల్లో సింగరేణి డిస్మిస్ చేసిన వందలాది మంది కార్మికులను మరల కంపెనీలో పని ఇప్పించారు. కార్మికుడు మరణిస్తే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, మైనింగ్ స్టాప్ కు చార్జర్ అలవెన్స్ ట్రేడ్స్ మెన్లకు క్యాడర్, క్లరకల్ సిబ్బందికి గ్రేడ్స్ ఇంక్రిమెంట్లు ఇప్పించడంలోనూ కొమురయ్య పాత్ర ఉన్నది. ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం 55 సంవత్సరాలకు రిటైర్మెంట్ ఉత్తర్వులను సింగరేణిలో నిరోధించడములోనూ, 1981 జనవరిలో కోలిండియాలో లేనివిధంగా సింగరేణి యాజమాన్యంతో జరిగిన ఒప్పందం ప్రకారం రెండు సంవత్సరాల ముందే కార్మికుడు వాలంటరీ రిటైర్మెంట్ కోరినచో, కుటుంబంలో ఒకరికి వారసత్వ ఉద్యోగాలు ఇచ్చే ఒప్పందం, 1990 సంవత్సరంలో సింగరేణి వ్యాప్తంగా డిపార్టుమెంటులలో పనిచేస్తున్న దాదాపు 1800 మంది కాంట్రాక్టు కార్మికులను, ఎడ్ల బండ్ల కార్మికులను సికాస లాంటి, విప్లవ కార్మిక సంఘంలు పోరాటం చేసినప్పుడు ఇతర యూనియన్లతో కలిసి వారిని పర్మినెంట్ చేయించడంలోనూ, సింగరేణి నష్టాలు వాటిల్లి ఖాయిల పరిశ్రమగా మూసివేసే దిశలో ఉన్నప్పుడు సంస్థ ను ఇతర యూనియన్‌లతో కలిసి కాపాడడంలో కొమురయ్య కీలకంగా వ్యవహారించారు. బొగ్గు గని కార్మికుల సమస్యలే కాకుండా ఇతర పేపర్, స్టీల్, సిమెంటు విద్యుత్ రంగ, పరిశ్రమలలో యూనియన్ స్థాపించి మెరుగైన వేతన ఒప్పందలకు కొమురయ్య కృషి చేశారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏఐటియుసి ఉపాధ్యక్షుడిగా, జాతీయ ఏఐటియుసి కార్యవర్గ సభ్యునిగా, ఇండియన్ మైన్ వర్కర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షునిగా, జాతీయస్థాయి నాయకునిగా ఎదిగారు. చివర్లో ఆయన అనారోగ్యంతో ఉండి కూడా 1996 సెప్టెంబర్ 6 నుండి కొత్తగూడెంలో ఒక పోరాట కార్యక్రమం లో భాగంగా నిరాహార దీక్షకు కార్మికులను సన్నద్ధం చేసి, ఇంటికి వచ్చిన రోజు 1996 సెప్టెంబర్ 5న తుది శ్వాస వదిలారు. ఆయన మరణించి 28 సంవత్సరాలు కావస్తున్నప్పటికి సీనియర్ కార్మికులు ఆయనను ప్రతీ సందర్భం లోనూ గుర్తు చేసుకుంటూనే ఉంటారు.

ఎండి. మునీర్

## ట్రాన్స్‌ఫార్మర్లకు పటిష్టమైన రక్షణ భద్రత ఏర్పాటు చేయాలి

గృహ అవసరాల కోసం విద్యుత్ శక్తి సరఫరా లో హెచ్చు తగ్గులు నివారించుటకు ప్రతి వాడలలో వినియోగదారుల అవసరము మరియు వినియోగాన్ని దృష్టిలో పెట్టుకొని తగు సామర్థ్యంగల కరెంటు ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేసినారు చేస్తున్నారు కూడా దీనివలన వినియోగదారులకు నాణ్యమైన కరెంటు సరఫరా జరుగుతున్నదనడంలో సందేహం లేదు కానీ ఈ ప్లింత్ ఏరియా ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటుచేసిన స్థలంలో సరైన రక్షణ కవచాలు ఏర్పాటు చేయడంలేదు నిర్వహణ లోపం వలన భూమిపై చిన్న చిన్న పిచ్చి మొక్కలు చెట్లు పెరుగుతున్నవి కొంతమంది వ్యక్తులు సామాజిక బాధ్యతను విస్మరించి అక్కడ చెత్తా చెదారం వేయడం జరుగుతున్నది ఫలితంగా క్రిమి కీటకాలకు స్థావరంగా మారుతున్నది దోమలు వ్యాప్తి చెందటానికి దోహదం చేస్తున్నది మరియు ఈ పరిసరాలు దుర్వాసనతో వికారంగా దర్శనమిస్తున్నాయి. పర్యావరణ వేత్తలు ఆరోగ్యశాఖ ప్రభుత్వం మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డెంగ్యూ మలేరియా ఇతర వ్యాధుల నివారణకు తోడ్పడుతుందని ప్రచారం చేస్తుంటారు ఇది వాస్తవమే కానీ విద్యుత్ శక్తి శాఖ వారు ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేసిన స్థలంలో భద్రత కోసం కంచెలను పటిష్టవంతముగా ఏర్పాటు చేయడం లేదు ఏదో నామమాత్రపు నాసిరకపు కంచెలను ఏర్పాటు చేస్తున్నారు కానీ వాటి నిర్వహణను పట్టించుకున్నట్లు కనపడదు ఏదో ఒక కారణం చేత నెలకొల్పిన కంచెలు చిన్నాభిన్నమైన స్థితిలో ఉంటున్నవి ఫలితంగా అపరిశుభ్రతకు నిలయాలుగా మారుతున్నవి ఒక్క మాటలో చెప్పాలంటే ఈ కంచెలను చిన్నపిల్ల వాళ్ళు ఆడుకునే వస్తువు లెక్క తూతూ మంత్రముగా ఏర్పాటు చేస్తున్నట్లుగా ఉంటున్నది విద్యుత్ శక్తితో ఎంత ప్రయోజనమో నిర్లక్ష్యం వహిస్తే అంతే ప్రమాదకరం! లక్షల రూపాయల ఖర్చుపెట్టి ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు కానీ వాటికి రక్షణ భద్రత కల్పించడంలో విఫలమవుతున్నారు విద్యుత్ శక్తి పరికరాలు ఏర్పాటు చేసిన ప్రతిచోట పటిష్ఠమైన రక్షణ భద్రత ఏర్పాట్లు కల్పించాలని శాఖ పరంగా కఠినమైన నియమ నిబంధనలు ఉన్న వాటిని అమలు చేయడంలో చిత్తశుద్ధి లేకపోవడం సుస్పష్టంగా కనిపిస్తున్నది. విద్యుత్ పరికరాల రక్షణ భద్రత పరిసరాల పరిశుభ్రత ప్రజా ఆరోగ్యం దృష్ట్యా చూపరులకు అలంకార ఆహ్లాదం కలిగించే విధముగా ప్రమాద హెచ్చరికలను సూచించే బోర్డులతో పటిష్ఠమైన కంచెలను ఏర్పాటు చేయాలని ప్రజలు భావిస్తున్నారు.

దండంరాజు రాంచందర్ రావు
రిటైర్డ్ డిప్యూటీ సూపరింటెండెంట్
సింగరేణిభవన్ హైదరాబాద్, 9849592958

## పిల్లల బంగారు భవిష్యత్తు ఉపాధ్యాయులతోనే..

నేడు విద్యా వ్యవస్థ ఒక రకంగా గాడి తప్పిందని చెప్పవచ్చు. దానికి కారణాలు చాలానే ఉన్నాయి దానిలో ముఖ్యంగా పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అదే విధంగా పశ్చాత్య సంస్కృతికి అల్లావాటు పడటం. పిల్లలకు ప్రాజెక్టు వర్క్ పేరుతో కంప్యూటర్ సెంటర్లు తిరుగుతున్నారని అదే విధంగా ఆన్ లైన్ క్లాస్ ల నిమిత్తము పిల్లలకు తల్లిదండ్రులు స్మార్ట్ ఫోన్, కంప్యూటర్, ల్యాప్ టప్ వంటి ఇప్పించడం ద్వారా గురువులకు విద్యార్థులకు దూరం తగ్గుతుంది. పిల్లలు కూడా ఎక్కువ టైం సోషల్ మీడియాలో గడుపుతున్నారని పలు సర్వేలు తెలుపుతున్నాయి. ఒకప్పుడు గురువులు అంటే అపారమైన గౌరవము ప్రేమ, భయము ఉండేది ఇప్పుడు వచ్చిన చట్టాల ద్వారా పిల్లలను భయపెట్టి చదువు చెప్పే రోజులు పోయాయి దాని అలుసుగా తీసుకుని విద్యార్థులు గురువులను కామెంట్ చేస్తూ వికృత చేష్టలకు పాల్పడుతున్నారు. అలాంటి వారిని మందలించిన సందర్భంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులపైకి తగదుకు వస్తున్నారు. దీంతో పిల్లలు ఇష్టారాజ్యంగా తయారు అయి తప్పుదోవ పడుతున్నారు. గోపాల కృష్ణ గోఖలే శిష్యుడు మహాత్మా గాంధీ, భారత యువతకు సన్మార్గమును భోదించిన రామకృష్ణ పరమహంస స్వామి వివేకానందుడి వంటి గురు భక్తి నేటి పిల్లలకు ఆదర్శం. గురువు అంటే "మార్గదర్శి, నిపుణుడు, ఉపాధ్యాయుడు అని అర్థం. ఇది సంస్కృత పదం గురు నుండి వచ్చింది భారతీయ సంప్రదాయంలో గురువు ఉపాధ్యాయుని కంటే ఎక్కువ. ఈ మధ్యకాలంలో తెలంగాణలో ఉపాధ్యాయులు స్థాన చలనం చేసి వెళ్తున్నప్పుడు పిల్లల ఉపాధ్యాయుల భావోద్వేగాలు అందరిని కదిలించాయి. టీచర్లు స్కూల్ పిల్లలను ఇంట్లో వారిలా భావించి విద్యా బుద్ధులు నేర్పించి సమాజానికి అందిస్తారు. విద్యార్థులు విజయం సాధిస్తే వారి గెలుపుగా భావించే కల్మషమైన మనస్సు గురువులకు మాత్రమే ఉంటుంది. ఉపాధ్యాయులు చాలా వరకు ప్రభుత్వ పాఠశాలలో చిన్న చిన్న ఆర్థిక పరమైన అవసరాలు తమ స్వంత డబ్బులతో అందించిన ఘనత ఉత్తమ ఉపాధ్యాయులకు ఉంది. ఇలా సమాజంలో గురువుల పాత్ర కీలకమైనది. పిల్లల భవిష్యత్తులో తల్లిదండ్రుల పాత్ర ఎటువంటిదో గురువులది కూడా ముఖ్యమైన భూమిక పోషిస్తున్నారు.

మిద్దె సురేష్, కవి, వ్యాసకర్త 9701209355

# దేశాభివృద్ధిలో మూలస్తంభమే ఉపాధ్యాయుడు

ఉపాధ్యాయులు అభివృద్ధి నిర్మాణంలో దేశానికి వెన్నెముక లాంటివారు. భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దడంలో వారి పాత్ర కీలకమైనది. సమాజంలోని ప్రతి వ్యక్తి సమర్థుడైన, బాధ్యతాయుతమైన పౌరుడిగా ఎదగడానికి కావలసిన జ్ఞానాన్ని, విలువలను మరియు నైపుణ్యాలను అందించడంలో వారి బాధ్యతాయుతమైన పాత్ర కొనియాడదగినది. సమాజంలో ఉపాధ్యాయుడి పాత్ర అందరికంటే చాలా వైవిధ్యమైనది మరియు విశిష్టమైనది. ఇలా చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు, ఎందుకంటే ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా విద్యార్థులను మాత్రమే కాకుండా సమాజాన్ని కూడా ప్రభావితం చేయగలరు. అమూల్యమైన జ్ఞానాన్ని అందించడంలో, నేర్చుకునే తత్వాన్ని సరదాగా అలవాటు చేయడంలో, సరైన మార్గంలో నడిపించడంలో ఉపాధ్యాయుని సహకారం సాటిలేనిది. అంతటి విశిష్టతను కలిగిన అధ్యాపకులను గౌరవించటానికి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని భారతదేశం అంతటా జరుపుకుంటారు.


**ఉపాధ్యాయ దినోత్సవం చరిత్ర**

భారతదేశంలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5 న జరుపుకుంటారు. దేశ మాజీ రాష్ట్రపతి, పండితుడు, తత్వవేత్త, భారతరత్న అవార్డు గ్రహీత అయిన అత్యంత గౌరవనీయమైన ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు (05/09/1888) జ్ఞాపకార్థం దీనిని జరుపుకుంటారు . భారతదేశంలో ఉపాధ్యాయ దినోత్సవం చరిత్ర 1962లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ రాష్ట్రపతి అయినప్పుడు ప్రారంభమైంది. ఆయన విద్యార్థులు తన పుట్టినరోజును జరుపుకోవాలని అభ్యర్థించినప్పుడు, ఆ రోజును ఉపాధ్యాయులను సన్మానించడానికి అంకితం చేయాలని సూచించాడు. సమాజంలో ఉపాధ్యాయులకు విశిష్ట స్థానం ఉందని, వారి సేవలను గుర్తించాలని డాక్టర్ రాధాకృష్ణన్ అభిప్రాయపడ్డారు.

**యువశక్తి – ఉపాధ్యాయుడు పాత్ర**

దేశ యువశక్తిని దేశ అభివృద్ధిలో కీలకంగా మార్చడంలో ఉపాధ్యాయుల బాధ్యత స్లాగనీయమైనది. యువకులలో ఉచ్చుకత, సృజనాత్మకత మరియు విమర్శనాత్మక ఆలోచనా శక్తిని అభివృద్ధి పరచడంలో ఉపాధ్యాయులు ప్రముఖ పాత్ర వహిస్తారు. ఉపాధ్యాయులు విద్యార్థుల తెలివితేటలు, సామాజిక నైపుణ్యాలు మరియు భావోద్వేగ మేధస్సు అభివృద్ధి చెందడానికి అవసరమైన అనుకూల అభ్యాస వాతావరణాన్ని సృష్టిస్తారు.నిరంతరం మారుతున్న ప్రపంచంలో విద్యార్థులు తమను తాము విజయం కోసం సిద్ధం చేసుకుంటూ, అభ్యాస ప్రక్రియలో చురుకుగా పాల్గొంటూ, వారికి వారే సొంతంగా చదువుకొని నేర్చుకుని అభివృద్ధి చెందగల ఆత్మవిశ్వాసాన్ని విద్యార్థులలో కలిగించడం ద్వారా దేశ అభివృద్ధిలో ఉపాధ్యాయులు పరోక్షంగా సహాయపడతారు.

**ఉపాధ్యాయులు జ్ఞాన ప్రసారకులు**




ఉపాధ్యాయులు సమాజంలో జ్ఞానాన్ని ప్రసరింపజేసే ప్రధాన సామాజిక కార్యకర్తలు. గత తరానికి చెందిన జ్ఞాన సంపదని, అనుభవాన్ని ప్రస్తుత తరానికి అందించే జ్ఞాన ప్రసారకులు. సంక్లిష్ట భావనలను అర్థం చేసుకోవడానికి, సమస్య పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి, వాస్తవ ప్రపంచ పరిస్థితులకు సైద్ధాంతిక జ్ఞానాన్ని వర్తింపజేయడానికి ఉపాధ్యాయులు విద్యార్థులకు సహాయపడతారు. ఉపాధ్యాయులు వారి నైపుణ్యాన్ని విద్యార్థులతో పంచుకోవడం వలన, ఆధునిక ప్రపంచంలోని సంక్లిష్టతలను పరిశోధించడంలో విద్యార్థులు పురోగమించగలుగుతారు.

**ఉపాధ్యాయులు స్ఫూర్తి ప్రదాతలు, మార్గదర్శకులు :** ఉపాధ్యాయులు విద్యార్థులకు స్ఫూర్తి ప్రదాతలు, మార్గదర్శకులు. విద్యార్థులు నైతిక విలువలను, సానుకూల దృక్పథాన్ని, వైఖరిని, మంచి వ్యక్తిత్వంతో కూడిన ప్రవర్తనను అలవర్చుకునేలా వారిని తమ ప్రవర్తన ద్వారా ఉపాధ్యాయులు ప్రేరేపిస్తారు. జీవితకాల అభ్యాసానికి, నిబద్ధతకు, నిరంతర వృద్ధి, స్వీయ-అభివృద్ధికి ఉన్న ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు నిరంతరం వివరిస్తూ ఉంటారు. విద్యలో వెనకబడి ఉన్న విద్యార్థులకు తగినంత ప్రోత్సాహాన్ని ఇవ్వడం ద్వారా, ఉపాధ్యాయులు సురక్షితమైన, సమగ్ర అభ్యాస వాతావరణాన్ని సృష్టిస్తారు, అది ఆ విద్యార్థుల సామర్థ్యాన్ని వెలికి తీసి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడానికి తోడ్పడుతుంది.

**సామరస్య పూర్వక సమ్మిళిత సమాజ నిర్మాణం**


సాంఘికీకరణలో ఉపాధ్యాయులు ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. మాట్లాడే నైపుణ్యం, తీరు, పరస్పర సహకారంతో కలిసి పని చేసే పద్ధతులు, సంఘర్షణ పరిష్కారాల సామర్థ్యం వంటి అత్యవసరమైన జీవిత నైపుణ్యాలను అభివృద్ధి పరుచుకోవడంలో విద్యార్థులకు ఉపాధ్యాయులు సహాయపడతారు. విభిన్న నేపథ్యాల నుండి వచ్చిన విద్యార్థుల మధ్య పరస్పర గౌరవం, సానుభూతి, స్నేహం, అవగాహనను పెంపొందించడం ద్వారా ఐక్యతా భావాన్ని విద్యార్థుల్లో పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్రను ఎంత పొగిడినా తక్కువే. ఇలాంటి ఐక్యతా భావాన్ని విద్యార్థుల్లో పెంపొందించడం ద్వారా, ఉపాధ్యాయులు ఒక సామరస్య పూర్వకమైన, సమ్మిళిత సమాజాన్ని నిర్మించడంలో విశిష్ట పాత్రను పోషిస్తారు.

**భవిష్యత్తు తరాలను ప్రభావితం చెయ్యగల సమర్థులు**

ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతుల స్ఫూర్తితో భవిష్యత్తు తరాలను తీవ్రంగా ప్రభావితం చెయ్యగలరు. ఉత్తమ దేశ నాయకులను, దృఢమైన సైనికులను, గొప్ప ఆవిష్కర్తలను, పారిశ్రామికవేత్తలను, బాధ్యతాయుతమైన పౌరులను తమ స్ఫూర్తిదాయకమైన మాటలతో అనుభవంతో రూపొందించి దేశానికి అందించగలరు. ఉపాధ్యాయులు విద్యార్థుల అభిరుచులను, ప్రతిభను తెలుసుకొని తగిన సలహాలు ఇస్తూ మారుతున్న ప్రపంచంలో అభివృద్ధి చెందేలా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి వారిని ప్రోత్సహిస్తారు. విద్యార్థుల్లో అవసరమైన అన్ని నైపుణ్యాలను అభివృద్ధి పరచడం ద్వారా వ్యక్తిగతంగా విద్యార్థుల అభివృద్ధిలోనే కాకుండా సమాజం, దేశం, భవిష్యత్ తరాలు అభివృద్ధి మార్గంలో ముందుకు సాగటంలో ఉపాధ్యాయుల కీలక పాత్ర పోషిస్తారు.

**విద్యాబుద్ధుల ఉపదేశకులకు పాదాభి వందనం**

ముగింపు మాటగా, సమాజ, దేశాభివృద్ధి నిర్మాణంలో ఉపాధ్యాయుని పాత్ర ప్రాముఖ్యత ఎంతో గొప్పది, విలువైనది. ఉపాధ్యాయులు చిన్నారులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో, సమాజాన్ని అన్ని విధాల అభివృద్ధి పరచడంలో, మారుతున్నకాలానికి అనుగుణమైన అవగాహనను కలిగించడంలో, సాంకేతిక విప్లవాన్ని ప్రజలకు చేరువ చేయడంలో, ప్రభుత్వ విధానాలు, ప్రజల మనోభావాల మధ్య అవగాహన కల్పించడంలో మూలస్తంభంలాగా వ్యవహరిస్తారు. యువశక్తిని, మేధస్సును రూపొందించి దేశాభివృద్ధిలో పరోక్షంగా తమ బాధ్యతను నిర్వహిస్తారు. ఉపాధ్యాయులు సమాజంలో స్ఫూర్తి ప్రదాతలుగా, మార్గదర్శకులుగా తమ పాత్రను పోషిస్తూ ఒక నైతిక సమాజాన్ని నిర్మించడంలోనూ తద్వారా దేశ ప్రగతిలో ఒక విశిష్టమైన పాత్రను పోషిస్తున్నారు. దేశాభివృద్ధి నిర్మాణంలో ఉపాధ్యాయుల ప్రాముఖ్యతను అందరూ గుర్తించడంతోపాటుగా, ఉపాధ్యాయులు ఎదుర్కొనే సవాళ్లను కూడా గుర్తించి, వారు ఈ ఉన్నతమైన వృత్తిలో ఎటువంటి ఆటంకాలు ఒత్తిడిలు లేకుండా సంతోషంగా రాణించగలిగేలా సమాజంలోని ప్రతి ఒక్కరు పరస్పర సహాయ సహకారక వాతావరణాన్ని సృష్టించేందుకు కృషి చేయాలి. విద్యాబుద్ధులు నేర్పి మన అభివృద్ధిలో మూల స్తంభాలైన ఉపాధ్యాయులందరికీ వందనం. పాదాభివందనం.అందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు.



నసుబోలు రాజశేఖర్
తాడేపల్లిగూడెం,
పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్

## మార్గదర్శికి వందనం

అజ్ఞానపు చీకటిని
తరిమేసే సూర్యుడు
స్వయం ప్రకాశకుడు
తేజోదీపంలా వెలిగే
జ్ఞాన భాస్కరుడు ఉపాధ్యాయుడు
భవిష్యత్తును నిర్దేశించే మార్గదర్శి
భరోసాను అందించే చైతన్యమూర్తి
ఆత్మబలమై నిలిచే ఆదర్శ స్ఫూర్తి
గురువే లేకుంటే
విశ్వవిజ్ఞానానికి అర్థమే లేదు
కొవ్వొత్తిలా కరిగి వెలుగును
ప్రసాదించకుంటే రేపటి
జీవితం కాంతివంతం కాదు
ఆ అద్వితీయతను గురించి
ఏం చెప్పినా, ఎంత కొనియాడినా తక్కువే
గురూనాం గురుః
ఆ మార్గదర్శికి వందనం
ఆ తేజోమూర్తికి సహస్ర ప్రణామం.

జనంసాక్షి

డా. తిరునగరి శ్రీనివాస్
9441464764

## నీటి దాడి

తుపాను బాంబు
వాన చావులు
దుఃఖం నీటిపాలు
ప్రాణం ఖరీదు
ఐదు లక్షలు

జనంసాక్షి

రేడియమ్
9291527757

## ఒక భావం

కన్పిస్తే జీవం
కన్పించక పోతే దైవం
కన్పించి కన్పించక పోతే
దయ్యమనే ఒక భావం

జనంసాక్షి

కోటం చంద్రశేఖర్
9492043348

# అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టండి

## అధికారులకు ఎమ్మెల్యే అరికపూడి ఆదేశం



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 04 (జనంసాక్షి):**
శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధి చందానగర్, మాదాపూర్, హఫీజ్పేట్, మియాపూర్ తదితర డివిజన్ల పరిధిలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించి అభివృద్ధికి బాటలు వేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు వివేకానంద నగర్ లోని తన కార్యాలయంలో చందానగర్ సర్కిల్ జిహెచ్ఎంసి, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ వర్షాల వలన దెబ్బతిన్న రోడ్లను వెంటనే పునరుద్ధరించాలని, అవసరమున్న చోట గుంతలను పూడ్చి ప్యాచ్ వర్క్లు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. వర్షాలు ప్రమాదకరస్థాయిలో నమోదవుతున్నందున ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని, ప్రజావసరాల దృష్ట్యా ఆయా కాలనీలలో నెలకొన్న రోడ్డు సమస్యలను ప్రథమ ప్రాధాన్యతగా పరిగణలోకి తీసుకోని వాటిని పూర్తి చేయాలని కోరారు. సమస్యలన్నీ త్వరిత గతిన పరిష్కారం అయ్యేలా ఆయా విభాగాల అధికారులు కృషి చేయాలని, పనులలో వేగం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి పనుల విషయంలో అలసత్వం ప్రదర్శించకూడదని, పెండింగ్ లో వున్న పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని వివరించారు. అవసరం ఉన్నచోట కొత్త ప్రతిపాదనలు తీసుకోవాలని, ప్రతి పనిని ప్రాధాన్యతాక్రమంలో వర్గీకరించుకొని వాటిని పూర్తిచేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్నిరకాల చర్యలు తీసుకోవాలని, వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలపట్ల పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండాలని, మాన్ సూన్ బృందాలు 24 గంటలు అప్రమత్తత వ్యవహరించాలని, ఎక్కడికక్కడ యుద్ధప్రాతిపదికన రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి విభాగం ఈఈ కెవిఎస్ రాజు, డిఇ స్రవంతి, దుర్గ ప్రసాద్ మరియు ఇతర సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రై డేను కచ్చితంగా పాటించాలి

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా .స్వరాజ్య లక్ష్మి



**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 4 (జనంసాక్షి):**
నాగర్ కర్నూల్ మున్సిపాలిటి పరిదిలోని అంబేద్కర్ కాలనీలో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న డ్రేడే కార్యక్రమాన్ని బుధవారం జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా స్వరాజ్య లక్ష్మి పరిశీలించారు. ప్రతి ఒక్కరు వారి ఇంటి చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వ లేకుండా చూడాలని కాలనిలోని ఇంటిఇంటికి వెళ్లి నీటి నిల్వ లేకుండా చూసుకునేల, దోమలు పుట్టకుండా కుట్టకుండా అవగాహన కల్పించాలని, వారంలో ఒకరోజు డ్రైడే కచ్చితంగా పాటించేలా చూడాలని ఈ సందర్భంగా ఆమె వైద్య సిబ్బందికి సూచించారు. అంబేద్కర్ కాలనీలో నీటి నిల్వ ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ వేయించడం జరిగింది. అంబేద్కర్ కాలనీ వాసులతో మాట్లాడుతూ దోమకాటు వల్ల డెంగీ, మలేరియా లాంటి సీజనల్ వ్యాధులు వస్తాయని తెలిపారు. ఇంట్లో వాడని పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పూల కుండీలు, ఫ్రిజ్లో నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చని చెప్పారు. ప్రతిఒక్కరూ దోమతెరలను వాడాలన్నారు. వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులోనే ఉంటున్నారని, ఎటువంటి జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని పరీక్షలు అందుబాటులో ఉన్నాయని ఎవరు అధైర్య పడోద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డా. వెంకట్ దాస్, జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి డా. రవి కుమార్ నాయక్, డా. ప్రదీప్, ఎన్ఎచ్ఎమ్. డీపీఓ రెనయ్య, అసిస్టెంట్ మలేరియా అధికారి ఆర్. శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మల్కాజిగిరిలో హైడ్రా హెచ్చరికలు జారీ



- **రోడ్డు ఆక్రమణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు**
- **మీరే కూల్చి వేసుకుంటారా-మేం కూల్చాలా**
- **మిర్జాల్ గూడలో స్వయంగా రోడ్డు ఆక్రమణలను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్**

**మల్కాజిగిరి,సెప్టెంబర్ 4 (జనంసాక్షి)**
రోడ్డు ఆక్రమణలకు పాల్పడి అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని చిన్మయ మార్గం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా కమిషనర్ రంగనాథన్ కలిసి తమ కాలనీలో లేఔట్ 66 ఫీట్లు రోడ్డు ఉంటే 30 ఫీట్ల రోడ్డు అనుమతులతో అక్రమ నిర్మాణాలు చేపట్టారని దీంతో వర్షం పడిన ప్రతిసారి నరకయాతన అనుభవిస్తున్నామని, ఇండ్లలో వర్షపు నీరు చేరి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం మిర్జాల్ గూడ లోని అక్రమంగా నిర్మించిన ఐదు ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సదరు నిర్మాణదారులను స్వయంగా మీరే కూల్చి వేసుకోవాలని లేదంటే నోటీసులు జారీ చేసి జెసిబిల సహకారంతో కూల్చివేతలు ప్రారంభిస్తామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తే సహించేది లేదని అధికారులను మరియు పట్టణ ప్రణాళిక అధికారులను ఆయన స్వయంగా హెచ్చరించారు. అలాగే త్వరలో మిర్జాలగూడ నాలా ఇరువైపులా అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన నిర్మాణాలలో నోటీసులు ఇచ్చి కూల్చివేతలు చేపడతామని తెలిపారు. ఈ ఈ కార్యక్రమంలో మిర్జాల్ గూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# భూములు కోల్పోయిన రైతులకు చెక్కులు, ఇంటి స్థలాల పత్రాలు పంపిణీ

## వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**కొడంగల్ సెప్టెంబర్04(జనం సాక్షి):**
వైద్య కళాశాలల ఏర్పాటులో సహకరించిన రైతులు అభినందనీయులని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.బుధవారం కొడంగల్ లోని కాడా కార్యాలయంలో వైద్య ఆరోగ్య, పశు వైద్య కళాశాలల నిర్మాణాలకు భూమిని కోల్పోతున్న అప్పాయి పల్లి రైతులకు నష్టపరిహారం గా చెక్కులను, ఇంటి స్థలాల పత్రాలను రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తిరుపతి రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ అందజేశారు. వైద్య కళాశాలల నిర్మాణాలకు 60 ఎకరాలకు గాను 55 ఎకరాలను 51 మంది రైతుల నుండి సేకరించి 5 కోట్ల 50 లక్షల నష్ట పరిహారాన్ని అలాగే ఎకరానికి 10 లక్షల చొప్పున చెక్కులను అదేవిధంగా 125 చదరపు గజాల ఇంటి స్థల ధ్రువ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా రైతులనుద్దేశించి కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు రైతులు తమ భూములను స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇచ్చి భాగస్వాములయ్యారన్నారు. వైద్య కళాశాలలకు భూములను స్వాధీనం చేసిన రైతు కుటుంబాలకు ఇంటికి ఒకటి చొప్పున విద్యార్హతలను బట్టి వైద్య కళాశాలల్లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ముందుగా భూములు కోల్పోయిన రైతులకు ఇళ్ల స్థలాలకు లేఅవుట్లను రూపొందించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ప్రాధాన్యత కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ,తాండూర్ ఆర్డీవో శ్రీనివాసరావు,కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, తహసిల్దార్ విజయకుమార్, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్ ముఖ్, మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# భారీ వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## కలెక్టర్ మణు చౌదరి

**కోహెడ సెప్టెంబర్ 04 (జనంసాక్షి):**
రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. మంగళవారం రాత్రి నుండి బుధవారం తెల్లవారు జామున వరకు కురిసిన భారీ వర్షాలకు కోహెడ మండల కేంద్రంలోని ఇండ్లలోకి భారీగా వరద నీరు చేరడంతో కలెక్టర్ నివాస గృహాల వద్దకు వెళ్లి వారిని పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. వర్షాలు ఎక్కువ ఉన్నాయని మీరు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కోహెడలోని రోడ్ డ్యామ్ దగ్గర ఉన్న ఎత్తయిన బిల్డింగ్ కట్టడాల వల్ల నీటి ప్రవాహానికి అడ్డంకి ఉండడం వల్ల ప్రవాహం ఎక్కువ కావడం వల్ల పోచమ్మ వాడ లోని పలువురి ఇండ్లలోకి నీటి ప్రవాహం ఎక్కువ ఉందని అన్నారు. నీటి ప్రవాహం వల్ల ఇబ్బంది ఉండి ఉంటే వెంటనే సురక్షిత ప్రాంతాల్లోకి వెళ్లాలని కలెక్టర్ అన్నారు.కలెక్టర్ తో పాటు సిద్దిపేట పోలీస్ కమీషనర్ అనురాధ, హుస్నాబాద్ ఏసీపి సతీష్ కుమార్, సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, తహసీల్దార్ సురేఖ, ఎస్సై అభిలాష్ , ఇరిగేషన్ శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఇతర పార్టీల నాయకులు తదితరులు ఉన్నారు.

# మట్టి గణపతి మహాగణపతి

## జ్ఞాన వికాస భారతి సెల్ఫీ కాంటెస్ట్ బ్రోచర్ విడుదల

**నాగర్ కర్నూల్ ఆర్సీ సెప్టెంబర్ 4(జనంసాక్షి):**
పర్యావరణ పరిరక్షణలో భాగంగా జ్ఞానవికాస భారతి వారు ఒకపక్క మొక్కలు నాటి సంరక్షిస్తూ మరొక పక్క ప్లాస్టిక్ వాడకం నిషేధించాలంటూ, పాస్టర్ ఆఫ్ పారిస్ ను నిషేధించాలంటూ, ఈ వాడకాన్ని క్రమేణ తగ్గించాలంటూ చేస్తున్న ప్రయత్నాలు హర్షనీయమని నాగర్ కర్నూల్ జిల్లా సూపరిడెంట్ ఆఫ్ పోలీస్ వైభవ్ గైక్వాడ్ పేర్కొన్నారు. మట్టి గణపతి మహా గణపతి అంటూ స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా జ్ఞాన వికాస భారతి వారు ఏర్పాటుచేసిన ఒక బ్రోచర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాస్టరోఫ్ పారిస్ను గణపతి ఉత్సవాల్లో ఎక్కువగా వాడుతున్నారని అది జల కాలుష్యమే కాకుండా జలచరములకు హాని కలిగిస్తూ ఉందని ఈ విధానాన్ని క్రమేనా అరికట్టాల్సిన అవసరం ఉందని దీనికి తమ ప్రయత్నంగా ఎన్నో సంవత్సరాల నుంచి మట్టి గణపతి లను ఉచితముగా వితరణ చేస్తూ మట్టి గణపతి లను ఉచితంగా వితరణ చేస్తున్నటువంటి దాతలను ప్రోత్సహిస్తూ మట్టి గణపతిని పెట్టుకున్న అసోసియేషన్స్ సంస్థలను మరియు కుటుంబ సభ్యులను ప్రోత్సహించుటకు మట్టి గణపతి మహా గణపతి సెల్ఫీ కాంటెస్ట్ ద్వారా బహుమతులు ఏర్పాటు చేయడము బాగుందని సంస్థ ప్రతినిధులు అన్నారు.

# అధిక వర్షాల వల్ల రైతులు సాళ్లల్లో నీరు నిలవకుండా చూడండి

## తాండూర్ ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ లక్ష్మణ్

**వికారాబాద్జిల్లాబ్యూరో సెప్టెంబర్4 (జనంసాక్షి):**
ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకు రైతులు తగు జాగ్రత్తలు వహించాలని తాండూర్ ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ టి. లక్ష్మణ్ మరియు సి. యమున, శాస్త్రవేత్త పలు సూచనలు చేశారు. ఆదివారం అధిక వర్షాలు కురిసినందున వరి పొలాల్లో, మొక్కజొన్న, పత్తి చేళ్లలో మొక్కల సాళ్ళ మధ్య నీరు నిలవకుండా బయటికి పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధిక వర్షాల వలన పత్తి మొక్కలు పసుపు రంగులోకి మారే అవకాశం ఉందని, దీనిని అధిగమించడానికి మొక్క వయసును బట్టి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా 19.19.19 లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు పంట ఎదుగుదలను పెంచడానికి వర్షాలు తగ్గిన వెంటనే 25 కిలోల యూరియా 10 కిలోల పొటాష్ ఎరువులను మొక్కకు ఐదు సెంటీమీటర్ల దూరంలో వేసుకోవాలి అన్నారు. అధిక తేమ వల్ల పత్తి మొక్కలకు వేరుకుళ్ళు తెగులు సోకడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందని, దీని నివారణకు మూడు గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ లేదా ఒక గ్రాము కార్బండజిమ్ లీటర్ నీటికి కలిపి ఆ ద్రావణాన్ని తెగులు సోగిన మొక్కల పాదుల చుట్టూ నేలపై వారం వ్యవధిలో రెండు సార్లు పోయాలన్నారు. ఈ సమయంలో మొక్కజొన్నలో అధిక తేమ వలన భాస్వరం లోపం ఏర్పడి మొక్కలన్నీ ఉదా రంగులోకి మారే అవకాశం ఉంటుందని, వర్షాలు నిలిచిన తర్వాత పొటాషియం నైట్రేట్ లేదా 19.19.19, 10 గ్రాములు లీటర్ నీటికి కలిపి మొక్కలపై పిచికారి చేయాలన్నారు. వర్షాలు పూర్తిగా ఆగిన తర్వాత అదనపు మోతాదుగా ఎకరాకు 20 నుంచి 25 కిలోల యూరియా, 15 నుండి 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ను అందజేయాలన్నారు. కత్తెర పురుగు సమస్య ఎక్కువగా ఉంటే క్లోరంట్రానిలిప్రోల్ 0.4 మి.లీ. లేదా స్పైనటోరం 0.5 మి.లీ. కలిపి ఆకుల సుడులు తడిచేలా పిచికారి చేయాలన్నారు. చల్లటి వాతావరణంలో అగ్గి తెగులు సోకే అవకాశం ఉందని, దీని నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు మరియు మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు.



# మున్సిపాలిటీ వద్దు గ్రామపంచాయతీయే ముద్దు

## జిల్లా కలెక్టర్ శశాంక్ వినతి పత్రం అందజేసిన ఘన్సిమియా గూడా గ్రామస్తులు

**శంషాబాద్, సెప్టెంబరు 4 (జనంసాక్షి)**
శంషాబాద్ మండల పరిధిలోని ఘన్సిమియగూడ గ్రామస్తులు పంచాయతిని మున్సిపాలిటీలో కలపొద్దని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్నీ కలిసి వినతి పత్రం అందజేశారు. గాన్సీమియాగుడా గ్రామపంచాయతీ అభివృద్ధికి నోచుకోలేదు. మరి కొన్ని సంవత్సరాలు గ్రామపంచాయతీగా అవకాశం ఇవ్వాలని శంషాబాద్ మండల్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ చిలకమర్రి మహేందర్ ముదిరాజ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్యుఐ సభ్యులు జిల్లా ఆనంద్, మాజీ ఉపసర్పంచ్లు మల్లేష్ గౌడ్, ఇమ్రాన్, వార్డుసభ్యులు కిట్టు, రవీందర్ గౌడ్ సిద్దయ్య, అర్జున్, హబీబ్,లాలప్ప, రాజు, నందు, గఫ్ఫార్,శ్రీకాంత్ రాజు, ప్రభాకర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# హైడ్రా పరిదిలోకి వచ్చే పేదల ఇళ్లకు ప్రత్యామ్నాయం చూపాలి..!

## తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ జేపసి అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 4 (జనంసాక్షి)**
హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సి( హైడ్రా ) పరిధిలోకి వచ్చే పేద మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ జేఏసీ అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు.బుదవారం నాడు రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతు చెరువులు ,కుంటలు, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా సంపాదించిన సొమ్మును రికవరీ చేయాలని అన్నారు. రాష్ట్రం ప్రభుత్వం హైడ్రా కమిషన్ ఏర్పాటు చేయడం తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ జేఏసి హర్షం వ్యక్తం చేస్తుంది. అయితే పేద మధ్యతరగతి ప్రజల ఇళ్ళను హైడ్రా నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులను నమ్మి జిహెచ్ఎమ్ సిహెచ్ఎండిఏ అధికారులు కాసులకు కక్కుర్తి పడి ఎఫ్ టిఎల్ బఫర్ జోన్లో చెరువులలో కట్టిన అపార్ట్మెంట్లను ఇండ్లకు పర్మిషన్లు ఇవ్వడం మూలంగా వాటిని కొన్న పేదలు నష్టపోయారని వారి నుండి విముక్తి కలిగించాలని అన్నారు. ముందుగా పర్మిషన్లు ఇచ్చిన అధికారులను చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ జేఏసి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా సదరు అధికారుల వ్యాపారస్తుల ఆస్తులను జప్తి చేయాలన్నారు. రాష్ట్రంలో ఇప్పుడు వినిపిస్తున్న పేరు హైడ్రా హైదరాబాదులో చెరువులు కుంటలు ప్రభుత్వ స్థలాల పరిరక్షణ వల్ల హైదరాబాదును సుందరీకరణ అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా పేదలకు న్యాయం చేయాలి అన్నారు.

# భవన వ్యర్థాల తరలింపు ట్రాక్టర్లపై రాంకీ సంస్థ దురాగతాలను నిరోధించాలి



**శేరిలింగంపల్లి, సెప్టెంబరు 04 (జనంసాక్షి):**
శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో కొనసాగుతున్న భవన నిర్మాణ వ్యర్థాల తరలింపు ట్రాక్టర్ల యజమానులపై రాంకీ సంస్థ దురాగతాలకు పాల్పడుతుందని, వారి దౌర్జన్యాల నుంచి తమను కాపాడాలని కోరుతూ హైటెక్ ట్రాక్టర్స్ యూనియన్ ప్రతినిధులు బుధవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాంకీ సంస్థ భవన నిర్మాణవ్యర్థాల ట్రాక్టర్ల పై దురాగతాలకు పాల్పడుతూ అధిక ధరను నిర్ణయించి బలవంతంగా వసూళ్లకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాంకీ సంస్థ వారు గతంలో భవనాల వ్యర్థాల తరలింపుకై ట్రాక్టర్ డ్రైవర్ల వద్ద టన్నుకు 350 రూపాయలు తీసుకొని డిపింగ్ చేయించుకునేవారని, ప్రస్తుతం ఆ ధరను డంపింగ్ వద్ద టన్ను కు 418 రూపాయలుగా నిర్ణయించి బలవంతంగా వసూలు చేస్తున్నారని అన్నారు. అధిక ధరను నిర్ణయించడం వల్ల ట్రాక్టర్ లోడుకు 1200 రూపాయలు అదనపు భారం పడుతుందని, చిన్నాచితకా పనులు చేసుకునే ట్రాక్టర్లకు ఇది మోయలేని భారమేనని వారు వాపోయారు. అనంతరం ఎమ్మెల్యే అరికెపూడి మాట్లాడుతూ...రాంకీ సంస్థ భవన నిర్మాణ వ్యర్థాలను తరలించడానికి అడ్డగోలు ధరలను నిర్ణయించి చిన్న ట్రాక్టర్ల పై బలవంతంగా రుద్దడం సరికాదని, అధిక భారంవల్ల గిట్టుబాటు కానిపక్షంలో వారు జీవోనపాదికి నోచుకోకుండా పోయే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే అన్నారు. రాంకీ సంస్థ ప్రతినిధులతో తాను మాట్లాడి పాతధర 350 రూపాయలకే టన్ను భవన నిర్మాణ వ్యర్థాలను డంపు చేసుకునేలా వారి సంస్థ ఉన్నతాధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కారం చూపిస్తానని అసోసియేషన్ ప్రతినిధులకు ఎమ్మెల్యే హామీని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, హైటెక్ ట్రాక్టర్స్ యూనియన్ ప్రతినిధులు రామకృష్ణ, చందు యాదవ్, బాబుమియా, గోపాల్, మారయ్య, శేఖర్ మరియు హఫీజ్పెట్ ట్రాక్టర్స్ యూనియన్ ప్రతినిధులు వేణు, మన్యం, చందు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యాశకు పోతే..ఉన్నది కాస్త స్వాహా

- **సైబర్ నేరాల పట్ల జాగ్రత్త వహించాలి**
- **డిఎస్పీ బాలకృష్ణా రెడ్డి**

**తాండూరు సెప్టెంబర్ 4(జనంసాక్షి)**
అత్యాశకు పోతే ఉన్నది కాస్త స్వాహా అవుతుందని డిఎస్పీ బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఓ వీడియో ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్పి బాలకృ ష్ణారెడ్డి మాట్లాడుతూ వాట్సాప్ లో వచ్చే మెసేజ్లను నమ్మ వద్దని సూచించారు. సైబర్ క్రైమ్ వ్యక్తుల ద్వారా వచ్చే మెసేజ్ లను ఓపెన్ చేయవద్ద న్నారు. అదేవిధంగా వేయి రూపాయలు ఇన్వెస్ట్మెంట్ చేస్తే వారం రోజుల తర్వాత పదయిదువందలు ఇస్తామని మోసపూరి త మాటలు నమ్మొద్దన్నారు. అత్యాశకు పోయి మోసాల బారిన పడవద్దు అని తెలిపారు.

# తెలంగాణ భూ పోరాటాల చరిత్ర

- భూ పరిష్కారాలకు గ్రామస్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలి
- మెదక్ జిల్లాను ప్రగతి పథంలో ముందు వరుసలో వుంచాలి
- అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలి
- మెదక్ జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోద రాజనర్సింహ



**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 4 (జనం సాక్షి):**
స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం విద్య,ఆరోగ్య,పంచాయతీ,మున్సిపల్,వ్యవసాయ, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్, విద్యుత్ ,అభయ హస్తం, ఆర్టీసీ శాఖలపై జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ తెలంగాణ అంటే భూ పోరాటాల చరిత్ర అని, భూ పరిష్కారాలకు గ్రామస్థాయిలో రెవెన్యూ సదస్సు నిర్వహించి భూ సమస్యల పరిష్కరించాలన్నారు. మెదక్ జిల్లా అభివృద్ధిలో ముందు వరుసలో నిలుపాలని, అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నారు. రాష్ట్రంలోఉన్న విద్యాలయాల్లో, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలన్నారు. రాష్ట్రంలో జబ్బు పడ్డ ప్రతివారికి ఉచిత నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అక్షయపాత్ర అదనపు వంటగదిని మెదక్‌లో ఏర్పాటు చేసుకోవడానికి అధికారులు దృష్టి సారించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. మెదక్ ప్రభుత్వ దవఖానలో 30 రోజుల్లో సిటీస్కాన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ట్రామా ,డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో బెడ్లు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన మండలాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నెలకొల్పాలన్నారు. జిల్లాలో ఉన్న పారిశ్రామికవేత్తలు విద్యను ప్రోత్సహించడానికి నిధులు కేటాయించాలన్నారు.



**మైనంపల్లి రోహిత్ రావ్, మెదక్ ఎమ్మెల్యే**
మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ మెదక్ ప్రభుత్వ హాస్పిటల్ ను పరిశుభ్రంగా ఉంచాలని, దోమలు లేకుండా చూడాలని, నిరంతరం వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, రోగులను ప్రవేట్ హాస్పిటల్ పంపించే ప్రయత్నాలు చేయవద్దన్నారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.

**కొత్త ప్రభాకర్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే**
దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్య సౌకర్యాలు కల్పించాలని, పాఠశాలల విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం, ఏకరూప దుస్తులు, పుస్తకాలు అందించి విద్యార్థులకు విద్యను ప్రోత్సహించాలన్నారు.

**వాకిటి సునీత లక్ష్మారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే**
నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నిరంతరం విద్యుత్ కొనసాగాలని, పెండింగ్ భవనాలు రోడ్లు పూర్తి చేయాలన్నారు. రుణమాఫీపై స్పష్టమైన విధానాన్ని రైతులకు వివరించాలన్నారు.

**శేరి సుభాష్ రెడ్డి, ఎమ్మెల్సీ**
ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో భూ సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కార దిశగా ప్రయత్నం చేయాలన్నారు.

**రాహుల్ రాజ్, జిల్లా కలెక్టర్**
జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ సమీక్ష సమావేశం సందర్భంగా మంత్రిగారు ,శాసనసభ్యులు, అధికారులు ఇచ్చిన సూచనలు తూచా తప్పకుండా పాటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పి సీఈవో ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెంచాలి



## జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**
రోగులకు మెరుగైన వైద్యం అందించి ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం కలిగించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ వైద్య సిబ్బందిని ఆదేశించారు.బుధవారం ధన్వాడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందించే సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది సకాలంలో విధులకు హాజరై రోగులకు వైద్య సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, రిజిస్టర్, మందుల నిల్వ తదితర వాటిని పరిశీలించారు. ఆస్పత్రిలో అపరిశుభ్రత, వాచ్ మెన్ రోగులకు చికిత్స చేస్తుండటం చూసిన కలెక్టర్ వైద్య సిబ్బందిపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.అనంతరం ధన్వాడ మండలం పాతపల్లి వాగును కలెక్టర్ పరిశీలించారు. ఇటీవలే కురిసిన జోరు వానలో పాఠశాల విద్యార్థులు ప్రమాదకరంగా వాగు దాటిన ఘటనపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. అలాంటి సంఘటన మరోసారి పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వర్షాల సమయంలో పిల్లలను పాఠశాలలకు పంపించరాదని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో ధన్వాడ తహసిల్దార్ సింధుజ, ఎంపీడీవో సాయి ప్రకాష్, నీటిపారుదల శాఖ ఈ ఈ బ్రహ్మానందం, పీఆర్ఏఈ, ఆసుపత్రి వైద్యులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# చెరువు శిఖం, కాలువల పక్కన ఉన్న లే ఔట్‌లు అనుమతించం..!

## జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో సెప్టెంబర్ 04 (జనంసాక్షి)**
ప్రభుత్వ భూమి, చెరువుశిఖం,కాలువల పక్కన ఉన్న లే ఔట్‌లు అనుమతించబడవని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి లే ఔట్ కమిటీ సమావేశమై టి.జి. బిపాస్ ద్వారా వచ్చిన (4)లే అవుట్ దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ లే అవుట్ కు వెళ్ళే అప్రోచ్ రోడ్డు, లే అవుట్ లోపల ఉన్న రోడ్లు ప్రభుత్వానికి గిఫ్ట్ డీడ్ ముందే చేయాలని అదేవిధంగా 10 శాతం స్థలం ప్రభుత్వానికి మార్టిగేజ్ చేసి ప్రహరీ నిర్మించాలని, అందులో మొక్కలు పెంచాలని సూచించారు. లే అవుట్ లో డ్రెయినేజీ, నిబంధనల మేరకు రోడ్లు, విద్యుత్, తాగు నీటి వసతి ఉండాలని సూచించారు.లే అవుట్ ప్రతిపాదనలు కమిటీ ముందు రాకముందే అదనపు కలక్టర్ రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, రోడ్లు భవనాలు, విద్యుత్ శాఖ అధికారులు కలిసి సైట్ ఇన్స్పెక్షన్ చేయాలని సూచించారు. చెరువు శిఖం భూమి, బఫర్ ఏరియా, ప్రభుత్వ భూమి, అసైన్డ్ భూమిలో ఉంటే ముందే గుర్తించి లే ఔట్ తిరస్కరించాలని సూచించారు. నేడు 4 లేఔట్ లు కమిటీ ముందుకు ఆమోదానికి తీసుకురాగా పరిశీలించి ఒక డ్రాఫ్ట్ లేఔట్‌ను ఆమోదించి మరో లే ఔట్ ను షరతులతో ఆమోదించారు. మిగిలిన రెండు లేఅవుట్లు వివిధ కారణాలతో పెండింగ్‌లో పెట్టారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యం నగేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ కార్యనిర్వహక ఇంజనీరు మల్లయ్య, ఇరిగేషన్ ఈఈ మధుసూదన్, రోడ్లు భవనాల డిఈ సీతారామ స్వామి, టౌన్ ప్లానింగ్ అధికారి కరుణాకర్, విద్యుత్ శాఖ ఈఈ, తదితరులు పాల్గొన్నారు.



# వరద బాధితులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- ప్రధాన మంత్రి తెలంగాణలో పర్యటించాలి
- కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలి
- తక్షణ సాయం కింద నిధులు కేటాయించాలి
- విపత్కర పరిస్థితుల్లో రాజకీయాలు చేయడం సరికాదు
- మంత్రి జూపల్లి కృష్ణారావు



**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్4 (జనంసాక్షి):**
వరద బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని,ఎవరూ అధైర్య పడొద్దని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు భరోసా ఇచ్చారు. మూడు రోజుల క్రితం కురిసిన అతి భారీ వర్షాలతో నాగర్ కర్నూల్ జిల్లా అతలాకుతలమై, ఆస్తి, పంట నష్టం జరిగిన నేపథ్యంలో మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. కొల్లాపూర్ మున్సిపాలిటీ పరధిలోని చౌట బెట్ల, నర్సింగరావుపల్లి, తాళ్ల నర్సింగాపూర్ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ముంపుబారిన పడ్డ పంట పొలాలు, కోతకు గురైన రోడ్లను, తెగిపోయిన బ్రిడ్జిలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దెబ్బతిన్న పంటలను పరిశీంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టపోయిన బాధిత రైతులను ఓదార్చారు. పశు నష్టం, పంట నష్టం ఇతర వాణిజ్య పంటల నష్టంపై ప్రత్యేక సర్వే నిర్వహించి పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. అధికారులు చేయాల్సిన పనులు త్వరగా పూర్తిచేయాలని, రోడ్ల మరమ్మతు పనులు తాతాలికంగా పూర్తి చే సి రవాణా సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ గతంలో ఎన్నడు చూడని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పలు జిల్లాల్లో వరద బీభత్సం సృష్టించిందని, ప్రాణనష్టం జరిగిందని, పంట పోలాల్లో ఇసుక మేటలు వేసిందని, ఇండ్లు దెబ్బతిన్నాయని, రహదారులన్నీ అస్తవ్యస్తంగా మారాయని, కొన్నిచోట్ల బ్రిడ్జిలు సైతం కొట్టుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరద నష్టాన్ని పరిశీలించి, బాధితులకు భరోసా కల్పించే పనిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ముంపు ప్రాంతాల్లో పర్యటించారన్నారు. ముంపు బాధితుల కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం, బాధితులకు రూ. 10 వేల తక్షణ సహాయం, దెబ్బతిన్న పంటలకు ప్రతి ఎకరానికి రూ.10 వేలు పరిహారం అందిస్తామని వెల్లడించారు. పంట నష్టంపై అధికారులు నివేదిక అందగానే పరిహారం అందజేస్తామని చెప్పారు. విపత్కర పరిస్థితుల్లో రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.6 వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా అని, ఇది ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. ఇంతటి విపత్తుపై తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, ప్రదాని నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించి, సాయాన్ని ప్రకటించాలని కోరారు.



# పిఎస్ఓలు ఫిజికల్ ఫిట్నెస్ కలిగి ఉండాలి

## జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**
పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్స్ పిఎస్ఓలు శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండి ఫిజికల్ ఫిట్నెస్ కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. బుధవారం ఉదయం పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్స్‌లకు అదనపు ఎస్పి రియాజ్ హుల్ హక్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం 2వ బ్యాచ్ ప్రారంభించారు. అందులో భాగంగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ సందర్భంగా వారితో మాట్లాడారు.విధి నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. పిఎస్ఓలు ప్రజా ప్రతినిధుల రక్షణార్థం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, తన పరిసరాలపై అవగాహన కలిగి ఉండి అనుమానాస్పద వ్యక్తుల లేదా కార్యకలాపాల నిఘా ఉంచాలని విధి నిర్వహణలో నీట్ టర్నోట్ కలిగి ఉండి, మర్యాదగా సౌమ్యంగా ఉండాలని సూచించారు.ఆయుధాలు ఉపయోగించే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని వాటి వినియోగం పై పట్టు కలిగి ఉండాలని సూచించారు. విధుల్లో ఉన్నప్పుడు విఐపిని వదిలి ఉండరాదు అని సెల్ ఫోన్ మాట్లాడుతూ ఉండరాదు సూచించారు. పిఎస్ఓ లకు నెలకు ఒకసారి ఫైరింగ్ ప్రాక్టీస్ చేయించాలని, అధునాతన ఆయుధాలపై నిరంతరం శిక్షణ ఇవ్వాలని మరియు ఫిజికల్ ఫిట్నెస్ ట్రైనింగ్ ఇవ్వాలని, ప్రతి ఒక్కరు ఫిజికల్ ఫిట్నెస్ కలిగి ఉండాలని ఎస్పి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ.నరసింహ, ఆర్ఎస్ఐ శివశంకర్, పిఎస్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

- అన్ని దానాల కన్నా రక్త దానం గొప్పది
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్4 (జనంసాక్షి):**
రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. బుధవారం నాగర్ కర్నూల్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో ప్రపంచ ఫోటోగ్రాఫర్ దినోత్సవ ముగింపు సంబరాల సందర్భంగా జిల్లా ఫోటోగ్రాఫర్స్ మరియు వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం తరపున ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రారంభించారు. రక్తదానం చేసిన ఫోటో, వీడియో గ్రాఫర్లను జిల్లా కలెక్టర్ అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం ఆధునిక టెక్నాలజీతో రూపొందిన, అధునాతన ఫోటో మరియు వీడియో కెమెరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక క్షణాన్ని మధురమైన జ్ఞాపకంగా తీర్చగలిగేది ఫోటోగ్రఫీ అని, ఎన్నో భావాలను ఒక చిత్రంలో తెలిపే గొప్పతనం ఒక ఫోటోగ్రఫీకి మాత్రమే ఉందని, అద్భుతమైన జ్ఞాపకాలు, తియ్యటి అనుభూతులు, మధుర ఘట్టాలు, గొప్ప సన్నివేశాలు, వెలకట్టలేని దృశ్యాలను పదికాలాల పాటు పదిలంగా మన కళ్ల ముందు ఉంచేది ఫోటోనే అని కలెక్టర్ తెలిపారు. ఫోటోగ్రాఫర్లు ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవటంలో ముందు వరుసలో ఉండాలన్నారు. సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉన్న ఫోటోగ్రాఫర్లు, ఈ వీడియో గ్రాఫర్, అందరు రక్తదానం చేయడం అభినందనీయమని కొనియాడారు.జిల్లాలో ప్రతి ఒక్కరూ రక్తదానం చేసే విధంగా రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు అవగాహన కల్పించాలన్నారు. యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని సూచించారు. మనం ఆరోగ్యంగా ఉండాలని, ఇతరులకు రక్తదానం చేస్తామనే ధైర్యం కలిగి ఉండాలని పేర్కొన్నారు. అన్ని దానాల కన్నా రక్త దానం గొప్పదని చెప్పారు. రక్తం సరైన సమయంలో అందక పోవడం వల్ల ఎంతో మంది తమ ప్రాణాలను కోల్పోతున్నారు. రక్త దానంపై ఎప్పటికప్పుడు ప్రభుత్వాలు కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయని. రక్త దానం అనేది ప్రతీ ఒక్కరూ చేయాల్సిన సామాజిక బాధ్యత అని తెలిపారు, 18 ఏళ్ల నుంచి 55 ఏళ్లలోపు ఉన్న వ్యక్తులు అందరూ రక్తదానం చేయవచ్చని సూచించారు. రక్తదానం చేస్తే నీరసంగా ఉంటారనేది అపోహ మాత్రమేనని పేర్కొన్నారు. రక్తం పెరగాలంటే ఆకుకూరలు, బెల్లం, మొలకెత్తిన విత్తనాలు, క్యారెట్ ,బీట్రూట్, వేరుశెనగ తినాలని చెప్పారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతినిధులు సభ్యత్వ నమోదును ముమ్మరంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫోటోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నేతాజీ గౌడ్, వెంకట్, జిల్లా కోశాధికారి గూళ్ళ చెన్న కేశవులు,ఆ సంఘం సీనియర్ నాయకులు గోవర్ధన్, విజయ్ గౌడ్,మల్లేష్, నాయకులు రాజు, కపిలవాయి రాజు, వెంకటేష్, నిర్మల దేవి, బూషిపాగ శ్రీను, వీరేందర్ గౌడ్, రెడ్ క్రాస్ కార్యదర్శి రమేష్ రెడ్డి, కుమార్, డాక్టర్ రోహిత్, సీనియర్ జర్నలిస్ట్ అబ్దుల్లా ఖాన్, ఫోటోగ్రాఫర్లు వీడియో గ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.



# మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్టించాలి

## జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**
ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించి భక్తిని చాటుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలోమట్టి విగ్రహాల పోస్టర్లను జిల్లా కలెక్టర్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు.వినాయక చవితి పండగ పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రతి సంవత్సరం గణేష్ చతుర్థి సందర్భంగా మట్టి వినాయక విగ్రహలను ప్రతి జిల్లాకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. మన జిల్లాకూ మట్టి వినాయక విగ్రహలను పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో చేసిన విగ్రహలను నిమజ్జనం చేయడం వల్ల చెరువులు కలుషితం అవుతాయని, అలా కాకుండా మట్టి వినాయక విగ్రహలను ప్రతిష్టించి చెరువులను సంరక్షించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో, తెలంగాణ కాలుష్యం నియంత్రణ మండలి సభ్యులు పాల్గొన్నారు.

# ఏదుల రిజర్వాయర్‌ను పరిశీలించిన మంత్రి జూపల్లి

**వనపర్తి, సెప్టెంబర్ 04(జనం సాక్షి):**
పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలలో భాగంగా వనపర్తి జిల్లాలోని ఏదుల గ్రామ శివారులో నిర్మించిన రిజర్వాయరును రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం సందర్శించారు. పనుల పురోగతి, పంపుల పనితీరుపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. భారీ మోటార్లు బిగించిన సర్జిపూల్‌ను పరిశీలించారు. వరద నీరు మోటార్లపైకి రాకుండా సరైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అలసత్వాన్ని ప్రదర్శించకుండా ఎప్పటికప్పుడు రిజర్వాయరును తనఖీ చేస్తుండాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించే ఏర్పాట్లు చేస్తామని వెల్లడించారు. జిల్లాలో ఎలాంటి ప్రాణ నష్టం గాని, ఆస్తుల నష్టం గాని జరుగలేదని, అయినా ముమ్మందు కురిసే వానల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మంత్రి వెంట పలువురు ఇంజనీర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# హైడ్రా పేరుతో బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు

## జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్





**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 4 (జనం సాక్షి)**
హైడ్రా పేరుతో బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ హెచ్చరించారు. హైడ్రా పేరుతో రూ.20 లక్షలు డిమాండ్ చేసిన వ్యక్తికి సంబంధించిన వివరాలు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. "బండ్ల విప్లవ్ సిన్హా( 42) సాయి విల్లాస్ కాలనీ, అమీన్పూర్ సంగారెడ్డి జిల్లాలో నివాసం ఉంటూ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్‌గా పని చేస్తున్నారు. ఇతని సొంత గ్రామం ఖమ్మం పట్టణమని అమీన్పూర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉండేవాడన్నారు. అమీనపూర్ చుట్టుపక్కల ఉండే వ్యక్తుల మాదిరిగా ఖరీదైన ఇళ్లలో ఉంటూ విలాసవంతమైన జీవితం గడపాలని నిర్ణయించుకుని, అమీన్పూర్ చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించగా ఇక్కడ ఎక్కువగా నాన్ లోకల్ వారు ఉండి ప్రభుత్వ స్థలాల్లో, ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లలో అక్రమ ఇండ్ల నిర్మాణాలను చేపట్టడం గమనించి, వారిని ఎలాగైనా బెదిరిస్తే వారి వద్ద నుండి అధికంగా డబ్బులు వసూలు చేయవచ్చని నిర్ణయించుకొన్నాడని తెలిపారు. ప్రభుత్వ స్థలంలో ఎవరైనా ఇల్లు కడితే అట్టి ఇంటి యజమానులు, బిల్డర్ల వద్దకు వెళ్లి వారిని బెదిరించి, వారి గురించి పేపర్ లో రాయిస్తాను అని కలెక్టర్, రెవెన్యూ, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించి వారి వద్ద నుండి డబ్బులు వసూలు చేయడం ప్రారంభించాడని తెలిపారు. గత కొంతకాలంగా నిందితుడు బండ్ల విప్లవ్ సిన్హా నివాసం ఉండే సాయి విల్లాస్, ఫ్యూజన్ స్కూల్ వెనకాల అమీన్పూర్ చెరువు నుండి వచ్చే నాలాకు అనుకొని ప్రాజెక్టు ఎల్.ఎల్.పి. పేరుతో ఒక పెద్ద నిర్మాణ సంస్థ విల్లా నిర్మాణాలు చేయుచున్నది, అట్టి ప్రాజెక్టుకు వెళ్లేదారి అమీన్పూర్ చెరువు మధ్యలో నుండి ఉండడంతో నిందితుడు అట్టి వ్యక్తుల వద్దకు వెళ్లి మీరు వేసిన రోడ్డు నాలా ప్రవాహానికి అడ్డు వస్తుంది, ఈ ప్రాజెక్టు అక్రమంగా నిర్మిస్తున్నారని చెప్పి వారిని ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నించాడన్నారు. ఆగస్టు 14న హైడ్రా కమిషనర్ శ్రీ రంగనాథ్ అమీన్పూర్‌కు వచ్చి వెళ్ళిన తరువాత ఆ రోజు రాత్రి నిందితుడు ప్రాజెక్టు ఎల్ఎల్‌పి. రాజేందర్‌కు వాట్స్ ఆప్ కాల్ చేసి వారిప్రాజెక్టు పక్కన గల ఇరిగేషన్ నాలా గురించి కలిసి మాట్లాడాలి అని అన్నాడు. దానికి అతను సరే అన్నాడు. తేదీ 18.08.2024 నాడు మధ్యాహ్నం పిస్తా హౌస్, అశోక్ నగర్ దగ్గర కలుద్దాం అని వాట్స్ ఆప్ ద్వారా మెసేజ్ చేశాడు. అతను దానికి అంగీకరించి ఆ రోజు కలవడం జరిగింది. అక్కడ నిందితుడు రంగనాథ్ సార్‌తో దిగిన ఫోటోస్ చూపించి, రంగనాథ్ సారుకి చాలా దగ్గర అని, అమీన్పూర్ గురించి ఏదైనా నన్నే అడుగుతాడు అని చెప్పి, ప్రాజెక్టు జోలికి రావోద్దు అంటే నాకు 20 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేసి, చివరగా 16 లక్షలలు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ నెల 3 న రాజేంద్రనాథ్, మంజునాథ్ రెడ్డి మరొక ఇద్దరు కలిసి నిందితుడు బండ్ల విప్లవ్ సిన్హా ఇంటికి వచ్చి అతను అడిగిన డబ్బులలో రాజేంద్రనాథ్ 2 లక్షల రూపాయలను అడ్వాన్స్‌గా ఇవ్వగా, డికాయ్ ఆపరేషన్ లో ఉన్న టాస్క్ ఫోర్స్, అమీన్ పూర్ పోలీసులు డబ్బుతో సహ నిందితున్ని పట్టుకోని, క్రైమ్ నెంబర్ 563/2024 సెక్షన్ 308 (5) బి.యన్.యస్. ఆక్ట్ ప్రకారం అమీన్ పూర్ పోలీసు స్టేషన్ నందు కేసు నమోదు చేసి, నిందితున్ని రిమాండ్ కు పంపించడం జరిగిందన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ. ఎ.సంజీవరావ్, అమీన్ పూర్ ఇన్స్పెక్టర్ సదా నాగరాజు, సిసియస్ ఇన్స్పెక్టర్ మల్లేశం, యస్.బి. ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# మహిళా స్వరాజ్యం


జనంసాక్షి
www.janamsakshi.org

గురువారం
05.09.2024

## ఉపాధ్యాయుడే దేశ నిర్మాత



**రాజేశ్వరి రెడ్డి,నిజాంపేట్**

త్యాగయ్య లాంటి వాగ్గేయకారుడు కూడా గురులేక అని పాడుకున్నాడు. రాముడు కృష్ణుడు సమస్త దేవుళ్లు కూడా గురువు దగ్గర విద్యాభ్యాసం చేశారు అనే కంటే గురువు యొక్క ఆవశ్యకతను మానవాళికి తెలియజేశారు అనడం మంచిది. అజ్ఞానం తిమి రాద్ధసియా జ్ఞానంజన శలాకయ చక్షురునీవితం ఏన తస్మై శ్రీ గురవే నమః.ఇంతకన్నా మంచి పదాలు ప్రపంచంలోనే లేవు.బిడ్డకు తొలి గురువు అమ్మ.లోకానికి శిశువును శిశువుకు లోకాన్ని పరిచయం చేసేది ఆమె కాబట్టి తల్లి తొలి గురువు.ఆ బిడ్డకు నడత నేర్పే నాన్న మలి గురువు.ఆ తర్వాతి స్థానం గురువులది.ఈ లోకంలో ఎలా మెలగాలో చెబుతూ విద్యాబుద్ధులు నేర్పిస్తాడు. అందుకే పెద్దలు మాతృదేవోభవ పితృదేవోభవ ఆచార్యదేవోభవ అన్నారు.గురు బ్రహ్మ గురు విష్ణు గురు దేవో మహేశ్వరహ గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః గురువు, ఉపాధ్యాయుడు, టీచర్ పిలుపు పలురకాలు.అయినా వారు ఆదేశించేది చేసేది ఒక్కటే. మనలోని అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే దీపాన్ని వెలిగించడం. మన జీవన ప్రయాణంలో ఏది మంచి ఏది చెడు అనే ఆలోచనలను మనలో రేకెత్తించే వ్యక్తి మన ఆత్మ గురువులాంటి గురువులందరికీ పాదాభివంద నాలు.ఆది యుగం నుండి ఆధునిక యుగం వరకూ ఆయనే రుషి. జీవన వికాసానికి నిచ్చెన వేసే అక్షర కార్మికుడు.ఆయనెవరో కాదు మనకు విద్యాబుద్ధులు నేర్పే గురువు.మనదేశంలో రెండో రాష్ట్రపతి మేధావి విద్యావేత్త అయిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ. ఆయన జయంతిని ప్రభుత్వం ఉపాధ్యాయ దినోత్సవంగా గుర్తించింది.ప్రతి ఏటా సెప్టెంబర్ 5.గురువులను గౌరవించుకునే అవకాశం కల్పించింది. ఆయన పుట్టినరోజు నాడు ఆయన మేధస్సుకు ముగ్ధులై అందరూ బహుమతులు కానుకలు ఇచ్చి ఇంకా ఏం కావాలని అడిగినప్పుడు రాధాకృష్ణ గారు తనకోసం కాకుండా తనలాంటి అందరి ఉపాధ్యాయుల కోసం తనతో అందరినీ ఉపాధ్యాయులను గౌరవించి వారిని గుర్తించమని చెప్పారట. అప్పుడు వాళ్లంతా వేరే రోజు ఎందుకు మీ పుట్టిన రోజుని ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుందామని తీర్మానించారు.ఆ రోజు నుండి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి.గురువు మనసుని ఆవరించుకుని ఉన్న అజ్ఞానపు పొరలను తొలగించి జ్ఞానదీప్తిని వెలిగిస్తాడు.దైవం మంచి గురువును చూపలేకపోవచ్చు కాని మంచి గురువైతే మాత్రం దేవుణ్ణి సైతం చూపగలడు అంటారు పెద్దలు.దేవుడు గురువు పక్కపక్కనే ఉంటే నేను మొదట గురువుకే నమస్కరిస్తా అన్నారు కబీర్ దాస్ గారు.అంతటి ఉన్నతమైన ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చి గురువు జాతి గౌరవాన్ని లోకానికి చాటి చెప్పిన వారు డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణగారు.సనాతన ధర్మాన్ని పరంపరాగతంగా పరిరక్షిస్తున్న ఆది గురువులను స్మరించుకుంటూ నేటి పిల్లలను పావన నవజీవన బృందావన నిర్మాతలుగా రాబోవు తరం దూతలుగా తీర్చిదిద్దడానికి ఘనమైన అడుగులు వేయించే వారధులు గురువులు.చదువుతో పాటు సంస్కారాన్ని సామాజిక అంశాలతో పాటు సమస్యలను ఎదుర్కొనే నేర్పు నేర్పించింది గురువులేగా.చదివిన విషయాల ను కూలంకషంగా అర్థం చేసుకునేలా ఒకటికి పదిసార్లు విసుగులేకుండా బోధించే కనపడని శక్తి గురువు.సమాజానికి బావి భారత పౌరులకు వెన్నెముక లాంటి వారు గురువులు.ఏ స్థాయిలో ఉన్నవారైనా ఎలాంటి వృత్తిలో ఉన్న వారైనా వారి విజయానికి గురువే కారణమని చెపుతారు. అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని అందించే గురువుల పట్ల ఎల్లప్పుడూ గౌరవ భావం కలిగి ఉండాలి.రేపటి పౌరుడి భవిష్యత్తు నిర్మాత గురువు. గురువును గౌరవించుకుంటే ప్రయోజకులౌతారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైన కర్తవ్యం. అందుకే భావితరాల భవిష్యత్తు ఉపాధ్యాయుడి చేతిలో ఉంటుంది.గురువులు నేర్పిన పాఠాలు భవిష్యత్తు జీవితానికి పునాదులుగా నిలుస్తాయి .అందుకే అనిర్వచనీయమైనది గురువు పాత్ర. ఆనాటి తరం నుండి ఇప్పటిదాకా ఎంతో దూరాలు వెళ్లి విద్య నేర్చుకుంటారు.ఆనాటి తరం గురువును దైవంగా భావించి వారి కనుసన్నల్లో ఉంటూ ఎంతో భయంగా భక్తి పూర్వకంగా ఎంతో విలువైనదిగా విద్యనభ్యసించేవారు.గురువులకు పరమ విధేయులుగా ఉండేవారు..గురువుల పట్ల గౌరవం తగ్గుతూ వస్తోంది.నేడు వస్తున్న సినిమాల లో గురువులను జోకర్లలాగా చిత్రీకరించి చూపిస్తు న్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులను ఆటపట్టించి అవమాపరిచే సన్నివేశాలు గురువుల పట్ల గౌరవాన్ని తగ్గిస్తున్నాయి.ఉపాధ్యాయులు తమ వృత్తిని మర్చిపోయి బ్రతకడానికి బడిపంతులు అన్న చందంగా మారారు ఈ నినాదాన్ని మార్చి భావితరాలను నిర్మించే వారధి లాంటివారుగా ఉపాధ్యాయులు ఉండాలి.ఇలాంటి పూజ్య స్థానంలో ఉన్న కొందరు ఉపాధ్యాయులు చేస్తున్న వెకిలి చేష్టలు అనైతిక పనులు ఉపాధ్యాయ వృత్తికి కళంకం తెచ్చిపెడుతున్నాయి విద్యాలయాలు కళాశాలలు యూ నివర్సిటీలు ఎన్ని భాషల్లో ఎన్నెన్ని అవతరించిన సమాజంలో నైతిక విలు వలు దిగజారడానికి కారణం ఇలాంటి మేధావులే.




– వీరవెల్లి శ్రీలత
ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్. నేరేడుచర్ల.

భారతీయ సంస్కృతి సాంప్రదాయాలలో తల్లిదండ్రులది మొదటి, తర్వాత అంతటి గొప్ప స్థానాన్ని గురువుకి ఇవ్వడం జరిగింది. ఒకరు జన్మ నుంచి సృష్టికి పరిచయం చేస్తారు, మరొకరు ఆ సృష్టిలో ఎలా జీవించాలి? సమాజంలో ఎలా జీవించాలి అనేది నేర్పించేదే గురువు. ఏ విద్య నేర్చుకోవాలన్నా గురువు తప్పనిసరిగా ఉండాలి, గురువు లేని విద్య రాణించదు అని పెద్దలు చెప్తారు.మహాభారతంలో యక్షుడు ధర్మరాజును "మనిషి మనీషిగా ఎలా అవుతాడు?" అని ప్రశ్నించగా ధర్మరాజు "అధ్యయనం వల్ల, గురువు ద్వారా" అని సమాధానమిస్తాడు. అంటే గురువులకు అంతటి శక్తిఉంది. శిలను శిల్పంగా మలచగల శక్తి ఒక్క గురువుకే ఉంది. అందుకే "మాతృదేవో భవ, పితృదేవోభవ" ఆచార్యదేవోభవ" అంటూ తల్లి,తండ్రి తర్వాత స్థానాన్ని గురువుకిచ్చారు పెద్దలు.చాణుక్యుడు చెక్కిన రాజకీయశిల్పం చంద్రగుప్త మౌర్యుడు, సమర్థ రామదాసు మలచిన వీర కరవాలం ఛత్రపతి శివాజీ, రామకృష్ణ పరమహంస తీర్చిదిద్దిన ఆధ్యాత్మిక గోపురం వివేకానందుడు. మన సనాతనం నేర్పిన సద్బోధల తార్కాణాలు వీరు. ఎందరో మహానుభావులను కన్నది మన భారతదేశం. మరెందరో గురువుల బోధలతో పునీతమైనది మన భరతమాత. ధార్మికగుణం, సహృదయత,సచ్ఛీలత,అంకి తభావం,మృదు భాషణం,ప్రేమవాత్సల్యాలు కలిగి ఎందరో శిష్యులను భావిభారత పౌరులగా తయారుచేస్తున్న గురుబ్రహ్మలందరికీ పాదాభివందనం. సమాజంలోగురువుకు ఉన్న స్థానం అంత గొప్పది. 'గు' అంటే చీకటి, 'రు' అంటే పోగొట్టేది అని అర్థం. అంటే మనలో అజ్ఞాన పొరలు తొలగించి, జ్ఞానదీప్తిని వెలిగించేవాడు గురువు అన్నమాట. అలాంటి గురువును దైవం కంటే మిన్నగా ఆరాధించే సంస్కృతి మనది.మహాత్మా గాంధీ ఎంఎన్ రాయ్ మాటల్లో చెబితే.. భారతదేశంలో ఆనాడు ఉన్న మత,

## గురువులకే గురువు.. సర్వేపల్లి రాధాకృష్ణ

ఆధ్యాత్మిక పునరుద్ధరణ వాదాన్ని అకడమిక్ తాత్విక స్థాయికి తీసుకువెళ్లిన గొప్ప పండితుడు సర్వేపల్లి. ఆయన 15 సార్లు నోబెల్ సాహిత్య బహుమతికి, 11 సార్లు నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయ్యారు.మహాభారత కాలం నుంచి... శ్రీకృష్ణ పరమాత్మ, అర్జునుడిని సిసలైన గురుశిష్య సంబంధానికి ప్రతీకలుగా కొలుస్తున్నాం. సర్వేపల్లి తనకు కృష్ణుడితో సమానమని జాతిపిత మహాత్మా గాంధీ కీర్తించారు. మీరు నా కృష్ణుడు, నేను అర్జునుడిని' అన్నారు గాంధీజీ. మీరు నా ఉపాధ్యాయుడు అని కీర్తించారు పండిట్ నెహ్రూ. బహుశా ఈ వ్యాఖ్యల నేపథ్యం నుంచే ఆయన పుట్టిన రోజును టీచర్స్ డేగా నిర్వహించాలనే ఆలోచన పుట్టిందేమో మన వారికి.అందుకే ఆయన పుట్టిన రోజు 'ఉపాధ్యాయ దినోత్సవం' అయ్యింది.తరతరాలుగా... యుగయుగాలుగా సనాతన భారతీయ విచారధారలోని పరమార్ధ విషయాల్ని ప్రపంచానికి సూటిగా... సులభంగా, స్పష్టంగా తెలియజెప్పిన ధీమంతుడు.. ధీశాలి సర్వేపల్లి. హృదయాన్ని, జ్ఞానాన్ని మేధస్సును సమపాళ్లలో పండించిన ప్రజ్ఞాశాలి ఆయన.మన భారత రెండవ రాష్ట్ర పతి, రాజకీయ వేత్త,తత్వవేత్త,రాజనీతిజ్ఞుడు,ఆచార్యుడు అయిన సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు జన్మించిన సెప్టెంబరు 5వ తేదినాడు మనం "జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం" జరుపుకుంటాము. ఈరోజు ప్రభుత్వం ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులకు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి అవార్డులనిచ్చి సత్కరిస్తుంది. వారి సేవలను కొనియాడుతూ భావితరాలకు స్ఫూర్తి నందిస్తుంది. పాఠశాలలలో గురుపూజోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తారు. వారి ఉన్నతికి కారణమైన గురువులకు కృతజ్ఞతలు తెలుపుకుంటారు విద్యార్థులు. కొన్ని పాఠశాలల్లో "స్వయం పరిపాలనా దినోత్సవం" కూడా నిర్వహించుకుంటారు. సమాజంలో గురువుకు ఉన్న స్థానం అంత గొప్పది. 'గు' అంటే చీకటి, 'రు' అంటే పోగొట్టేది అని అర్థం. అంటే మనలో అజ్ఞాన పొరలు తొలగించి, జ్ఞానదీప్తిని వెలిగించేవాడు గురువు అన్నమాట. అలాంటి గురువును దైవం కంటే మిన్నగా ఆరాధించే సంస్కృతి మనది. ఏటా సెప్టెంబర్ 5ను 'టీచర్స్ డే' (ఉపాధ్యాయ దినోత్సవం)గా నిర్వహించుకుంటాం..మనిషి పుట్టినప్పటి నుంచి మరణించేదాకా ప్రతి అడుగులోనూ, ప్రతిక్షణంలోనూ అతను ఏదో క్రొత్త విషయాన్ని నేర్చుకుంటూనే ఉంటాడు. గురువు అనేది ఒక బాధ్యత. ఒక ఆత్మీయత. నన్ను ఒక గురువుగా తీర్చిదిద్దిన నా గురువులకివే నా ప్రణామాలు, ధన్యవాదాలు. ప్రతి ఉపాధ్యాయుడు తనవృత్తిని దైవంగా భావిస్తూ...ఇష్టంగా తన కర్తవ్యాన్ని నిర్వర్తించాలనికోరుకుంటూ..



సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా
**ఉపాధ్యాయుల దినోత్సవం..**

## భావితరాలకు భాగ్యవిధాత



**– చాకిలం సునీషా, సిద్దిపేట**

భారతదేశంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం రోజు సెప్టెంబర్ 5న ప్రతి సంవత్సరం జరుపుకుంటారు. ఈ రోజు సెలవుదినం కాదు. ఉత్సవం జరుపుకొనవలసిన దినం. పాఠశాలలు యధావిధిగా జరిగి, ఉత్సవాలు జరుపుకుంటాయి. ఈ రోజున ఉపాధ్యాయులకు జాతీయ, రాష్ట్రీయ, జిల్లా స్థాయిలలో పురస్కారాలు, గౌరవసత్కారాలు జరుగుతాయి. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం అక్టోబరు 5వ తేదీన జరుపుకుంటారు.మన జీవితంలో ఉన్నత స్థానం గురువుకు ఇస్తాం. మనల్ని జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో ఒక గురువు కృషి వెలకట్టలేనిది. అటువంటి గొప్ప వ్యక్తులను స్మరించుకుంటూ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 5వ తేదీన భారతదేశంలో టీచర్స్ డే జరుపుకుంటున్నాము. గురుబ్రహ్మ గురుర్విష్ణు గురుదేవో మహేశ్వరః గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురువేనమః". గురువు లేనిదే విద్య లేదు.. విద్య లేనిదే జ్ఞానం లేదు. జ్ఞానం లేకపోతే.. ఈ లోకం మనుగడే ఉండదు. అందుకే.. గురువే.. ఈ ప్రపంచానికి అధిపతే. గురువే.. మనకు ప్రత్యక్ష దైవం. గురుపూ జోత్సవం నేపథ్యంలో ప్రతి ఒక్కరూ గురువుల సేవలను గుర్తు తెచ్చుకోవల్సిందే.మిమ్మల్ని మంచి స్థాయికి ఎదిగేందుకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు ను ఘనంగా సత్కరించాల్సిందే. కరోనా నేపథ్యంలో గురువులను నేరుగా కలుసుకోలేని ఈ పరిస్థితుల్లో కనీసం వీడియో కాల్, ఫోన్, మెసేజ్ల ద్వారా అయినా గురువులను విష్ చేద్దాం. గురువుల గొప్పతనాన్ని తెలిపే ఈ అందమైన కోట్స్‌తో ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలపండిలా.. అజ్ఞానమనే చీకటిలో ఉన్న వారిని విజ్ఞానమనే మార్గంలో నడిపించే ఏకైక వ్యక్తి గురువు/టీచర్ ఏ దానం చేసినా కరిగిపోతుంది కానీ విద్యా దానం చేస్తే అది చచ్చిపోయేంత వరకు వారితోనే ఉంటుంది. అలాంటి గొప్ప దానాన్ని చేసే ఉపాధ్యాయుడిని సాక్షాత్తు ఆ పరబ్రహ్మతో పోల్చారు పెద్దలు. జీవితంలో స్థిరపడడానికి, జీవితాన్ని గొప్పగా కొనసాగించడానికి విలువైన పాఠాలు నేర్పించడంలో గురువుల తర్వాతే ఎవరైనా. అందుకే ఉపాధ్యాయులను స్మరించుకోవడానికి, గౌరవించడానికి సెప్టెంబర్ 5వ తేదీని ఎంపిక చేశారు. భారతదేశ వ్యాప్తంగా ఈ తేదీన విద్యార్థులు తమ ఉపాధ్యాయులకు ధన్యవాదాలు చెబుతారు. ఇవాళ సెప్టెంబర్ 5 కాబట్టి ఈరోజునే ఉపాధ్యాయుల దినోత్సవం ఎందుకు జరుపుకుంటున్నారు? దీని వెనకున్న చరిత్ర ఏంటి? వంటి వివరాలు ఇప్పుడు చూద్దాం. సెప్టెంబర్ 5నే టీచర్స్ డే ఎందుకు?గొప్ప పండితుడు, భారతరత్న, తొలి ఉప రాష్ట్రపతి అయిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజునే టీచర్స్ డే గా భారతీయులందరూ జరుపుకుంటున్నారు. దాని వెనుక ఒక కారణం ఉంది. నిజానికి రాధాకృష్ణన్ ఒక గొప్ప ఫిలాసఫర్, మానవతావాది మాత్రమే కాదు ఆయన ఒక గొప్ప పండితుడు కూడా.పొలిటికల్ కెరీర్ ప్రారంభించక ముందు రాధాకృష్ణన్ చికాగో, మైసూర్, కలకత్తా యూనివర్సిటీలతో పాటు మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీ, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీల్లో ఫిలాసఫీ పాఠాలు చెప్పేవారు. అతను బోధించే పాఠాలకు విద్యార్థులు మంత్రముగ్ధులయ్యేవారు. అయితే ఆయన 1962లో రెండో రాష్ట్రపతిగా నియమితులయ్యారు. అదే ఏడాది మే 13 నుంచి పదవీ బాధ్యతలు సైతం చేపట్టారు.దేవుడు, గురువు పక్కపక్కనే ఉంటే నేను మొదట గురువుకే నమస్కరిస్తా అన్నారు మహానుభావుడు కబీర్ దాస్. ఎందుకంటే.. ఆయన భగవంతుడు అని మొదట తనకు చెప్పింది గురువే కాబట్టి అని వివరించారు. సమాజంలో గురువుకు ఉన్న స్థానం అంత గొప్పది. 'గు' అంటే చీకటి, 'రు' అంటే పోగొట్టేది అని అర్థం. అంటే మనలో అజ్ఞాన పొరలు తొలగించి, జ్ఞానదీప్తిని వెలిగించేవాడు గురువు అన్నమాట. అలాంటి గురువును దైవం కంటే మిన్నగా ఆరాధించే సంస్కృతి మనది. ఏటా సెప్టెంబర్ 5ను 'టీచర్స్ డే' (ఉపాధ్యాయ దినోత్సవం)గా నిర్వహించుకుంటాం. ఈ నేపథ్యంలో గురువు గొప్పదనం, ఉపాధ్యాయ దినోత్సవం విశిష్టత తెలుసుకుందాం.మనిషి పుట్టినప్పటి నుంచి మరణించేదాకా ప్రతి అడుగులోనూ, ప్రతిక్షణంలోనూ అతను ఏదో క్రొత్త విషయాన్ని నేర్చుకుంటూనే ఉంటాడు. అతడు నేర్చుకునే ప్రతి అంశం వెనుక గుప్తంగా ఒక గురువు దాక్కునే వుంటాడు. కానీ ఆ గురువుని మనమందరం ప్రత్యక్షంగా చూడగలిగేది తరగతి గదిలో విద్యనభ్యసించినప్పుడే..!ప్రతి విద్యార్థి గురువును దైవంగా భావిస్తూ.. తన భవిష్యత్తుకు ఆయన అనుభవాన్ని వారధిగా చేసుకుని ముందుకు సాగుతాడు. జీవితంలో ఎవరికీ కేటాయించనంత సమయాన్ని గురువువద్ద గడుపుతాడు. అలా తమ జీవితాలకు ఓ రూపం కల్పించి, తీర్చిదిద్దే గురువులనే ప్రత్యక్ష దైవాలను... విద్యార్థులు ప్రేమగా పూజించేందుకు, స్మరించుకునేందుగానూ సెప్టెంబర్ 5వ తేదీని "ఉపాధ్యాయ దినోత్సవం"గా "గురు పూజోత్సవం"గా జరుపుకుంటున్నారు

## జ్ఞానదాత.. గురువు



**– డాక్టర్. అరుణ పరంధాములు**
**తెలుగు అధ్యాపకురాలు**

భారతదేశంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని మొదటిసారిగా 1962లో జరుపుకున్నారు. ఈ రోజు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని జరుపుకుంటున్నారు. అతను స్వతంత్ర భారతదేశానికి మొదటి ఉపరాష్ట్రపతి మరియు రెండవ రాష్ట్రపతిఉపాధ్యాయుడిగా ఉండటం గొప్ప విశేషం. అతను భారతదేశ మాజీ రాష్ట్రపతి, పండితుడు, తత్వవేత్త మరియు భారతరత్న గ్రహీత. డాక్టర్ రాధాకృష్ణన్ 1962లో భారత రాష్ట్రపతి అయ్యాడు. అతని స్నేహితులు మరియు విద్యార్థులు కొందరు ఆయనను సంప్రదించారు, వారు సెప్టెంబర్ 5న తన పుట్టినరోజును జరుపుకోవడానికి అనుమతించమని అభ్యర్థించారు. డాక్టర్ ఎస్. రాధాకృష్ణన్ స్పందిస్తూ, "నా పుట్టినరోజును నిష్కపటంగా పాటించే బదులు, సెప్టెంబర్ 5ని ఉపాధ్యాయ దినోత్సవంగా పరిశీలిస్తే అది నా గర్వకారణం." అని అన్నారు. భారత రాష్ట్రపతి నుండి వచ్చిన ఇటువంటి అభ్యర్థన, ఉపాధ్యాయుల పట్ల డాక్టర్ ఎస్. రాధాకృష్ణన్‌కు ఉన్న ఆప్యాయత మరియు అంకితభావాన్ని స్పష్టంగా వ్యక్తమైంది. అప్పటి నుండి భారతదేశం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటు న్నారు.దేవుడు, గురువు పక్కపక్కనే ఉంటే నేను మొదట గురువుకే నమస్కరిస్తా అన్నా మహానుభావుడు కబీర్ దాస్. ఎందుకంటే.ఆయన భగవంతుడు అని మొదట తనకు చెప్పింది గురువే కాబట్టి అని వివరించారు. సమాజంలో గురువుకు ఉన్న స్థానం అంత గొప్పది. 'గు' అంటే చీకటి, 'రు' అంటే పోగొట్టేది అని అర్థం. అంటే మనలో అజ్ఞాన పొరలు తొలగించి, జ్ఞానదీప్తిని వెలిగించేవాడు గురువు అన్నమాట. అలాంటి గురువును దైవం కంటే మిన్నగా ఆరాధించే సంస్కృతి మనది. ఏటా సెప్టెంబర్ 5ను 'టీచర్స్ డే' గా జరుపుకుంటాం. అందరీ జీవితాల్ని మార్చి జ్ఞానం వైపు పయనింప చేసేది గురువులోక్కరేఏ స్థానంలో ఉన్నామన్నది ప్రశ్న కాదు? ఏ గురువు దగ్గర విద్యను అభ్యసించం అన్నదే పెద్ద ప్రశ్న.....విద్యార్థులు చదువులో రాణించారంటే అందుకు కారణం గురువులు విద్యార్థులు కూడ జీవితంలో మొదటి ఉన్నత స్థానం గురువుకే ఇస్తారు. వార్ని జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో గురువు కృషి వెలకట్టలేనిది.ఆస్తి, ఐశ్వర్యం, అందం, ఎన్ని వున్న చదువు అనే సంపద లేకుంటే వారు పేదవారే డబ్బు సంపాదించడం కష్టమైన పని కాదు.చదువు అనే సంపదను సంపాదించటం చాల కష్టం ఈ ఐశ్వర్యన్ని సంపాదించటం కష్టం కాదురా! కష్టాన్ని ఇష్టంగా చేసే వారు గురువులు. ఇష్టంతో ఏ పనిచేసిన అది విజయ ఢంకా మోగిస్తుంది. అని చెప్పినవారు గురువులు.. అక్షరానికి ఉన్న ఆకారం అర్థాన్ని విడమర్చి చెప్పేవాడే గురువు. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానమార్గం వైపు దారులు కట్టించడంలో ఉపాధ్యాయుడు కీలకపాత్ర పోషిస్తాడు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించువాడు బోధకుడు ఆ బోధకున్నే ఉపాధ్యాయుడు అంటారు. సమాజంలో ఉత్తమ పౌరులను తయారు చేసేవారు ఉపాధ్యాయులు. కలెక్టర్, డాక్టర్, యాక్టర్ ఇంజనీర్,యాంకర్, డాన్సర్, సింగర్, రైటర్, డైరెక్టర్,ఫైటర్. అందర్ని ఉత్తములు గా తయారు చేసేవారు ఉపాధ్యాయులు. ఇతర వృత్తితో సమానంగా ప్రేమ మరియు గౌరవానికి అర్హమైన గొప్ప వృత్తి అని చెప్పడంలో సందేహం లేదు. దేశవ్యాప్తంగా విద్యార్థులు తమ ఉపాధ్యాయులకు గౌరవించుకుంటారు. కొన్ని పాఠశాలల్లో సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తారు. ఒక దేశ భవిష్యత్తు పిల్లల చేతుల్లో ఉంది. ఉపాధ్యాయులు, మార్గదర్శకులుగా, భారతదేశ విధిని రూపొందించే భవిష్యత్తు నాయకులుగా విద్యార్థులను తయారు చేయచేస్తారు పిల్లల కెరీర్‌లు మరియు వ్యాపారాలలో విజయాలు సాధించాటనికి మంచి మనుషులుగా, సమాజంలో మంచి సభ్యునిగా, దేశానికి ఆదర్శవంతమైన పౌరులుగా మారేందుకు ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనిది.విద్యార్థులను ప్రోత్సహించడం మరియు విద్యాపురోగతి. వైపు నడిపించడం ద్వారా భవిష్యత్తును రూపొందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారు. గురువు అంటే "మార్గదర్శి, నిపుణుడు, ఉపాధ్యాయుడు అని అర్థం. ఇది సంస్కృత పదం గురు నుండి వచ్చింది భారతీయ సంప్రదాయంలో గురువు ఉపాధ్యాయుని కంటే ఎక్కువ. సాంప్రదాయకంగా, గురువు శిష్యుడికి లేదా విద్యార్థికి గౌరవప్రదమైన వ్యక్తి. గురువు శిష్యునికి జీవిత విలువలను నేర్పించే బోధకుడు, సాహిత్య జ్ఞానంతో పాటు, తన అనుభవ జ్ఞానాన్ని పంచేవాడు, విద్యార్థి జీవితంలో ఒక ఆదర్శ వ్యక్తి, స్ఫూర్తిదాయకమైన వ్యక్తి, తాను పొందిన సామర్థ్యాలను శిష్యుడికి అందించడంలో సహాయం చేస్తాడు. నిజమైన గురువు జ్ఞాన రంగంలో నిష్ణాతుడై ఉండాలి.వేదాలు, పాఠ్యపుస్తకాలు మొదలైనవాటిలో ప్రావీణ్యం ఉన్న గురువులు ఎందరో ఉన్నారు.కానీ శిష్యుల బాధలను తొలగించే గురువు దొరకడం కష్టం. తెలివైన వ్యక్తి పరమానందాన్ని కలిగించే గురువును ఎంచుకోవాలి అలాంటి గురువును మాత్రమే ఎంచుకోవటం కష్టం



## ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరగొద్దు

**మంథనిలో గోదావరి ప్రవాహాన్ని పరిశీలించిన మంత్రి శ్రీధర్ బాబు**

**మంథని(జనంసాక్షి):** రాష్ట్రవ్యాప్తంగా గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి శ్రీధర్ బాబు ప్రజలకు సూచించారు. మంథనిలో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరినదీ నీటి ప్రవాహాన్ని బుధవారం ఉదయం మంత్రి శ్రీధర్ బాబు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వరుసగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎలాంటి ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులు అప్రమత్తంగా ఉన్నారని,విపత్తును ఎదుర్కోవడానికి మా ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.మహారాష్ట్రల కురుస్తున్న భారీ వర్షాలు, మన రాష్ట్రంలోని ప్రాజెక్టులకు వస్తున్న వరదను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ వరద నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారని తెలిపారు.మంథని మునిసిపల్ ప్రాంతంలో కాలువలలో మురికినీరును, అక్కడక్కడ చెత్తాచెదారాలను వెంటవెంటనే క్లీన్ చేయాలని మున్సిపల్ సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు అనంతరం వ్యవసాయ అధికారితో ఫోన్లో మాట్లాడుతూ.. ఎక్కడైతే పంట నష్టం జరిగిందో అధికా ులు వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి ఆ రైతులకు ధైర్యం చెప్పి స్పష్టంగా పంట నష్టం ఎంత జరిగిందో చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రు రమా సురేష్ రెడ్డి తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి


**గణేష్ నవరాత్రులు, మిలాద్ ఉన్ నబీ నేపథ్యంలో**
**అన్ని వర్గాల వారికి సూచించిన పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి**



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 04 (జనంసాక్షి) :** కరీంనగర్ కమిషనరేట్ లోని జాన్ విల్సన్ హాలు లో బుధవారం కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి శాంతి సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ... రానున్న గణేష్ నవరాత్రులు, మిలాద్ ఉన్ నబీ పండుగలు అన్ని వర్గాల వారు ప్రశాంత వాతావరణం లో జరుపుకోవాలన్నారు. గణేష్ మండపాల వద్ద పోలీసుల సూచనలు పాటిస్తూ వచ్చే భక్తులకు భద్రత కల్పిస్తూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని మండప నిర్వాహకులకు సూచించారు. గణేష్ ఉత్సవ కమిటీల్లో సంఘ విద్రోహ శక్తులకు, గతంలో అల్లర్లు సృష్టించిన వ్యక్తులకు చోటు కల్పించకూడదని తెలిపారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మకూడదని, వాటికి స్పందించి ప్రజా శాంతికి భంగం కలిగించే చర్యలకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏదైనా సమాచారం వారి దృష్టికి వస్తే సంబంధిత పోలీస్ అధికారులకు తెలపాలని, సమస్య పరిష్కరించి వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా నిర్వహించే ర్యాలీ హైదరాబాద్ లో నిర్ణయించినట్లు సెప్టెంబర్ 19వ తేదీన జరుపుకోవాలని ఈ విషయంలో పోలీసులకు సహకరించాలని కోరారు. టౌన్ ఏసీపీ నరేందర్ తో పాటుగా వన్, టూ, త్రి, టౌన్ పోలీస్ స్టేషన్ల ఇన్స్పెక్టర్లు, శాంతి కమిటీ సభ్యులు, ఇతర మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న భక్తులకు సకల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం

**అన్నదాన సత్రం నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



వేములవాడ(జనంసాక్షి):వేములవాడ రాజన్న సన్నిధిలో అన్నదానం సత్రం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం దేవాలయంలోని శివార్చన మండపంవద్ద సత్రం నిర్మాణానికి స్థలాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఆలయ ఈఓ వినోద్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు సులభంగా వేగంగా దర్శనం, వసతి ఇతర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. బ్రేక్ దర్శనం అమలు చేస్తునామని తెలిపారు. అలాగే భక్తులకు నిత్యం అన్న దానం అందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రోజు 15,000 మంది భోజనం చేసేలా భవనాన్ని నిర్మించేలా ప్రతిపాదనలు రూపొందించాలని, శనివారంలోగా అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, ఈ ఈ రాజేష్, డి ఈ రఘునందన్, ప్రోటోకాల్ పర్యవేక్షకులు అశోక్, ఎడ్ల శివ సాయి తదితరులు పాల్గొన్నారు.

## కన్నీరు మిగిల్చిన మున్నేరు

వీధులు, ఇళ్లల్లో అడుగుల మేర పేరుకుపోయిన బురదను చూసి బాధితులు అల్లాడిపోతున్నారు. ఏం చేయాలో తెలియక తల్లడిల్లిపోతున్నారు. కనీసం వండుకుని తినే పరిస్థితి లేదని అర్థాకలితో అలమటిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్నేరు మిగిల్చిన కన్నీటితో ఎలా బతకాలని ప్రభావిత ప్రాంత ప్రజలు కన్నీటిపర్యంతమవుతున్నారు.వరద ఉద్ధృతి తగ్గినప్పటికీ ముంపునకు గురైన కాలనీల్లో బురద మేటలు వేసి వెళ్లేందుకు కూడా ఇబ్బందికరంగా మారింది. కాలనీల మధ్య ఉన్న రోడ్లు, ప్రధాన రహదారికి వెళ్లేందుకు నిర్మించిన సీసీరోడ్లు కొట్టుకుపోయాయి. అంతర్గత రహదారులు కూడా పూర్తిగా దెబ్బతిని గుంతలు పడ్డాయి. అడుగు తీసి అడుగు వేసే పరిస్థితి లేని దుస్థితి నెలకొంది. పలు ఇళ్ల గోడలు కూలిపోయాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
05 సెప్టెంబర్ 2024
తెలంగాణ

# భద్రాద్రిలో పెరుగుతున్న గోదావరి

- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- వరదలు, వర్షాల నుండి ప్రజలు సురక్షితంగా ఉండడం కొరకు రామాలయం అర్చక బృందంచే పవిత్ర గోదావరికి హారతులు





**భద్రాచలం సెప్టెంబర్ 04 (జనంసాక్షి):** భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. మంగళవారం రాత్రి 9 గంటలకు 40.50 అడుగులు ఉన్న గోదావరి, బుధవారం మధ్యాహ్నం 2.00 గంటలకు 43. 1 అడుగులకు చేరుకోవడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 7 గంటలకు 44.4 అడుగుల నీటిమట్టంతో గోదావరి ప్రవహిస్తుంది. ఎగువ నుండి వస్తున్న వరదతో భద్రాచలం వద్ద గోదావరి పెరుగుతుంది. నిన్న మధ్యాహ్నం నుండి తాలి పేరు వద్ద తగ్గుముఖం పట్టిన గోదావరి. కాగా తాలిపేరు ప్రాజెక్ట్ కు వరద తగ్గింది. బుధవారం ప్రాజెక్ట్ 6 గేట్లు రెండు అడుగుల మేర ఎత్తి 5,828 క్యూసెక్కుల నీటిని దిగువనున్న గోదావరిలోకి వదిలారు. కిన్నెరసాని ప్రాజెక్ట్ నుండి ఉదయం 11.45 గంటలకు 8 గేట్లు ఎత్తి 53 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు.

**రామాలయం అర్చక బృందంచే పవిత్ర గోదావరికి హారతులు**

50 ఏళ్లుగా చూడని వర్షపాతంతో ఒక్కసారిగా చిన్న భిన్నం అయినా తెలుగు రాష్ట్రాలు. అనుకోకుండా వచ్చిన వరద ఉధృతితో కట్టుబట్టలతో పిల్లాపాపలతో తిండి తిప్పలు లేక అల్లాడుతున్న ప్రజలు. రానున్న ఐదు రోజుల్లో భారీ వర్షాలు పడనున్నట్లు వాతావరణం శాఖ ఇప్పటికే తెలపడంతో..వరదలు, వర్షాల నుండి ప్రజలు సురక్షితంగా ఉండడం కొరకు భద్రాచలం శ్రీ సీతా రామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం పవిత్ర గోదావరి నదికి హారతులు ఇచ్చారు. గోదావరి శాంతించాలని, వర్షాలు తగ్గి, ప్రజలు కోలుకోవాలని రామాలయ అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో రమాదేవి, రామాలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బందితోపాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## వాగులో కొట్టుకుపోతున్న యువకుడిని కాపాడిన తూర్పు గూడెం యువకులు





**టేకులపల్లి, సెప్టెంబర్ 4 (జనంసాక్షి):** తూర్పు గూడెం సమీపానగల బ్రిడ్జి వద్ద వరద ఉధృతికి సుజాతనగర్ మండలం, స్టేషన్ బేతంపూడి గ్రామపంచాయతీకి చెందిన బానోత్ లక్ష్మణ్ కుమారుడు బాణోత్ రవికిరణ్ అనే యువకుడు కొట్టుకు పోతుండడంతో గమనించిన తూర్పుగూడెం గ్రామానికి చెందిన యువకులు జాటోత్ నరేష్, లునావత్ లాలు, భూక్యా వీరు లు వెళ్ళి వాగులో కొంత మేరకు వరదలో కొట్టుకో పోయిన కిరణ్ ను కాపాడి ఒడ్డుకు చేర్చారు. ఆ యువకులు ధైర్య సాహసాలతో వాగులోకి దూకి కాపాడటంతో ఆ యువకుడు బతికి బయటపడ్డాడు. వెంటనే వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి ఆ యువకుడుని అప్పగించారు. జరిగిన సంఘటనను టేకులపల్లి ఎస్సై సురేష్ తెలుసుకొని హుటాహుటిన తూర్పు గూడెం సంఘటన స్థలానికి చేరుకున్నారు. యువకుడిని కాపాడిన తూర్పు గూడెం యువకులను అభినందించి, వాగు ఉధృతి తగ్గేవరకు ఈ బ్రిడ్జి పై రాకపోకలను నిలిపివేస్తూ ముళ్ళకంపెను వేయించారు.

## నష్టపోయిన ప్రతీ ఇంటికి సాయం

- ఎవరూ అధైర్య పడొద్దు
- ఖమ్మం రూరల్, నేలకొండపల్లి పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





**ఖమ్మం రూరల్ / నేలకొండపల్లి, (జనంసాక్షి) :** ముంపు బాధితులను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకుంటుందని, నష్టపోయిన ప్రతీ ఇంటికి సాయం అందిస్తామని, ఎవరూ అధైర్య పడొద్దని తెలంగాణ రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని తీర్థాల, రామన్నపేట దానవాయిగూడెం గ్రామాల్లో, నేలకొండపల్లి మండలంలోని చెరువుమదారం, కట్టుకాచారం రామచంద్రాపురం, సుర్దేపల్లి గ్రామాల్లో పర్యటించి బాధిత కుటుంబాలను పరా మర్శించి వారికి భరోసా కల్పించారు. రహదారుల మరమ్మత్తులు, తక్షణ సహాయం, బాధితుల వివరాల సేకరణ పై అధికారులకు తగు సూచనలు చేశారు. అధికారులు సర్వే ప్రక్రియ వెంటనే చేపట్టి, పూర్తి చేయాలన్నారు. సర్టిఫికెట్లు, పుస్తకాలు నష్టపోయిన వారికి తగు న్యాయం చేస్తామన్నారు. తడిసిన బియ్యం స్థానంలో సన్న బియ్యం అందిస్తామన్నారు. విద్యుత్ స్తంభాలు, తీగల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్డీవో జి. గణేష్, ఆర్ అండ్ బి ఎస్ఇ హేమలత, పీఆర్ ఇఇ వెంకట్ రెడ్డి, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సిహెచ్. స్వామి, మునిసిపల్ డిఇ ధరణి, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

- గురుకుల విద్యాసంస్థలలో ఉచిత వసతి, నాణ్యమైన విద్య..
- విద్యార్థినులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి
- ప్రిన్సిపాల్ డాక్టర్ కుర్మెటి శ్రీనివాసశర్మ



**ఖమ్మం రూరల్,సెప్టెంబర్ 4 (జనంసాక్షి):** మండలం లోని మద్దులపల్లి గ్రామ పరిధిలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మిగిలి పోయిన సీట్ల భర్తీ కోసం నేడు, రేపు(గురువారం, శుక్రవారాలలో) స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కుర్మెటి శ్రీనివాసశర్మ తెలిపారు.ఫిజికల్ సైన్సెస్ (బీఎస్సీ ఎంపిసిఎస్, ఎం.ఎస్.సి.ఎస్ మొదలగు గ్రూపులు), బికాం (బిఎ), బికాం (సిఎ), బిఎ(హెచ్ఈపి), లైఫ్ సైన్సెస్(బీఎస్సీ బి.జెడ్.సి, ఎం.జెడ్.సి) గ్రూపుల్లో మిగిలిన కొన్ని సీట్లను భర్తీ చేయడానికి స్పాట్ అడ్మిషన్ లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఉదయం 9:30 నుండి మద్దులపల్లి పరిధిలోని (ఎస్. బి.సి.ఇ ఇంజనీరింగ్ కాలేజీలో) నిర్వహించబడుతున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, ఖమ్మంలో స్పాట్ అడ్మిషన్ కోసం రిపోర్ట్ చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శర్మ తెలిపారు. విద్యార్థులు తమ ఎస్.ఎస్.సి మార్కుల మెమో, ఇంటర్ మెమో, కుల ధృవీకరణ పత్రం, లేటెస్ట్ ఆదాయ ధృవీకరణ పత్రం, 5 నుండి 10 వ తరగతి చదివిన బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, టి.సి, 5 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో హాజరై అడ్మిషన్ పొందాలని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆయా కులాల కేటగిరీలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థలు నాణ్యమైన విద్య నందిస్తున్నాయని అడ్మిషన్ పొందిన విద్యార్థినులకు ఉచిత పౌష్టికాహారం, వసతి, పుస్తకాలు, స్టేషనరీ, దుస్తులు సొసైటీ సమకూరుస్తుందని డాక్టర్ శర్మ తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.





## వదలని వాన

- అత్యంత భారీ వర్షం - నిలిచిన రాకపోకలు
- వరద ప్రవానికి రెండు దుక్కిటెద్దులు మృతి
- వాగు దాటు లేక జ్వరంతో వృద్ధురాలి ఇబ్బందులు
- పలుచోట్ల నీట మునిగిన పంటలు

**ఆళ్లపల్లి సెప్టెంబర్ 4 (జనంసాక్షి)** గత మూడు రోజులుగా వర్షం వదలకుండా కురుస్తుంది .రాత్రి నుండి అత్యంత భారీ వర్షం కురవడంతో కిన్నెరసాని ,జల్లేరు, కోడెల, వాగులు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో జిల్లా కేంద్రానికి, బ్రిడ్జిలు సౌకర్యం లేని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సీతానగరం గ్రామానికి చెందిన పూనేం లక్ష్మయ్య బండారిగూడెం సమీపంలో తన దుక్కిటేద్దులను చేను వాగు ఒడ్డున ఉండడంతో తాడు పొడవుగా ఉండడంతో వాగులోకి దిగాయి. దీంతో వరద ఉధృతతకు జల్లెరు లో పడి మృతి చెందాయి. అదేవిధంగా చంద్రాపురం గ్రామంలో ఓ వృద్ధురాలు విపరీతమైన జ్వరంతో బాధపడుతూ జల్లేరు వాగు దాటలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బ్రిడ్జి పిల్లర్స్ నిర్మాణం తోటే ఉందని ఆ గ్రామస్తులు తెలిపారు. రాయిపాడు వద్ద కిన్నెరసాని ఉధృతంగా ప్రవహించడంతోఎస్ఐ రతీష్ పోలీస్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. పలుచోట్లో పంటలు నీట మునిగాయి. పలుచెరువులు అలుగులు పోశాయి. లోతట్టు ప్రాంతంలోని ఇళ్లల్లోకి భారీ వరద నీరు చేరింది. దీంతో మండలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## జాతీయ విపత్తుగా ప్రకటించండి మంత్రి పొంగులేటి..



**కూసుమంచి సెప్టెంబర్ 4( జనంసాక్షి ) :** తెలంగాణ రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలను కేంద్రం జాతీయ విపత్తుగా పరిగణించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మంత్రి నేలకొండపల్లి మండలం చెరువు మాధారం, కట్టుకాచారం, బుద్దారం, రామ చంద్రా పురం, సుర్దేపల్లి, కొత్తూరు, కూసుమంచి మండలం తుమ్మల తాండ, పాలేరు, నాను తాండ, నర్సింహుల గూడెం గ్రామాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి నష్టాన్ని పరిశీలిం చారు. బాధిత కుటుంబాలను మంత్రి ఓదార్చారు. దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులను పరిశీలించారు. దెబ్బ తిన్న పంట పొలాలను పరిశీలించి, అధికారులను చర్యలకై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారీ వర్షాలు, వరదల కారణంగా తెలంగాణాలోని పలు జిల్లాలు అతలా కుతలం అయ్యాయన్నారు. వాగులు, వంకలు పొర్లి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, వేలాదిమంది కట్టుబట్టలతో మిగిలారని అన్నారు. గడిచిన100 సంవత్సరాల్లో ఈ ప్రాంతంలో ఇంత పెద్ద ఎత్తున వరదలు ఎప్పుడూ రాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. సుమారు 5438 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా ఉందని, రూ. 2 వేల కోట్ల తక్షణ సహాయం అందించాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ వ్రాసిందని మంత్రి అన్నారు. తడిసిన ధాన్యం కనీస మద్దతు ధరకు కొం టామని, తడిసిన బియ్యం తీసుకొని సన్న బియ్యం ఇస్తామని ఆయన తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయిలో ఇంటింటికి తిరిగి జరిగిన నష్టంపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. పంట నష్టంపై క్షేత్ర పరిశీలన చేయాలన్నారు. నష్టపోయిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా పరిహారం అందుతుందని, కష్ట కాలం లో ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి అన్నారు. నర్సింహుల గూడెంలో బాధితులకు మంత్రి బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, ఆర్ అండ్ బి ఎస్ఇ హేమలత, ఇర్రిగేషన్ ఇఇ వెంక టేశ్వర రావు, పీఆర్ ఇఇ వెంకట్ రెడ్డి, వ్యవసాయ శాఖ సహాయ సంచా లకులు సరిత, తాసిల్దార్ సురేష్, మండల అభివృద్ధి అధికారి వేణుగోపాల్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు బొల్లంపల్లి సుధాకర్ రెడ్డి, జొన్నలగడ్డ రవికుమార్, మారోజు భీష్మా చారి తదితరులు పాల్గొన్నారు.

## రాగల నాలుగైదు రోజులు భారీ వర్షాలు

- వాతావరణ శాఖ హెచ్చరిక
- క్షేత్ర స్థాయి అధికారులు అతి జాగ్రత్తగా ఉండాలి
- ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు ఆదేశాలు
- జిల్లా కలెక్టరు హనుమంత్ కే.జెండగే



**భువనగిరి ప్రతినిధి, సెప్టెంబర్ 4 (జనం సాక్షి)** రాగల నాలుగైదు రోజులు భారీ వర్షాలు రానున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసిన ది జిల్లా కలెక్టర్ హనుమంత్ కి జండేగా తెలిపారు. క్షేత్రస్థాయి అధికారుల వరకు అతిజాగ్రత్తగా ఉండాలని ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కమీషనర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు, తహశీలుదార్లు, మండల అభివృద్ధి అధికార్లు, మండల పంచాయితీ అధికారులు, పంచాయితీరాజ్, రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్లు, విద్యుత్ అధికారులతో ఆయన గూగుల్ జూమ్ మీటింగ్ ద్వారా వర్షాలు, వరదల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 9 వ తేదీ వరకు అధికారులు, గ్రామ పంచాయితీ క్షేత్రస్థాయి సిబ్బంది వరకు 24/7 విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. హైదరాబాదు నుండి వచ్చే మూసీ నది వరదల వలన రోడ్లు దెబ్బతినే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని, చెరువుల వద్దకు ఎవరినీ వెళ్లనివ్వవద్దని, పశువులు, జంతువులు కూడా వెళ్లకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని, వర్షాలు, వరదల పట్ల టైమ్ టూ టైమ్ సమీక్షిస్తూ జిల్లా యంత్రాగానికి నివేదిలు పంపుతుండాలని, అవసరమైన రిలీఫ్ క్యాంప్లు ఏర్పాటు చేయాలని, కఠినమైన ఈ సమయంలో ప్రజలకు అండగా ఉండాలని తెలిపారు. వర్షాలు, వరదల వలన ఎలాంటి నష్టం వాటిల్ల కుండా చూడాలని, అవసరమైన జెసిబి, ట్రాక్టర్స్, గజ ఈతగాళ్లు తదితర వనరులతో సిద్దంగా ఉండాలని సూచించారు. వర్షాల వలన దోమలు ప్రబల కుండా, సీజనల్ వ్యాధుల నిర్మూలన పట్ల మున్సిపాలిటీలలో, గ్రామాలలో క్లోరినేషన్, బ్లీచింగ్, శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని, మంచినీరు సరఫరా వ్యవస్థ పటిష్టంగా ఉండేలా చూడాలని తెలిపారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు కె.గంగాధర్ మాట్లాడుతూ... హైదరాబాదు నుండి ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నీటి మట్టం పెరుగుతున్నందున మూసీ పరివాహక ప్రాంతంలో కాజ్వేలు, వాగులు, బ్రిడ్జిల రాకపోకలపై అప్రమత్తంగా ఉంటూ బ్యారికేడింగ్, డైవర్షన్ ఏర్పాట్లు పక్కాగా నిర్వహించాలని, వరద ఉధృతి ఉన్నప్పుడు ఎవరినీ అనుమతించవద్దని, షిఫ్ట్ ల వారిగా విధులు నిర్వహించాలని తెలిపారు. డ్రైనేజీలలో పూడిక ఎప్పటికప్పుడు తీయిస్తుండాలని, ముంపు ప్రాంతాల పట్ల నిరంతర పర్యవేక్షణ ఉండాలని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలోని వారికి కమ్యూనిటీ హాళ్లలో బస ఏర్పాటు చేసి, దుప్పట్లు, భోజనం, అవసరమైన మందులు అందించాలని సూచించారు. విద్యుత్ స్థంభాలు డ్యామేజీ అయిన చోట్ల వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ వర్షాలు, వరదల వలన ఎలాంటి నష్టం కలుగకుండా క్షేత్రస్థాయి పర్యవేక్షణతో పనులు నిర్వహించాలని తెలిపారు.

## అంబేద్కర్ భవన్ ప్రారంభోత్సవానికి సిద్ధం చేయండి

- పంచాయతీరాజ్ ఇంజనీర్లకు ఆదేశాలు
- జిల్లా కలెక్టర్ హనుమంత్ కే.జెండగే



**భువనగిరి ప్రతినిధి ,సెప్టెంబర్ 4 (జనంసాక్షి)** అంబేద్కర్ భవన్ ఈనెల చివరి కల్లా ప్రారంభోత్సవానికి పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతుకే జండేగా ఆదేశించారు. బుధవారం పట్టణంలోని సింగన్నగూడెంలో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకుంటున్న అంబేద్కర్ భవన్ ను పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరిధర్ ,మున్సిపల్ కమిషనర్ రామాంజ నేయులు రెడ్డి ల తో ఆయన పరిశీలించారు. రెండు ఫ్లోర్లలో జరుగుతున్న పనులపై ఆరా తీశారు. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వెంటనే ఏర్పాటు చేయాలని, అంబేద్కర్ భవన్ కు పక్కనే ఉన్న ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాలకు కలిపి డ్రైనేజీ సిస్టం ఏర్పాటు చేయాలని సూచించారు. తలుపులు, కిటీలు, విద్యుత్ పనులు, బ్యూటిఫికేషన్ పనులతో పాటు డ్రైనేజీ సిస్టమ్, ఇంకా చిన్న చిన్న పనులు పూర్తి చేసి ఈనెల చివరి వరకు ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని పంచాయితీరాజ్ ఎగ్జికూటివ్ ఇంజనీరు వెంకటేశర్లును ఆదేశించారు.

**పంచాయితీరాజ్ డివిజనల్ ఇంజనీరు సుదర్శన్ రెడ్డి**

అసిస్టెంట్ ఇంజనీరు ప్రసాద్, దళిత ఐక్య వేదిక ప్రతినిధులు బట్టు రామచంద్రయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ప్రోత్నక్ ప్రమోద్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీరు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగారం అంజయ్య, డాక్టర్ బుంగ అమర్నాథ్, ఎస్.సి.మానిటరింగ్ సభ్యులు, కౌన్సిలర్స్ పడిగల రేణుకా ప్రదీప్, వీరపాక నర్సింహ్మా, బొంతల నర్సింగరావు, దోనకొండ నర్సింగరావు, బీరం గణేష్ ,నిలుగొండ శివ మన్నే కృష్ణ ,నిలుగొండ చిన్న, తొక్క పురం చిన్న వివిధ దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# హైదరాబాదులో ఏఐ గ్లోబల్ సమ్మిట్






- పరిశ్రమలకు ప్రోత్సాహకాలు
- తెలంగాణ రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** ఐటీ సేవల రంగంలో అగ్రగామిగా ప్రపంచ దేశాల కంపెనీలను ఆకట్టుకుంటున్న హైదరాబాద్ నగరాన్ని ఏఐ సాంకేతికతకు సైతం డెస్టినేషన్ గా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ క్రమంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సెప్టెంబర్ 5,6న హైదారాబాదులో నిర్వహించనున్న గ్లోబల్ ఏఐ సమ్మిట్ గురించి గుడ్ రిటర్న్ వార్తా సంస్థతో ప్రత్యేకంగా తన ఆలోచనలను పంచుకున్నారు.

ప్రస్తుతం టెక్ పెట్టుబడులకు డెస్టినేషన్ గా ఉన్న రాష్ట్రం మారుతున్న సాంకేతికతలను ఎప్పికప్పుడు అందిపుచ్చుకోవాలని చూస్తోందని అందుకే ఏఐ దృష్టి సారించినట్లు మంత్రి చెప్పారు. ఈ సాంకేతికత ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని అడ్డంకులను తొలగిస్తోందని, ఈ క్రమంలో ముందస్తుగా కొత్త టెక్నాలజీ మార్పులను అందిపుచ్చుకోవటానికి సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. న్యూ ఏజ్ ఇన్నోవేటర్స్, ఇన్వెస్టర్లకు అవసరమైన ఇన్ ఫ్రా, టెక్నలాజికల్ ఆర్కిటెక్చర్ అందించేందుకు తెలంగాణ ముందుండి ఏఐ సాంకేతిక అభివృద్ధి ఫలాలను అందిపుచ్చుకోవటం లక్ష్యంగా సమ్మిట్ జరుగుతోందని చెప్పారు.

రానున్న కొద్ది కాలంలో ఏఐ సాంకేతిత వ్యవసాయం, ఆరోగ్యం, విద్య వంటి రంగాల్లో పెద్ద మార్పులకు దారితీసి ప్రజలకు ఉపయోగపడనుందని చెప్పారు. సప్లై చైన్ సమస్యలను పరిష్కరించి రైతులకు సహాయపడుతుందని, అలాగే ఏఐ క్లౌడ్ టెక్నాలజీ ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన డేటాను స్టోర్ చేయటంతో పాటు సమయానుకూలంగా వారికి మందులు, చికిత్సలు అందించేందుకు సహాయపడనుందన్నారు. ఇది తెలంగాణ ప్రజలకు డిజిటల్ హెల్త్ కార్డుల జారీకి దోహదపడుతుందని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో పాఠ్యాంశంగా మారి మార్కెట్లకు అవసరమైన సాంకేతికతలను ముందునుంచే నేర్చుకునేందుకు అవకాశం కల్పించనున్నట్లు మంత్రి వెల్లడించారు. రోజువారీ జీవితంలో ప్రజలు ఏఐ సాంకేతికతలను ఎంతవరకు ఉపయోగించుకునేందుకు వీలుంటుందనే అంశాలపై సమ్మిట్ లో చర్చించనున్నట్లు తెలిపారు. పేద మధ్యతరగతి ప్రజలపై దీని ప్రభావం గురించి ఆలోచిస్తామన్నారు.

ఏఐ సాంకేతికతను విజయవంతంగా వినియోగించేందుకు అవకాశం ఉన్న అన్ని రంగాల్లో ఉపయోగించటంపై దృష్టి సారిస్తామని మంత్రి తెలిపారు. ఇప్పటికే భారతీయ గేమింగ్ రంగం ఏఐ సాంకేతికతను ఫలవంతంగా దశాబ్దకాలంగా ఉపయోగిస్తోందని చెప్పారు. ఇదే క్రమంలో ఫ్యూచర్ సిటీ గురించి మాట్లాడుతూ ఇప్పటికే తమ ప్రభుత్వం 200 ఎకరాల భూమిని ఇందుకోసం కేటాయించిందని చెప్పారు. విమానాశ్రయానికి చేరువలో ఉన్న దీనిని తెలంగాణను గ్లోబల్ ఎకోసిస్టమ్ గా మార్చేందుకు దోహదపడనుందని చెప్పారు. పెట్టుబడులకు ముందుకొచ్చే సంస్థలకు అనువైన రియల్టీ నిర్మాణాలు, టెక్నాలజీ సహకారంతో పాటు ప్రభుత్వం నుంచి సహకారం ఉంటుందన్నారు.

రాష్ట్రంలోని కంపెనీలను రెన్యూవబుల్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీ వినియోగం వైపు ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఎయిర్ కండిషనింగ్ వినియోగాన్ని తగ్గించేలా కోరుతున్నట్లు చెప్పారు. అలాగే రాబోతున్న డేటా సెంటర్లు అధికంగా నీరు, పవర్ ఎక్కువగా వినియోగిస్తాయని వాటి వినియోగాన్ని తగ్గించేందుకు నూతన సాంకేతికతలను వినియోగించేలా ప్రోస్సహిస్తున్నట్లు చెప్పారు. ఇదే క్రమంలో ఐఐటీ హైదరాబాద్ డ్రైవర్ లెస్ టెక్నాలజీని తీసుకొచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను అభినందించారు. ప్రస్తుతం భారతదేశంలోని ఇన్ ఫ్రా, ఇతర పరిస్థితులు అందుకు దోహదపడటం లేదన్నారు. అయితే రానున్న 2-3 నెలల్లో ప్రత్యేక రోడ్లలో ఈ సాంకేతికతను ప్రయోగాత్మకంగా టెస్ట్ చేయనున్నట్లు చెప్పారు. ఐటీ రంగంలో పోరుగుతున్న ఉన్న బెంగళూరు, చెన్నై నగరాల కంటే హైదరాబాద్ తాగు నీరు, మొబిలిటీ సమస్యలు చాలా తక్కువగా ఉన్నాయని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. అలాగే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తెలంగాణ అద్భుత స్థాయిలో ఉందని పేర్కొంది. ఇదే క్రమంలో ఏపీ సీఎం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి చెప్పిన అంశంపై స్పందిస్తూ తెలంగాణలో పరిశ్రమలకు కేవలం 2 వారాల్లో అనుమతులు అందిస్తున్నట్లు చెప్పారు. 1992లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియాకు శంకుస్థాపన జరిగిందని ఐటీ మంత్రి గుర్తుచేశారు. గత దశాబ్దంలో ప్రపంచ డిమాండ్‌లో భారీ పెరుగుదల ఉండగా అన్ని రాష్ట్రాలు తమ వాటాను పొందాయన్నారు. ఈ క్రమంలో కర్ణాటక అత్యధిక వాటాను పొందుతూ రూ.7.5 లక్షల కోట్లు సాఫ్ట్‌వేర్ ఎగుమతులు చేస్తున్నాయన్నారు. ఈ క్రమంలో తెలంగాణ ఎగుమతులు రూ.2.5 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇదే క్రమంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై స్పందిస్తూ మార్కెటింగ్ ఎక్కువ, ఆచరణ తక్కువగా ఉందని శ్రీధర్ బాబు వెల్లడించారు.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 497 | ₹ 60 |
| వరంగల్ | ₹ 497 | ₹60 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

హైదరాబాద్

| | |
|---|---|
| ₹73,040 (24 క్యారెట్లు) | ₹66,950 (22 క్యారెట్లు) |

చెన్నై

| | |
|---|---|
| ₹66,950 (22 క్యారెట్లు) | ₹73,040 (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 92,000




## కుప్పకూలిన సెన్సెక్స్-నిఫ్టీ



**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** గ్లోబల్ మార్కెట్ల పతనంలో కొనసాగుతున్న వేళ నేడు దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో తమ ప్రయాణాన్ని మ్మొదలుపెట్టాయి. ఈ క్రమంలో కీలక బెంచ్ మార్క్ సూచీలు ఒక్కసారిగా క్రాష్ అయ్యాయి. ఉదయం 9.21 గంటల సమయంలో బెంచ్ మార్క్ సూచీ సెన్సెక్స్ 560 పాయింట్ల నష్టంలో ట్రేడవుతుండగా, మరో కీలక సూచీ నిఫ్టీ 171 పాయింట్ల మేర నష్టాన్ని చవిచూసింది. ఇదే క్రమంలో ఇంట్రాడేలో నిఫ్టీ బ్యాంక్ సూచీ 354 పాయింట్లు, నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీ 314 పాయింట్లు నష్టపోయాయి. అలాగే ఈ క్రమంలో డిఫెన్స్ కేటగిరీలోని కంపెనీల షేర్లు ఫోకస్‌లో కొనసాగుతున్నాయి. ప్రధానంగా ఆసియా, అమెరికా మార్కెట్ల ప్రభావం నేడు భారతీయ ఈక్విటీలపై కనిపిస్తోంది.

ఎన్ఎస్ఈలో ఏషియన్ పెయింట్స్, బీపీసీఎల్, సన్ ఫార్మా, హీరో మోటార్స్, అపోలో హాస్పిటల్స్ షేర్లు మాత్రమే మార్కెట్ల ప్రారంభ సమయంలో లాభాలతో టాప్ గెయినర్లుగా తమ ప్రయాణాన్ని ముందుకు సాగిస్తున్నాయి. ఇదే క్రమంలో ఓఎన్జీసీ, విప్రో, జేఎస్డబ్ల్యూ స్టీల్, ఎల్ టిఐఎమ్, హిందాల్కో, ఇన్ఫోసిస్, టాటా కన్జూమర్, టాటా స్టీల్, ఎల్ టి, టెక్ మహీంద్రా, కోల్ ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్, ఎయిర్ టెల్, ఎన్టీపీసీ, ఎస్బీఐ లైఫ్ కంపెనీల షేర్లు ఇంట్రాడేలో నష్టాల్లో తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాయి.

## అదానీ గ్రూప్ కొత్త కంపెనీకి ఆమోదం

**ముంబై, ఆగస్టు 4 (జనంసాక్షి) :** అదానీ గ్రూప్ దేశంలోని ఎనర్జీ రంగంలో కొత్త కంపెనీ ఏర్పాటుకు తీవ్రంగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. అయితే గ్రూప్ తీసుకున్న ఈ నిర్ణయంతో అనేక మంది ఇన్వెస్టర్లు అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్లను విక్రయిస్తున్నారు. గౌతమ్ అదానీ గ్రూప్ కంపెనీ అయిన అదానీ గ్రీన్ ఎనర్జీ డైరెక్టర్ల బోర్డు టోటల్ ఎనర్జీస్‌తో జాయింట్ వెంచర్ ఒప్పందాన్ని ఆమోదించింది. దీని కింద రెండు సంస్థలు 50:50 నిష్పత్తిలో జాయింట్ వెంచర్‌లో వాటాను కలిగి ఉంటాయని వెల్లడైంది. తాజా డీల్ ద్వారా విదేశీ సంస్థ అదానీ గ్రూప్ కంపెనీలో కొత్తగా 444 మిలియన్ డాలర్లను అదనంగా పెట్టుబడి పెట్టనుంది. అయితే కంపెనీ కొత్త అడుగులు వేస్తున్న తరుణంలో అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్లు క్షీణించాయి. ఈ క్రమంలో స్టాక్ ధర 2 శాతానికి పైగా క్షీణించింది. మార్కెట్ల క్లోజింగ్ సమయంలో స్టాక్ ధర ఎన్ఎస్ఈలో ఒక్కోటి 2.66 శాతం క్షీణించి రూ.1894 వద్ద స్థిరపడింది. అదానీ గ్రీన్ ఎనర్జీ కంపెనీ, టోటల్ ఎనర్జీస్, అదానీ రెన్యూవబుల్ ఎనర్జీ సిక్స్టీ ఫోర్ లిమిటెడ్ మధ్య గట్టి ఒప్పందాలు చేసుకోనున్నట్లు స్టాక్ మార్కెట్‌కు ఇచ్చిన సమాచారంలో పేర్కొంది.




## హైడ్రా తరహాలో బుడమేరు ఆక్రమణలు తొలగించాలి

- విజయవాడ ముంపు జాతీయ విపత్తుగా గుర్తించాలి
- కేంద్రాన్ని కోరిన పిసిసి చీఫ్ షర్మిల



**విజయవాడ, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** విజయవాడ ముంపును జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. బుడమేరు రక్షణకు వెంటనే చర్యలు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలో హైడ్రా మాదిరి.. బుడమేరు ఆక్రమణలు తొలగించాలని సూచించారు. గురువారం సింగ్‌నగర్ ప్రాంతంలో పర్యటించిన ఆమె.. వరద బాధితులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధితులను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని కోరారు. వరద ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు పర్యటించి ప్రజలకు ధైర్యం చెప్పడం మంచి విషయమన్నారు. 'కొంప కొల్లేరు అయ్యింది.. బెజవాడ బుడమేరు అయింది. విజయవాడ వరదలకు బుడమేరే కారణం. వరద నీరు కొల్లేరుకు చేరేలా చర్యలు చేపట్టాలి. ఈ ప్రమాదం రాకుండా చూడాల్సిన భాధ్యత ప్రస్తుతం చంద్రబాబు మీదే ఉంది. బుడమేరుకి రిటర్నింగ్ వాల్ కట్టాలి. వరదల్లో ఇప్పటి వరకు 35 మంది చనిపోయారు. 5లక్షల మంది నష్టపోయారు. ఇది ఘోర విపత్తు. ఇంత పెద్ద విపత్తు సంభవిస్తే ప్రధాని మోదీ కనీసం స్పందించలేదని మండిపడ్డారు. విజయవాడ వరదలు కేంద్రానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఇక్కడి ఎంపీల మద్దతుతో ప్రధాని అయ్యాననే సంగతి మరిచారు. ఏపీ ప్రజల కష్టాలు మోదీకి కనిపించడంలేదు. వెంటనే స్పందించి జాతీయ విపత్తుగా ప్రకటించాలి. నష్టపోయిన ప్రతి ఇంటికి కనీసం రూ.లక్ష సాయం చేయాలని షర్మిల డిమాండ్ చేశారు.

# బుడమేరు ఆక్రమణలే కొంపముంచాయి

- బురద జల్లే కార్యక్రమం మానండి
- వీలైతే సహాయ కార్యక్రమాల్లో పాల్గొనండి
- వైకాపా కార్యకర్తలు సమాయచర్యల్లో దిగాలి
- విపత్తుల సమయంలో చంద్రబాబు అనుభవం పనికొస్తోంది
- ఆయనలా కష్టపడడం ఎవరికీ సాధ్యం కాదు
- పంచాయితీరాజ్ ద్వారా గ్రామాలకు 4కోట్ల సాయం
- వరదసహాయకచర్యలకు అంతరాయమనే తాను వెళ్లడంలేదు
- తెలంగాణకు కోటి సాయం ప్రకటించిన డిప్యూటి సిఎం పవన్




**అమరావతి, సెప్టెంబర్4 (జనంసాక్షి) :** విపత్తు సమయంలో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. సిఎంగా చంద్రబాబు అనుభవం ఏంటో ఇప్పుడు తెలుస్తున్నదని అన్నారు. వైకాపా విమర్శలు ప్రస్తావిస్తూ..రాళ్లు వేయడం సులువని, పనిచేసేవారికి ఎంత కష్టపడుతున్నారో తెలుస్తుందని అన్నారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బుడమేరులోని 90 శాతం ఆక్రమణలే విజయవాడకు శాపంగా మారాయని పవన్ అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం చంద్రబాబు సమర్థంగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ వయసులోనూ జేసీబీలు, ట్రాక్టర్లు ఎక్కి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారన్నారు. ఆయన్ను అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడం సరికాదని వైకాపా నేతలను ఉద్దేశించి హితవు పలికారు. వైకాపా నేతలు ముందు సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని.. ఆ తర్వాతే ఆరోపణలు చేయాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లడం లేదంటూ వైకాపా నేతలు చేస్తున్న విమర్శలపై పవన్ స్పందించారు. తాను వెళ్తే సహాయక చర్యలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. అధికార యంత్రాంగానికి ఒత్తిడి ఉంటుందని చెప్పడంతో తాను వెళ్లలేదని చెప్పారు. ఇంకా విమర్శించాలనుకుంటే వైకాపా నేతలు నాతో పాటు ఎక్కడికైనా రావొచ్చు. నా కాన్వాయ్‌లోనే తీసుకెళ్తాను. నాతో నడవండి.. ఎలా ఉంటుందో చూడండి. అప్పుడు మీరే సలహా ఇస్తారు. ఇది రాష్ట్ర సమస్య. వైకాపా నేతలు సహాయం చేసి మాట్లాడాలి. ఇళ్లలో కూర్చొని విమర్శలు చేస్తే సరిపోదని పవన్ వ్యాఖ్యానించారు. సహాయ కార్యక్రమాల్లో పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది పాల్గొంటున్నారని పవన్ తెలిపారు. 175 బృందాలు విజయవాడ అర్బన్‌లో పనిచేస్తున్నాయని అన్నారు. వరద ప్రభావం లేని జిల్లాల నుంచి వచ్చిన 900 మంది పారిశుద్ధ్య కార్మికులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు వివరించారు. వరదలకు ఎక్కువగా ఎన్టీఆర్ జిల్లా దెబ్బతిందని తెలిపారు. 26 ఎన్డీఆర్ఎఫ్, 24 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. నేవీ నుంచి 2, ఎయిర్‌ఫోర్స్ నుంచి 4 హెలికాప్టర్ల ద్వారా ఆహార పంపిణీ జరుగుతోందని చెప్పారు.ఇదిలావుంటే బాధితులను ఆదుకోవడమంటే మాటలు చెప్పడం కాదని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిరూపించారు. ఏకంగా రూ.4 కోట్ల వరద సాయాన్ని ఆయన ప్రకటించారు. వరద ప్రభావిత గ్రామాలకు ఆయన ఈ విరాళం అందించారు. మొత్తం 400 గ్రామ పంచాయతీలు వరద ముంపు బారిన పడ్డాయని, ఒక్కో పంచాయతీకి ఒక లక్ష రూపాయల చొప్పున నేరుగా పంచాయతీ ఖాతాకు విరాళం పంపిస్తానని ప్రకటించారు. రూ.4 కోట్లు మొత్తాన్ని ముంపు గ్రామ పంచాయతీలకు అందించాలని నిర్ణయించుకున్నట్టు ఆయన తెలిపారు. ఇక తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. కోటి విరాళం అందించనున్నట్టు పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఈ మేరకు పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ వరద పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. వరద ప్రభావిత ప్రాంతాలలో నెలకొన్న పరిస్థితులు, గ్రామాలలో తాగు నీరు, ఆహారం సరఫరా, పారిశుధ్య నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం నేపథ్యంలో ఏలేరు జలాశయానికి వరద ముప్పు పొంచి ఉన్నందున ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. ప్రజలకు నిత్యావసరాలు, ఆహారం, తాగు నీరు, ఔషధాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఏలేరు రిజర్వాయర్ పరిస్థితిపై ఆయన జిల్లా అధికార యంత్రాంగంతో మాట్లాడారు. లేరుకి వచ్చిన వరద నీరు, ఈ రోజు సాయంత్రం నుంచి నీటిని విడుదల చేయాల్సిన పరిస్థితులపై కలెక్టర్ వివరించారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకి ఏలేరు రిజర్వాయర్‌కి 20.2 టీఎంసీల నీరు చేరుకుందని, క్రమంగా నీరు వదలాల్సి ఉంటుందని వెల్లడించారు. బుధవారం 500 క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతామని, పిఠాపురం, పెద్దాపురం నియోజక వర్గాల వైపు నీరు మళ్లుందని చెప్పారు. ముంపు గ్రామాల ప్రజలకు అవసరమైన ఆహారం, తాగు నీరు, ఔషధాలు సిద్ధం చేసే విషయంలో రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

## ఆప్‌తో పొత్తుకు కాంగ్రెస్ శ్రేణుల నిరాసక్తత

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** హర్యానాలో ఆప్‌తో పొత్తుకు కాంగ్రెస్ హైకమాండ్ మొగ్గుచూపుతుంటే రాష్ట్ర నాయకత్వం, స్థానిక పార్టీ శ్రేణులు పొత్తుకు ససేమిరా అంటున్నాయి. ఆప్‌తో పొత్తు ఉండబోదని కాంగ్రెస్ శ్రేణులు తెగేసిచెబుతున్నాయి. పంజాబ్ కాంగ్రెస్ చీఫ్, ఎంపీ అమరీందర్ సింగ్ రాజా వారింగ్ ఆప్‌తో పొత్తుపై స్పష్టత ఇచ్చారు. అమరీందర్ సింగ్ బుధవారం చండీఘడ్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌తో పొత్తు ఉండే అవకాశం లేదనే సంకేతాలు పంపారు. గతంలోనూ ఇండియా అలయన్స్‌తో పార్లమెంట్ ఎన్నికలకు వెళ్లామని చెప్పారు. కానీ ఆప్‌తో ఎన్నడూ తాము అవగాహనకు రాలేదని స్పష్టం చేశారు. పంజాబ్‌లో పాలక ఆప్ తమ నేతలను నిర్బంధించారని, వేధించారని చెప్పారు. శాసనసభ లోపల, వెలుపల తాము ఆప్‌తో పోరాడామని గుర్తుచేశారు. తాము గతంలోనూ ఇదే విషయం స్పష్టం చేశామని తెలిపారు. కాంగ్రెస్ హైకమాండ్ దేశవ్యాప్తంగా పొత్తులపై ఎలాంటి వైఖరి తీసుకున్నా ఇక్కడ మాత్రం కాంగ్రెస్ కార్యకర్తలకు ఆమోదయోగ్యమైన నిర్ణయమే తీసుకుంటారని తేల్చిచెప్పారు.

## ఫిరాయించిన ఎమ్మెల్యేలకు పెన్షన్ నిలిపివేత

**కొత్త బిల్లు ఆమోదించిన హిమాచల్ అసెంబ్లీ**



**సిమ్లా, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** ఫిరాయించిన ఎమ్మెల్యేలకు ఇకపై పెన్షన్ నిలిపివేయనున్నారు. దీనికి సంబంధించిన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మేరకు కొత్త బిల్లు ప్రవేశపెట్టింది. ఎమ్మెల్యేల ఫిరాయింపులను అరికట్టేందుకు ఈ చర్యలు చేపట్టింది. హిమాచల్ ప్రదేశ్ శాసనసభ (సభ్యుల భత్యాలు, పెన్షన్) సవరణ బిల్లు 2024ను సీఎం సుఖ్‌విందర్ సింగ్ సుఖు మంగళవారం ఆ రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఫిరాయింపు నిరోధక చట్టాన్ని ఈ బిల్లులో ప్రస్తావించారు. 'రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం ఏ సమయంలోనైనా అనర్హులుగా ఉన్నట్లయితే, చట్టం ప్రకారం ఒక వ్యక్తి పెన్షన్‌కు అర్హులు కాదు' అని ఆ బిల్లులో పేర్కొన్నారు. కాగా, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఆమోదించిన కొత్త బిల్లు ప్రకారం ఇతర పార్టీలకు ఫిరాయించిన ఎమ్మెల్యేలకు పెన్షన్ నిలిపివేస్తారు. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడిన ఎమ్మెల్యేలకు ఇది వర్తిస్తుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆ రాష్ట్రంలోని ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడంతో వారిపై అనర్హత వేటు పడింది.

## ఉక్రెయిన్‌పై రష్యా దాడి..

- లెవివ్‌లో ఏడుగురు మృతి



**కీవ్, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** రష్యా మంగళవారం రాత్రి మళ్లీ ఉక్రెయిన్‌పై అటాక్ చేసింది. పశ్చిమ నగరమైన లివివ్‌పై ఆ దాడి జరిగింది. ఆ ఘటనలో ఏడుగురు మృతిచెందారు. పోల్టావా సిటీలో మిలిటరీ ఇన్‌స్టిట్యూట్‌పై జరిగిన దాడిలో 50 మంది మృతిచెందిన ఘటన నుంచి ఉక్రెయిన్ తేరుకోకముందే.. రష్యా మరోసారి దాడి చేయడం ఆందోళన కరంగా మారింది. బుధవారం తెల్లవారుజామున డ్రోన్లు, హైపర్‌సోనిక్ మిస్సైళ్లతో రష్యా దాడి చేసినట్లు లివివ్ సిటీ మేయర్ ఆండ్రీ సదోవ్ తెలిపారు. దేశ రాజధాని కీవ్‌లో కూడా పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. దేశం మొత్తం ఎయిర్ అలర్ట్ జారీ చేసినట్లు ఉక్రెయిన్ మిలిటరీ వెల్లడించింది. లివివ్‌లో డజన్ల సంఖ్యలో జనం గాయపడ్డారు. 50 బిల్డింగ్‌లు ధ్వంసం అయ్యాయి. దాంట్లో ఇండ్లు, స్కూళ్లు, క్లినిక్‌లు కూడా ఉన్నాయి. పోల్టావా మిలిటరీ ఇన్‌స్టిట్యూట్‌లో శిథిలాలను తొలగించే పనిలో రెస్క్యూ వర్కర్లు ఉన్నారు.



## కలెక్టరేట్ ఎదుట సాంఘిక సంక్షేమ కాంట్రాక్ట్ గురుకుల ఉపాధ్యాయుల ధర్నా

**విధుల్లో కొనసాగించాలని కలెక్టర్ కు వినతిపత్రం అందజేత**

**పెద్దపల్లి,సెప్టెంబర్ 04(జనంసాక్షి) :**
తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలలో గత కొన్ని సంవత్సరాలుగా పార్ట్ టైం, ఔట్ సోర్సింగ్ సిబ్బందిగా సేవలందిస్తున్న వారిని ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా విధుల నుండి తప్పించడం పట్ల బుధవారం జిల్లా కేంద్రంలో ఆందోళనలు చేపట్టారు. పెద్దపల్లి కలక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఔట్ సోర్సింగ్ సిబ్బంది తొలగింపు నిర్ణయాన్ని విరమించుకుని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్శకు వినతిపత్రం అందజేశారు. అధికారుల మనసు మార్చి తాము విధుల్లో కొనసాగేలా చేయాలని పార్ట్ టైం, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పెద్దపల్లి బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కొన్ని సంవత్సరాలుగా రెగ్యులర్ ఉద్యోగుల వలె విద్యార్థులకు సేవలందిస్తూ కష్టపడుతున్నామని, విద్యా సంవత్సరం మధ్యలో తమని విధులు నుండి తీసివేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం నిర్ణయంతో మా జీవితాలు రోడ్డు పాలయ్యాయని, మానవతా దృక్పథంతో వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అరవింద్, సురేష్, రమేష్, శ్రీనివాస్, రవీందర్, ఆనంద్, లింగయ్య, రామకృష్ణారెడ్డి, ఏ. శ్రీనివాస్, రాజమౌళి, సంతోష్, ధర్మాచారి, ఏం.శ్రీనివాస్, దేవదాసు, రాజేష్, అనిల్, లింగయ్య, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## బంధంపల్లి చెరువును( ఎఫ్ టీ ఎల్) బఫర్ జోన్ గా గుర్తించి అందులో అక్రమ వెంచర్&-రెండు రేకుల షెడ్లను తొలగించిన ప్రభుత్వ అధికారులు



**పెద్దపల్లి,సెప్టెంబర్ 0 4(జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీ కోయశ్రీ హర్ష ఆదేశాలమేరకు పెద్దపల్లి ఆర్డీఓ,ల్యాండ్ సర్వేర్,జిల్లా ఇరిగేషన్ అధికారులు మరియు మున్సిపల్ శాఖ వారు సంయుక్తంగా బంధంపల్లిలోని చెరువును (ఎఫ్ టీ ఎల్)బఫర్ జోన్ గా గుర్తించి బఫర్ జోన్ లో రెండు రేకుల షెడ్లు మరియు అక్రమ వెంచర్ గుర్తించడం జరిగిందనీ అట్టి అక్రమ వెంచర్ యొక్క ప్రహరీ గోడను జేసీబీతో తొలిగించారు .ఎవరు కూడ బఫర్ జోన్ మరియు ఎఫ్ టీ ఎల్ లో అక్రమ నిర్మాణాలు చేపట్టకూడదని అధికారులు హెచ్చరించారు.

## భవితా కేంద్రాలలో ఖాళీగా ఉన్న ఫిజియోథెరపిస్ట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**– జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి**



పెద్దపల్లి,సెప్టెంబర్ 04(జనంసాక్షి) :
పెద్దపల్లి జిల్లా లోని గల భవితా కేంద్రాలలో ఖాళీగా ఉన్న ఫిసియోథెరపిస్ట్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పెద్దపల్లి జిల్లా విద్యాశాఖాధికారి డి మాధవి ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఫిసియోథెరపి డిగ్రీ (బీపీటీ) / ఎం పీటీ విద్యార్హత ఉన్న స్థానికులు అర్హులవుతారని తెలిపారు. క్యాంపు ఒక్కయింటికి రూ. వెయ్యి చొప్పున నిర్వహించే విధంగా అవర్స్ బేస్ గా పని చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 5,6,7 తేదీలలో పూర్తి చేసిన దరఖాస్తులను సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం లో గల రూమ్ నెంబర్ 320 లోని జిల్లా విద్యాశాఖాధికారి మరియు సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు జిల్లా సహిత సమన్వయకర్త గారిని 9246462324 నెంబర్ మీద సంప్రదించాలని కోరారు.

## జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన డిఐఈఓ

**ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 04, (జనంసాక్షి) :**
ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై. శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదిలోకి వెళ్లి అధ్యాపకులు విద్యార్థులకు ఎలా బోధిస్తున్నారో పరీక్షించి, విద్యార్థులతో సంభాషించారు. అనంతరం కళాశాల పరిసరాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. చదువుతోపాటు సహపాఠ్యాంశాలను, విలువలను బోధించాలని, విద్యార్థుల సంఖ్య పెంచాలని, ఉత్తీర్ణత శాతం పెంచాలని, డ్రాపౌట్ తగ్గించాలని అధ్యాపకులకు సూచించి, కళాశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డిఐఈఓ శ్రీనివాస్‌ను ప్రిన్సిపాల్, అధ్యాపకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వనజకుమారి, ఉపన్యాసకులు క్యాతం సత్యనారాయణ, వాసరవేణి పర్శరాములు, చెరుకు భూమక్క, బుట్ట కవిత, నీరటి విష్ణు, ప్రసాద్, ఆర్. గీత, కొడిముంజ సాగర్, అగోలం గౌతమి, చిలుక ప్రవళిక, బోధనేతర సిబ్బంది, ఎండి. తాజోద్దిన్, షాహినా సుల్తానాలు పాల్గొన్నారు.



# భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి..

- రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు..
- మంథనిలో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరినదీని శ్రీధర్‌బాబు పరిశీలించారు..



**రామగిరి, జనంసాక్షి :**
రాష్ట్రవ్యాప్తంగా వరుసగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎలాంటి ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులు అప్రమత్తంగా ఉన్నారని,విపత్తును ఎదుర్కోవడానికి మా ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.మహారాష్ట్రల కురుస్తున్న భారీ వర్షాలు, మన రాష్ట్రంలోని ప్రాజెక్టులకు వస్తున్న వరదను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ వరద నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారని తెలిపారు.మంథని మునిసిపల్ ప్రాంతంలో కాలువలలో మురికినీరును, అక్కడక్కడ చెత్తాచెదారాలను వెంట వెంటనే క్లీన్ చేయాలని మున్సిపల్ సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు,గత ఐదు రోజుల నుండి కురుస్తున్న వర్షాల వల్ల దోమల ద్వారా వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వ వైద్యాధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఏ గ్రామంలో విష జ్వరాలు వస్తే ఆ గ్రామాన్ని వెంటనే హెల్త్ క్యాంపు నిర్వహించి వారికి వైద్య సదుపాయం అందించాలని, మంథని నియోజకవర్గంలో ప్రభుత్వాసుపత్రికి వచ్చే ప్రతి వ్యక్తికి మెరుగైన వైద్య సదుపాయాన్ని ఇవ్వాలని జిల్లా వైద్య అధికారులను మంత్రిగారు ఆదేశించారు. విపత్తును ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని,లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.అనంతరం వ్యవసాయ అధికారితో ఫోన్లో మాట్లాడుతూ ఎక్కడైతే పంట నష్టం జరిగిందో అధికారులు వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి ఆ రైతులకు ధైర్యం చెప్పి స్పష్టంగా పంట నష్టం ఎంత జరిగిందో చూడాలని అధికారులను మంత్రిగారు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కోర్టు డ్యూటీ ఆఫీసర్స్..లైసెన్ ఆఫీసర్స్‌తో సమీక్షా..

- శిక్షపడటంలో కోర్టు కానిస్టేబుల్ బాధ్యత కీలకం..
- కోర్టులలో వీసీ ద్వారా అండర్ ట్రయల్ ఖైదీలను ప్రవేశపెట్టాలి..
- పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్..





**గోదావరిఖని, జనంసాక్షి :**
కోర్టు డ్యూటీ ఆఫీసర్‌లు నేరస్థులు శిక్షల నుంచి తప్పించుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించి నేరస్తులకు శిక్షలు పడటానికి కృషి చేయాలని రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లోని పోలీస్ స్టేషన్‌లలో పనిచేస్తున్న కోర్టు డ్యూటీ ఆఫీసర్స్..కోర్టు లైసెన్ ఆఫీసర్స్‌తో కమీషనరేట్‌లో సీపీ సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ డీజీపీ ఆధ్వర్యంలో జరిగిన హై లెవెల్ కమిటీ మీటింగ్ తరువాత డీజీపీ ఆదేశాల మేరకు కోర్టులలో అండర్ ట్రయల్ ఖైదీలను నేరుగా జైలు నుండి పోలీసు ఎస్కార్ట్ ద్వారా కాకుండా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రవేశపెట్టాలని కోర్టు కానిస్టేబుల్స్‌కు సూచించారు.దీనితో పోలీసుల పనిభారం తగ్గుతుందని, సమయం ఆదా అవుతుందని నేరస్తులు జైలు నుంచి కోర్టుకు తీసుకువెళ్లే సమయంలో పారిపోయే అవకాశం ఉండదని, కోర్టులలో వీసీ ద్వారానే అండర్ ట్రయల్ ఖైదులను ప్రవేశపెట్టాలని, అదేవిధంగా నేరస్థులకు శిక్షపడే విధంగా సాక్షులను ప్రవేశపెట్టి ట్రయల్ సజావుగా జరిగే విధంగా చూడాలన్నారు. నిందితులకు శిక్షలు పడేలా సాక్షులను మోటివేషన్ చేయాలన్నారు. ప్రతీ కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, షెడ్యూల్ ప్రకారం సాక్షులను కోర్టులో హాజరుపర్చాలని సూచించారు. పెండింగ్ పెట్టి కేసులు వెంటనే డిస్పోజల్ చేయాలని, నేరస్తులకు శిక్షలు పడితే నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు. కోర్టులో ఎఫ్ఐఆర్‌లను సరైన సమయంలో అందించాలని, కేసుల్లో ఉన్న ప్రాపర్టీని సరైన సమయంలో కోర్టులో డిపాజిట్ చేయాలన్నారు.కోర్టులో బాధితులకు న్యాయం జరిగే విధంగా నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషిచేయాలన్నారు.
నేరస్తులకు వారంట్స్, సమన్స్, సత్వరమే ఎగ్జిక్యూటివ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, కోర్టు ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్ కు తెలుపాలన్నారు.కేసు ట్రయల్స్ సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలహాలు,సూచనలు పాటించాలని, కోర్టు పెండింగ్ ట్రయల్ కేసులు, వారెంట్స్, సమన్స్, సి.సి.టి.యన్.యస్‌లో (కోర్ట్ మానిటరింగ్ సిస్టమ్)లో డాటా ఎంటర్ చేయాలని సూచించారు.కోర్టుకు ట్రయల్ జరిగిన కేసులు ఎంటర్ చేసినచో పెండింగ్ లేకుండా వుంటుందని తెలిపారు.బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని,బాధితులకు మరింత నమ్మకం పెరిగేలా ప్రతి ఒక్క అధికారి పనిచేయాలని సూచించారు. అదనపు డిసిపి (అడ్మిన్) సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఎసిపి రాఘవేంద్రరావు, ఎసిపి ప్రతాప్, సురేంద్ర సిసి ఆర్‌బి ఇన్‌స్పెక్టర్ బుద్దే స్వామి,ఆర్ఐలు దామోదర్, వామనమూర్తి, సంపత్, పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌ల కోర్టు డ్యూటీ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

# అఖిలపక్ష నాయకులతో ఎమ్మార్వో సమావేశం

- 18.సం.ల యువతి యువకులు తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి
- ఓటరు జాబితా సవరణకు అందరూ కృషి చేయాలి



**శంకరపట్నం సెప్టెంబర్ 4 (జనంసాక్షి):**
శంకరపట్నం మండల తాహసిల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ పార్టీల నాయకులతో ఎమ్మార్వో బత్తుల భాస్కర్ అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధన మేరకు కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో సూచనలు సలహాలు అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని అఖిలపక్ష నాయకులకు సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు సయ్యద్ అరిఫ్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బొజ్జ చంద్రమౌళి, బిఆర్ఎస్ నాయకుడు గుర్రం శ్రీకాంత్, సిపిఎం నాయకుడు చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.




## గురుకులాలపై చిన్నచూపు చూస్తున్న ప్రభుత్వం- బిఆర్ఎస్వి

**ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 04, (జనంసాక్షి) :**
గురుకులాలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఎల్లారెడ్డిపేట బిఆర్ఎస్వి నాయకులు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మాజీ జడ్పిటిసి కార్యాలయంలో బుధవారం బిఆర్ఎస్వి నాయకులు కొర్రి అనిల్, జుబేర్ మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గురుకులాలలో నాణ్యమైన విద్యను అందించలేక పోతుందన్నారు. గెస్టు, పార్ట్ టైం ప్యాకల్టీని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నియమిస్తే ఇప్పుడు రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 6000 మందిని తొలగించి వారి కుటుంబాలను రోడ్డుపాలు చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024-25 విద్యా సంవత్సరం మధ్యలో గెస్టు, పార్ట్ టైమ్ ఉద్యోగులను తీసివేస్తే విద్యార్థుల భవిష్యత్తు ఏమవుతుందని అన్నారు. గురుకులాలను నిర్వీర్యం చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పందుతుందని బిఆర్ఎస్వి నాయకులు మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల చదువు ఆగిపోకుండా తీసివేసిన గెస్ట్, పార్ట్ టైం ఫ్యాకల్టీని వెంటనే నియమించాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.




## ఎల్ఆర్ఎస్‌పై అధికారులకు శిక్షణ

**ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 04, (జనంసాక్షి) :**
ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి, ముస్తాబాద్ మండలాల పంచాయతీ కార్యదర్శులకు ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కార్యక్రమం, శిక్షణ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వము ప్రవేశపెట్టిన అనధికారిక లేఅవుట్, ప్లాట్స్ క్రమబద్ధీకరణ ద్వారా 2020 సంవత్సరంలో దరఖాస్తు చేసుకున్నా అప్లికేషన్ మొత్తము క్షేత్ర స్థాయిలో పరిశీలించి జిల్లా కలెక్టర్ అనుమతికి పంపించాలన్నారు. గ్రామపంచాయతీలో గల పంచాయతీ కార్యదర్శిని ఎల్1, రెవెన్యూ శాఖ గిర్దవారి ఎల్ 2, ఇరిగేషన్‌శాఖ నుండి ఎల్ 3 అధికారిగా నియామకము చేయడం జరిగిందన్నారు. పైన అధికారులు గత వారము రోజుల క్రితం జిల్లా స్థాయిలో శిక్షణ కార్యక్రమము ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. శిక్షణ కార్యక్రమం క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్దిదారులకు దరఖాస్తులను పరిశీలన చేయగా ఉన్న ఇబ్బందులు, సాంకేతికంగా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కంట్రీ టౌన్ ప్లానింగ్ అధికారి ఎండి అన్సారీ, డివిజనల్ పంచాయతీ అధికారి జోగం రాజు, బీర్ల బీరయ్య, లింగాల రాజేశ్వర్‌గౌడ్, నాలుగు మండలాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# బదిలీలు సహజం..

- విద్యార్థి, ఉపాధ్యాయుల బంధం శాశ్వతం..



**రామగిరి, జనంసాక్షి :**
గత రెండు నుండి పదమూడు సంవత్సరాలుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్వచర్లలో విధులు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన బదిలీలలో వివిధ పాఠశాలలకు బదిలీ అయిన ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం నిర్వహించడం జరిగింది. వారిని విద్యార్థులు, గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులు శాలువాలు, జ్ఞాపికలు, పూల దండలతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా బదిలీ అయిన యం.సుమలత, సిహెచ్.శైలజ, యస్.నంబయ్య, యం.సంపత్ రెడ్డి ఉపాధ్యాయులను తమకు పాఠశాలతో, విద్యార్థులతో, ఉపాధ్యాయులతో, గ్రామస్తులతో ఉన్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు , గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు, విద్యార్థులు బదిలీ అయిన ఉపాధ్యా యులు తమ పాఠశాలకు అందించిన సేవలను ఘనంగా కీర్తించి, వారు భవిష్యత్తులో ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో ఇంకా మంచి పేరు తెచ్చుకోవాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు బదిలీ అయిన ఉపాధ్యాయులతోపాటు ప్రధానాచార్యులు టి.శోభన్ రావు, ఉపాధ్యాయులు జే.సత్యనారాయణ మూర్తి, డి.వనజ, కే. సత్యవతి, ఏ.రవి, జి.సత్యనారాయణ, కే.వెంకటేశం, జి.దేవేందర్, యం.శంకర్, కే.సతీష్, యం.సుధాకర్ పాటు పురప్రముఖులు కొలిపాక సారయ్య,మేకల మారుతి యాదవ్,మాజీ సింగిల్ విండో డైరెక్టర్ సత్యం మరియు విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్‌జీ-3 ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు వీటీసీ ఐడి కార్డు ఇవ్వాలి..



**రామగిరి, జనంసాక్షి :**
ఆర్.జి-త్రీ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు వీటీసీ ఐడి కార్డు ఇవ్వాలని..కార్మికులను అండర్ గ్రౌండ్ బావి నుండి ఓసీలో డ్యూటీలు వేయడాన్ని రద్దు చేయాలని సెక్యూరిటీ ఎస్ఎస్ఓకు వినతి పత్రం ఇచ్చారు.సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వెంకన్న ఆర్జీ-3 ప్రైవేటు సెక్యూరిటీ కార్మికులకు నేటికీ మెడికల్ వీటీసీ ట్రైనింగ్ చేసిన అనంతరం వీరికి ఐడి కార్డు తయారు చేసి దానిపై ఏరియా సేఫ్టీ అధికారి సంతకం చేసి ఇవ్వవలసి ఉండే దానితో వీరు మై న్యూస్ ఏరియాలో విధులు నిర్వహిస్తున్నప్పుడు వీరి వద్ద ఈ ఐడి కార్డు ఉండవలసిన అవసరం ఉంది కానీ నేటికీ వీరికి సంబంధిత కాంట్రాక్టర్స్ ఇవ్వడం లేదు అదేవిధంగా ఏఎల్‌పి బావి నుండి ఓసిపి టు క్వారీ వరకు వెళ్లి అక్కడ విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు సెక్యూరిటీ కార్మికులకు అండర్ గ్రౌండ్ విటిసి మరియు క్వారీ వీటిసి లేకున్నా వీరికి అక్కడ డ్యూటీలు వేయడం మైన్ యాక్ట్ ప్రకారం సరికాదు ఇట్టి విషయాలను సంబంధిత అధికారుల దృష్టికి పలు తపాలా తీసుకువెళ్లిన పరిష్కరించని ఎడల తిరిగి ఆర్జీ 3 సెక్యూరిటీ ఆఫీసర్ గారికి ఈరోజు వినతి పత్రం ఈ రెండు అంశాలపై ఇవ్వడం జరిగింది కాబట్టి ఇప్పటికైనా ఇట్టి విషయాలను పూర్తిస్థాయి లో పరిశీలన చేసి తగు న్యాయం చేయాలని ఈ సందర్భంగా సింగరేణి సెక్యూరిటీ అధికారిని కోరడం జరుగుతున్నది.

## కూలిన మాజీ ఎంపీటీసీ ఇంటి గోడలు



**రామగుండం, జనంసాక్షి :**
గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు. అంతర్గం మండలం లోని లింగాపూర్ గ్రామ మాజీ ఎంపిటీసీ ఇరికిల్ల పద్మ శంకరయ్య కు చెందిన ఇంటి గోడలు కూలిపోయాయి. సింగరేణి ఓబీ మట్టికుప్పలు ఎస్సి కాలనీకి అతి సమీపంలో ఉండటంతో. మట్టి కుప్పలనుండి వచ్చిన వరద నేరుగా ఇళ్లలోకి రావటంతో గోడలు నానీ కూలిపోయాయని బాధితులు వాపోయారు. లింగాపూర్ ఎస్సి కాలనీని సింగరేణి సంస్థ సురక్షిత ప్రాంతానికి తరించాలని కోరారు. రాత్రి పూట అనుకోని సంఘటనలు జరిగితే ప్రాణ నష్టం కూడా వాటిల్లే అవకాశం ఉందని. వెంటనే సింగరేణి అధికారులు సందర్శించి కాలనీ వాసులను సురక్షిత ప్రాంతానికి తరలించాలని కోరారు.

## విష జ్వరంతో బాలుడు మృతి..

**ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 04, (జనంసాక్షి) :**
ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన తుడుం అజయ్ – రవళి దంపతుల కుమారుడు హనీష్ (30 నెలలు) మంగళవారం రాత్రి విష జ్వరంతో మృతిచెందాడు. జ్వరంతో బాధపడుతున్న హనీష్‌ను జిల్లా కేంద్రంలోని సృజన్ పిల్లల ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్ ప్రసాద్‌రావు పరీక్షించి చిన్నారి పరిస్థితి విషమంగా ఉందని కరీంనగర్‌కు తీసుకెళ్లాలని చెప్పగా ప్రతిమ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బాలుడు మృతిచెందాడు. చిన్నారి కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు దొమ్మాటి నర్సయ్య, షేక్ గౌస్, సద్ది లక్ష్మారెడ్డి, ఓగ్గు బాలరాజు యాదవ్, బండారి బాల్‌రెడ్డిలు పరామర్శించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామి ఇచ్చారు.





# ద్రావిడ్ ఐపీఎల్ రీఎంట్రీ పక్కా!

### ఏ జట్టుకు కోచ్‌గా వస్తున్నాడంటే..

భారత క్రికెట్ అభిమానులు 'ది వాల్' అని పిలుచుకునే మిస్టర్ డిపెండెబుల్ రాహుల్ ద్రావిడ్ మళ్లీ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లోకి రీఎంట్రీ ఇవ్వనున్నాడా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. 11 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌కు ఐసీసీ ట్రోఫీని అందించడంలో కీలకపాత్ర పోషించిన ద్రావిడ్.. టీమిండియా కోచ్‌గా వైదొలిగాక మళ్లీ హెడ్‌కోచ్ బాధ్యతలను చేపట్టనున్నాడట. గతంలో తాను సారథిగా వ్యవహరించి, మెంటార్‌గా కూడా పనిచేసిన రాజస్థాన్ రాయల్స్‌కు వచ్చే సీజన్ నుంచి హెడ్‌కోచ్‌గా ఉండనున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు అతడు ఒప్పంద ప్రక్రియనూ పూర్తిచేసినట్టు సమాచారం. ఈఎస్పీఎన్‌లో వచ్చిన కథనం మేరకు.. 2025 ఐపీఎల్ సీజన్ నుంచి ద్రావిడ్, రాజస్థాన్ రాయల్స్‌కు హెడ్‌కోచ్‌గా పనిచేయనున్నాడట. అంతకంటే ముందే జరుగబోయే ఐపీఎల్ రిటెన్షన్స్‌లో కూడా అతడు పాలుపంచుకునే అవకాశముంది. రాజస్థాన్‌తో ద్రావిడ్ అనుబంధం ఈనాటిది కాదు. 2012 నుంచే అతడు రాజస్థాన్ జట్టుతో సంబంధాలు నెరుపుతున్నాడు. 2012, 2013 సీజన్‌లలో రాజస్థాన్ ఫ్రాంచైజీకి సారథిగా వ్యవహరించిన ద్రావిడ్.. 2014, 2015 సీజన్‌లలో అదే జట్టుకు మెంటార్‌గానూ పనిచేశాడు. ద్రావిడ్‌తో పాటు జాతీయ జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా పనిచేసిన విక్రమ్ రాథోడ్.. రాజస్థాన్ రాయల్స్‌కు అసిస్టెంట్ కోచ్‌గా




ఉండనున్నట్టు తెలుస్తోంది. శ్రీలంక మాజీ సారథి కుమార సంగక్కర ఆ ఫ్రాంచైజీకి డైరెక్టర్ ఆఫ్ ది క్రికెట్‌గా ఉండనున్నాడు. రాజస్థాన్‌కు ఐపీఎల్‌లోనే గాక కరేబియన్ ప్రీమియర్ లీగ్ (సీపీఎల్), సౌతాఫ్రికా టీ20 (ఎస్ఎ20)లలోనూ ఫ్రాంచైజీలున్నాయి. ద్రావిడ్ విషయానికొస్తే.. 2015లో రాజస్థాన్‌ను వీడి బీసీసీఐతో చేరిన ద్రావిడ్.. నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) హెడ్‌గా, అండర్-19 క్రికెట్ జట్టుకు హెడ్‌కోచ్‌గా పలు బాధ్యతల్లో విధులు నిర్వర్తించాడు. 2021లో భారత జట్టుకు కోచ్‌గా వచ్చి 2023 వన్డే వరల్డ్ కప్, డబ్ల్యూటీసీ ఫైనల్ చేరడంలోనూ కీలకపాత్ర పోషించాడు. ఇక ఈ ఏడాది వెస్టిండీస్ వేదికగా ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో భారత్‌కు ఐసీసీ ట్రోఫీని అందించడంలోనూ ద్రావిడ్ పాత్ర కొట్టిపారేయలేనిది. ఐపీఎల్ ఆరంభ సీజన్ (2008)లో టైటిల్ గెలిచిన తర్వాత మళ్లీ విజేతగా నిలవని రాజస్థాన్.. పలుమార్లు ఫైనల్ చేరినా రన్నరప్‌గానే మిగిలింది. మరి ద్రావిడ్ రీఎంట్రీతో రాజస్థాన్ రాత మారుతుందో లేదో చూడాలి..!




## షాట్‌పుట్‌లో సిల్వర్ మెడల్ గెలిచిన సచిన్ ఖిలారి

పారా ఒలింపిక్స్‌లో ఇండియాకు మరో మెడల్ దక్కింది. ప్రపంచ చాంపియన్ సచిన్ సర్జేరావ్ ఖిలారి.. పురుషుల షాట్ పుట్ ఎఫ్46 కేటగిరీలో సిల్వర్ పతకాన్ని కైవసం చేసుకున్నారు. అతను 16.32 మీటర్ల దూరం విసిరాడు. దీంతో పారిస్ ట్రాక్ అండ్ ఫీల్డ్ రంగంలో ఇండియాకు 11వ మెడల్ కాగా, ఓవరాల్‌గా ఇండియా పారాలింపిక్స్‌లో ఇప్పటి వరకు 21 మెడల్స్ గెలుచుకున్నది. సచిన్ తన ప్రయత్నాల్లో షాట్‌పుట్‌ను 14.72, 16.32, 16.15, 16.31, 16.03 దూరం త్రో చేశాడు. ఇండియా నుంచి ఇదే ఈవెంట్‌లో పోటీపడిన యాసిర్, రోహిత్‌లు ఔటయ్యారు. స్వర్ణ పతకం సాధించిన వ్యక్తి కన్నా కేవలం 0.06 మీటర్ల తక్కువ దూరం విసిరాడు సచిన్. 30 ఏళ్ల పారాలింపిక్స్‌లో ఇండియాకు షాట్ పుట్‌లో పతకం రావడం ఇదే మొదటిసారి.

## దీప్తి జీవాంజికి కాంస్య పతకం

### అభినందనలు తెలిపిన కేటీఆర్



పారిస్ వేదికగా జరుగుతున్న పారా ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని సాధించిన తెలంగాణకు చెందిన అమ్మాయి దీప్తి జీవాంజికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు అభినందనలు తెలిపారు. పారా ఒలింపిక్స్‌లో భాగంగా మంగళవారం రాత్రి జరిగిన మహిళల 400 మీటర్ల 20లో ఫైనల్‌లో 55.82 సెకన్లలో లక్ష్యాన్ని ఛేదించి మూడో స్థానంలో నిలిచింది. ప్రపంచ రికార్డుతో కాంస్య పతకాన్ని సాధించింది. తెలంగాణకు తొలిసారిగా ఒలింపిక్స్‌లో పతకాన్ని సాధించి పెట్టింది. దీప్తి స్వస్థలం వరంగల్ జిల్లా కల్లెడ గ్రామం. దీప్తి కాంస్య పతకం గెలువడంపై కేటీఆర్ అభినందనలు తెలిపారు. అసమాన ప్రతిభతో రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలిచావని.. ఆడపిల్లలు తమ అసమానమైన శక్తి సామర్థ్యాలతో ఎంతటి ఆనందాన్ని తల్లితండ్రులకు ఇస్తారో ఆడ పిల్ల తండ్రిగా నాకు తెలుసునని.. ఎన్ని కష్టాలున్న సరే దీప్తి తల్లితండ్రులు మాత్రం తన మీద నమ్మకం ఉంచటం గొప్ప విషయమన్నారు. ఆ తల్లితండ్రుల నమ్మకాన్ని నిలబెడుతూ దీప్తి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలవటం సంతోషంగా ఉందన్నారు.

## జీవితంలో క్రికెట్ బ్యాట్ పట్టనోడు ఐసీసీ ఇన్‌చార్జి

### జై షాపై రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

కాంగ్రెస్ అగ్రనాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీ.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కుమారుడు జై షా పై సంచలన ఆరోపణలు చేశారు. జై షా జీవితంలో ఒక్కసారి కూడా క్రికెట్ బ్యాట్ పట్టుకోకపోయినా ఆయన క్రికెట్‌లో అత్యున్నత పదవిని అనుభవిస్తున్నాడంటూ విమర్శలు గుప్పించారు. జమ్మూ, కాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అనంత్‌నాగ్‌లో నిర్వహించిన ప్రచారసభలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ అధికారిక ఎక్స్ ఖాతాలో విడుదల చేసిన వీడియోలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'ఈ దేశాన్ని ముగ్గురు నలుగురు వ్యాపారవేత్తలు నడుపుతున్నారు. అమిత్ షా కొడుకు జీవితంలో ఒక్కసారి కూడా క్రికెట్ బ్యాట్ పట్టలేదు. కానీ అతడు మాత్రం క్రికెట్‌కు



ఇన్‌చార్జిగా ఉన్నాడు' అంటూ వ్యాఖ్యానించారు. ఇందుకు సంబంధించిన పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. జై షా ఐసీసీ చైర్మన్‌గా ఎన్నికయ్యాక ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ సైతం వ్యంగ్యంగా ట్వీట్ చేసిన విషయం తెలిసిందే. కాగా కొద్దిరోజుల క్రితమే జై షా ఐసీసీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. 17 మంది సభ్యులున్న ఐసీసీ ప్యానెల్‌లో ఒక్క పాకిస్థాన్ మినహా మిగిలినవారంతా జై షా అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ 1న అతడు ఐసీసీ చైర్మన్ బాధ్యతలను చేపట్టబోతున్నాడు. భారత్ నుంచి ఈ బాధ్యతలను నిర్వర్తించబోయే ఐదో వ్యక్తి జై షా కాగా అందరిలోనూ అత్యంత పిన్న వయస్కుడు అతడే కావడం గమనార్హం. గతంలో భారత్ నుంచి జగ్‌మోహన్ దాల్మియా, శరద్ పవార్, శ్రీనివాసన్, శశాంక్ మనోహర్ ఈ పదవిలో పనిచేశారు. జైషా త్వరలోనే బీసీసీఐ కార్యదర్శి బాధ్యతల నుంచి తప్పుకునే అవకాశముంది.

## వలస కుటుంబాలకు మౌలిక వసతులకు మెరుగుకు కృషి

- బొల్లారం, కాజీపల్లిలో పర్యటించిన కలెక్టర్
- తాగునీటి ఎద్దడికి అవసరమైన చర్యలు చేపట్టాలి
- ప్రభుత్వ భూములు, చెరువులను కాపాడుకోవాలి
- కలెక్టర్ వల్లూరు క్రాంతి





**సంగారెడ్డిప్రతినిధి, సెప్టెంబర్ 4(జనంసాక్షి)**

కాజిపల్లిలోని వలస కుటుంబాలు కాలనీలో మౌలిక వసతులు మెరుగుకు కృషి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు బొల్లారం, కాజిపల్లి గ్రామాలలో పర్యటించారు. కలెక్టర్ ముందుగా ఖాజిపల్లి గ్రామంలో జీఎంఆర్ కాలనీలో వలస కుటుంబాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ వలస కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వలస కుటుంబాల సమస్యల పరిష్కారం కోసం కావలసిన మౌలిక వసతుల కల్పనకు కృషి చేయనున్నట్లు తెలిపారు. కాలనీలో పాఠశాల నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి పాఠశాలను తనిఖీ చేశారు. జిన్నారం మండలంలో తాగునీటి ఎద్దడికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బొల్లారం మున్సిపల్ పరిధిలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు,సిబ్బందిపనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా బొల్లారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్నా వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించి ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం కలిగించాలని జిల్లా కలెక్టర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. సమయపాలన పాటించాలని వర్షాల కారణంగా వైరల్ ఫీవర్ లు, సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. బొల్లారంలో బిఎల్వోలు సర్వే చేస్తున్న ఓటరు జాబితా ఎస్ఎస్ఆర్ పరిశీలనలో భాగంగా కలెక్టర్ ఇంటింటికి తిరిగి ఓటర్ల జాబితా సర్వే పరిశీలించారు. అనంతరం గ్రామ శివారులోని మాధవానికుంట చెరువును పరిశీలించారు. చెరువు ఎఫ్‌టిఎల్ పరిధివివరాలు అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులను కాపాడుకోవాలని అన్నారు. గ్రామంలోని రెసిడెన్షియల్ పాఠశాలలో ఎస్ఎస్ఆర్ ఫండ్స్ కింద అవసరమైన మరమ్మత్తు పనులు మౌలిక వస్తువులు కల్పనకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పరిశ్రమల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్ హెచ్ఓ గాయత్రీ దేవి, తహసీల్దార్ భిక్ష పతి, మునిసిపల్ చైర్మన్ రోజా బాల్ రెడ్డి, బొల్లారం మునిసిపల్ కమిషనర్ మంగతాయారు. సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మసిటి..మా కొద్దు..!

### రద్దు చేసేంతవరకు ఆగదు ఈ యుద్ధం

**న్యాల్ కల్, సెప్టెంబర్ 04, (జనం సాక్షి) :**

ఫార్మాసిటీ మా కొద్దు.. రద్దు చేసేంతవరకు ఆగదు ఈ యుద్ధం అంటు పంచాయతీ రాజ్ అధికారులను నిర్బంధించి ఆందోళన చేపట్టిన ఘటన సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, డప్పూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని డపూర్, మల్గి, వడ్డీ గ్రామాలకు చెందిన ఫార్మసిటీ భూ నిర్వాసితులు మూడవ రోజు ఆందోళన యధావిధిగా కొనసాగించారు. విధుల్లో భాగంగా డప్పూర్ గ్రామ పంచాయతీ అధికారి గ్రామానికి చేరుకొని పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తుండగా..భూ నిర్వాసితులు వందల సంఖ్యలో పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకొని కార్యదర్శిని నిర్బంధించారు. రెవెన్యూ అధికారులు నేరుగా వచ్చి గ్రామ పంచాయతీ భవనం పై ఫార్మాసిటీ ఏర్పాటుకు సంబంధించిన వివరాలను గోడకు ఇచ్చిన స్థానిక రైతులకు ఎందుకు సమాచారం ఇవ్వలేకపోయావని, ఫార్మాసిటీ కర్మాగారానికి కుమ్మక్కయ్యి అంటూ కార్యదర్శిని నిలదీసి నిర్బంధించారు. విషయం తెలుసుకున్న ఇన్చార్జి ఎంపీడీవో సురేష్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకోగా ఆందోళన చేపడుతున్న భూనిర్వాసితులు ఏకంగా ఇన్చార్జి ఎంపీడీఓ ను సైతం స్పందించారు. దాదాపు రెండు గంటలకు పైగా నిర్బంధించి, కార్యాలయం ఎదుట రైతులు వందల సంఖ్యలో బైఠాయించి ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక జహీరాబాద్ గ్రామీణ వలయాధికారి హనుమంతు పోలీస్‌ల సిబ్బందితో కలిసి నిర్బంధించిన అధికారులను తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు. ప్రయత్నంలో పోలీసులు, రైతుల మధ్య కొంతమేర వాగ్వాదం చోటుచేసుకుంది. ఎట్టకేలకు సీఐ రైతులతో చర్చించి మీరు అధైర్య పడకండి,



చట్ట ప్రకారంగా మీకు అన్ని రకాల భద్రత కల్పిస్తాను. నేను సైతం ఓ రైతు కుటుంబానికి చెందిన వ్యక్తిని. నా భూమి సైతం రోడ్డు విస్తరణలో పోయింది. ఎస్పీ గారితో నేరుగా తీసుకెళ్లి జిల్లా కలెక్టర్ ను మీ సమస్య విన్నవించేందుకు సహకరిస్తాను. చట్ట విరుద్ధంగా ఇలా అధికారులను నిర్బంధించడం ఎంత మాత్రం సరికాదని రైతులను సముదాయించారు. రైతులు ఇన్చార్జి ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం రైతులు ఆందోళన విరమించారు. ఫార్మాసిటీ మా కొద్దు.. మాకు స్పష్టమైన హామీ వచ్చేంతవరకు నిరంతరం ఆందోళన చేపడుతామని రైతులు స్పష్టం చేశారు.

### కంటతడి పెట్టిన మహిళా రైతులు..!

డప్పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న ఆందోళనలో ఫార్మాసిటీ మహిళ భూ నిర్వాసితులు కన్నీటి పర్యంతమయ్యారు. సీఐ జక్కుల హనుమంతుకు విన్నవిస్తూ మా భూములు తీసుకోకండి, మాకు రోడ్డు పాలు చేయకండి, మా భూములే మాకు ఆధారం, ఈ భూములు పోతే మేము బతకడం కష్టం అంటూ పలువురు మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. రోధిస్తున్న పలువురు మహిళను సిఐ సముదాయించి శాంతింపజేశారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

### మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

**నాగర్ కర్నూల్ జిల్లాబ్యూరో, సెప్టెంబర్4 (జనంసాక్షి):**

పేద బడుగు బలహీన వర్గాలకు కూడా కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వెల్దొండ గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో శాశ్వత పథకాలను ప్రవేశపెట్టడం వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయడం ఒక కాంగ్రెస్ పార్టీకే సాధ్యమవుతుందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయడం జరుగుతుందని ఇప్పటికే అనేక గ్యారెంటీలకు బడ్జెట్‌లో నిధులను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను దుర్వినియోగం చేయకుండా సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలని కోరారు.

## తళుక్కుమన్న 'తార కళాశాల'

### తారా కళాశాల నుండి 'ముగ్గురు' రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులుగా ఎంపిక








**సంగారెడ్డి, సెప్టెంబర్ 04, (జనం సాక్షి):**

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు తమ కళాశాల నుండి ముగ్గురు అధ్యాపకులకు రావడం కళాశాలకే గర్వకారణమని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెఎస్ఎస్ రత్నప్రసాద్ తెలిపారు. బుధవారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు తమ కళాశాలకు చెందిన అర్థ శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ జగదీశ్వర్, ప్రభుత్వ పాలన అధ్యాపకురాలు డాక్టర్ వి. మల్లిక, జీవశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ మిథున్ రాథోడ్ లకు లభించడం కళాశాలకే గర్వకారణం అని అన్నారు. బోధనా ప్రక్రియలో నూతన విధానాలను అనుసరించడం, వివిధ అంశాలపై ప్రత్యేక ఆర్టికల్స్ ప్రచురించడం, కళాశాలలో హరితహారం, స్వచ్ఛభారత్, గ్రీన్ కళాశాల ఏర్పాటు, వినూత్న పద్ధతుల ద్వారా డిగ్రీ విద్యార్థులకు బోధన చేయడం, సామాజిక కార్యక్రమాలలో వివిధ రకాలుగా పాల్గొంటూ విద్యార్థులతో పాటు సామాజిక సేవను అందించడం వంటి కార్యక్రమాలకు గాను తమ కళాశాల అధ్యాపకులకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అధ్యాపకులుగా గుర్తించడం చాలా ఆనందంగా ఉందని ప్రిన్సిపల్ తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన తమ అధ్యాపకులకు ఈ నెల 5న సాయంత్రం రవీంద్ర భారతిలో జరిగే కార్యక్రమంలో అవార్డు ప్రధానం జరుగుతుందని ఆయన తెలిపారు.

## పాలెం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రోబోటిక్స్ శిక్షణ




**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్4 (జనంసాక్షి):**

సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో "రోబోటిక్స్ ఇన్ అకాడెమిక్స్ (ఆర్ఐఏ)" పేరిట బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం పాలెం లో గల శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల(అటానమస్) రోబోటిక్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రాములు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో మొత్తం 53 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో 39 మంది బాలికలు మరియు 14 మంది బాలురు ఉన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు రోబోటిక్స్ యొక్క ప్రాథమిక సూత్రాలు నేర్పించబడ్డాయి. ఈ శిక్షణ పొందిన విద్యార్థులు తర్వాత పాఠశాలల్లో ఇతర విద్యార్థులకు రోబోటిక్స్ గురించి అవగాహన కల్పించే బాధ్యత తీసుకుంటారని రోబోటిక్స్ సంస్థ పరాతినిధి తెలిపారు .ఈ సందర్భంగా సోహం అకాడమీ వ్యవస్థాపకులు మరియు రోబోటిక్స్ సంస్థ ప్రతినిధి కోమరగిరి సహదేవ్ మాట్లాడుతూ, "రోబోటిక్స్ అనే ఉత్తేజకరమైన రంగంలో విద్యార్థులను ప్రవేశపెట్టడం, వారి సమస్య పరిష్కార నైపుణ్యాలను, సృజనాత్మక ఆలోచన సామర్థ్యాలను పెంపొందించడం మా లక్ష్యం" అని పేర్కొన్నారు. సోహం అకాడమీ ఈ సంవత్సరం మరిన్ని పాఠశాలలకు మరియు ఇతర జిల్లాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. గత 3 విద్యా సంవత్సరాల నుండి, తెలంగాణలోని 16 జిల్లాల్లో 263 పాఠశాలలలో 44,747 మంది విద్యార్థులకు రోబోటిక్స్ పై అవగాహన కల్పించామని, ఈ సంవత్సరం మరిన్ని పాఠశాలలకు మరియు ఇతర జిల్లాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృదం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆపదలో ఆదుకునేది షీ టీమ్

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

ఆపద సమయాల్లో ఆదుకునేది షి టీం అని మహబూబ్ నగర్ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ పీ. శ్రీనివాస్ అన్నారు . జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు బుధవారం మహబూబ్ నగర్ లోని ప్రతిభ జూనియర్ కళాశాలలో మహిళా ఎస్ ఐ పి. రాణి మరియు షీ టీమ్ సభ్యులతో కలిసి విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ పి. శ్రీనివాస్ మాట్లాడుతూ..షీ టీమ్ అంటే ఏమిటి, అది ఎలా పని చేస్తుంది, అది వారికి ఎలా ఉపయోగపడుతుంది, ఈవ్ టీజింగ్ పెంచడం సోషల్ మీడియా వేధింపులు, మహిళల అక్రమ రవాణా, బాలల దుర్వినియోగం, బాల్య వివాహాలు, బాల కార్మికులు, చైల్డ్ లైన్ 1098, బాండెడ్ లేబర్, పోస్కో చట్టం పని, వేధింపులు, మంచి టచ్ మరియు బాడ్ టచ్, యాంటీ ర్యాగింగ్, సెల్ఫ్ డిఫెన్స్, సైబర్ క్రైమ్, షీ టీమ్ ఎల్లప్పుడూ ఇబ్బందుల్లో సహాయం చేస్తుందన్నారు. ఎక్కడైనా మహిళలు ఆపదలో ఉన్నప్పుడు అత్యవసరమైతే100 డయల్ చేయాలన్నారు.

# తెలంగాణ పేరిట నమ్మించి.. తడిగుడ్డతో గొంతుకోశారు!

## మాజీ ఎమ్మెల్సీ, ఉద్యమ నేతకు తీరని అన్యాయం



- పదవికి రాజీనామా చేయించి గుర్తించని కేసీఆర్
- స్వరాష్ట్రం కోసం పదవి త్యాగం చేయడమే పాపమా..?
- ప్రజాపాలనలో 'సత్తెన్న'కు సముచిత స్థానం దక్కేనా..?

స్పెషల్ కరస్పాండెంట్, హైదరాబాద్ (జనంసాక్షి)

**తన కలంతో సమాజంలోని రుగ్మతలను ఎత్తిచూపిన ఆయన రాజకీయ కుతంత్రాలకు బలయ్యాడు. ఎన్నో ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడిన ఆయన సొంత పార్టీలోనే అవమానానికి గురయ్యాడు. తెలంగాణ ఉద్యమానికి కట్టుబడి పనిచేసినందుకు.. చివరకు నమ్మించి నట్టేట ముంచారు. పట్టభద్రులు అందించిన పదవిని తృణప్రాయంగా వదిలేసుకున్నప్పటికీ.. తగిన గుర్తింపు దక్కకుండా, ప్రజల పక్షాన ప్రతినిధిగా ఉండకుండా కుట్రలు చేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయినా కుంగిపోకుండా ఉద్యమకాలం మొత్తం చురుగ్గా ప్రాణంపెట్టి పోరాడారు. ఈ క్రమంలోనే మరొకసారి ప్రభుత్వ పెద్దల అనాలోచిత చర్యలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కేంద్రబిందువుగా మారిన ఆయనే మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ. ఎలాంటి త్యాగాలూ చేయకుండా ఎంతోమంది పదవులు అనుభవించిన తెలంగాణలో ఆయన మాత్రం నమ్మి మోసపోయిన తొలి ఉద్యమకారుడిగా మిగిలిపోయారు.**

మెదక్ జిల్లాలోని కొల్చారం మండలం వరిగుంతం గ్రామంలో రంగోళ్ళ మల్లమ్మ, దుర్గయ్యల నాలుగో సంతానం రంగోళ్ళ సత్యనారాయణ. 1965 ఆగస్టు 6న జన్మించాడు. కొల్చారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సమయంలోనే కుల మత వివక్షలు, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా విద్యార్థి దశలోనే సామాజిక ఉద్యమాలకు శ్రీకారం చుట్టారు. 9వ తరగతి నుంచి మెదక్‌లో చదువుతూ పూర్తిస్థాయి ఉద్యమాల్లో పాల్గొన్నారు. జిల్లాలో పిడిఎస్‌యు యూనియన్ స్థాపించి జిల్లా అంతటికీ విస్తరింపజేశారు. మెదక్‌లో డిగ్రీ కాలేజ్ సాధన కోసం 45 రోజులు ఉద్యోగం చేయడంలో కీలక పాత్ర వహించారు. డిగ్రీ కాలేజ్ కోసం 45 రోజుల విద్యార్థి ఉద్యమంలో లాఠీ దెబ్బలు తిన్నారు. అరెస్టు అయ్యారు. కేసుల పాలయ్యారు. అప్పటి ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య ఈ ఉద్యమాన్ని చూసి అప్పటి ఆందోల్ ఎమ్మెల్యే శేరి లక్ష్మారెడ్డి ద్వారా విద్యార్థి సంఘాల నాయకులతో చర్చలు జరిపి మెదక్ డిగ్రీ కాలేజ్ మంజూరు చేశారు. డిగ్రీ కాలేజ్ ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రి చేతుల మీదుగానే విద్యార్థి సంఘాన్ని ప్రారంభించడం విశేషం.

### కేసీఆర్‌తో పరిచయం..

1981లో నల్ల చట్టాలు నాసా (జాతీయ భద్రత చట్టం), ఎస్మా (అత్యవసర సర్వీసుల నిర్వహణ చట్టం)కు వ్యతిరేకంగా ఉద్యమాలు చేసిన సత్యనారాయణ 1985 సంవత్సరంలో పత్రికా రంగంలోకి అరంగేట్రం చేశారు. ఈనాడు, ఉదయం, వార్తా దినపత్రికల్లో మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాల జిల్లా ప్రతినిధులుగా, బ్యూరోగా పని చేశారు. రిపోర్టర్ పనిచేస్తూనే తెలంగాణ విద్యవంతుల వేదికకు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. తన కలం నుంచి నీతి గోస, అక్షరాయుధం పుస్తకాలను ప్రచురించారు. జోగిని వ్యవస్థలోని సామాజిక దురాచారాలు, బాణామతి, కుల వివక్ష, జంతు బలి తదితర సామాజిక దురాచారాలను వెలుగులోకి తెచ్చి ప్రజల్లో అవగాహన కల్పించారు. పారిశ్రామిక కాలుష్యం, ఇసుక తవ్వకాలు, అటవీ నిర్మూలన మొదలైన వాటిపై విస్తృతంగా రాశారు. నిరుద్యోగంతో పాటు వివిధ రంగాలపై లోతుగా అధ్యయనం చేసి పరిశోధనాత్మక కథనాలు రాయడంతో ఎమ్మెల్యేగా ఉన్న కేసీఆర్‌తో పరిచయం ఏర్పడింది. అప్పటినుంచి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. టిఆర్ఎస్ పార్టీలో వివిధ హోదాల్లో పని చేశారు. సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జిగా, మెదక్ జిల్లా బాధ్యులుగా, రాష్ట్ర పాలిట్ బ్యూరో సభ్యులుగా పనిచేశారు.

### నమ్మించి మోసగించిన కేసీఆర్..



2007లో కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి పోటీచేసి ఉద్యోగ ఉపాధ్యాయ జర్నలిస్టు సంఘాలతో ఉన్న అనుబంధంతో సత్యనారాయణ గెలుపొందారు. 2008లో తెలంగాణ కోసం కెసిఆర్ పిలుపు మేరకు ఉద్యమాన్ని ఉధృతం చేసే భాగంలో రాజీనామా చేశారు. 2009, 2014 ఎన్నికల్లో టికెట్ ఇస్తానని కెసిఆర్ మోసగించడంతో ఆర్థిక ఇబ్బందుల్లోనూ కూరుకుపోయారు. ఉద్యమంలో కీలక పాత్ర పోషించినప్పటికీ తెలంగాణ రాష్ట్రం, టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక సత్యనారాయణకు అన్యాయం తప్పలేదు. కోట (గడి)లోకి ఎంతకూ ప్రవేశం దొరకలేదు. 2018లో ఎన్నికల ప్రచారంలో 50వేల మంది సమక్షంలో సత్యనారాయణక సముచిత న్యాయం చేస్తామని కెసిఆర్ మరోసారి హామీనిచ్చినా మళ్లీ పాత కథే పునరావృతమైంది. ఈ నేపథ్యంలోనే 2021లో టీఎస్పీఎస్సీ సభ్యునిగా నియమించారు. సీఎం కేసీఆర్ అవసరమైన జీవోలు విడుదల చేయక కమిషన్‌లో అశాంతియుత వాతావరణం ఉత్పన్నమయ్యేందుకు కారకులయ్యారు. దాంతో మనస్తాపం చెంది టీఎస్పీఎస్సీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ప్రజాపాలనను బలపరిచేందుకు సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న 'సత్తెన్న'కు ఇప్పటికైనా సముచిత స్థానం దక్కాలని తెలంగాణ ఉద్యమకారుల ఉవాచ..!!





# పవర్ లూం క్లస్టర్ ను మంజూరు చేసి... యార్న్ డిపోను ఏర్పాటు చేయండి


- సబ్సిడీని 80 శాతానికి పెంచండి...
- పావులా వడ్డీకే రుణాలందించండి
- కేంద్ర టెక్స్ టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ను కలిసిన బండి సంజయ్
- సానుకూలంగా స్పందించిన గిరిరాజ్ సింగ్



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 04 (జనం సాక్షి) :** కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సిరిసిల్లలో పవర్ లూం క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ను కోరారు. దీంతోపాటు నేషనల్ హ్యాండ్లూం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నేతన్నలు కొనుగోలు చేసేందుకు అవసరమైన ముడిసరుకు డిపో(యార్న్ డిపో)ను ఏర్పాటు చేయాలని విజప్తి చేశారు. అట్లాగే ముడిసరుకు ఖర్చుల కారణంగా నేతన్నలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సబ్సిడీని 80 శాతం మేరకు పెంచాలని కోరారు. బుధవారం రోజు ఢిల్లీలో గిరిరాజ్ సింగ్ ను కలిసిన బండి సంజయ్ ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. సిరిసిల్లలో పవర్ లూం క్లస్టర్ ను ఏర్పాటు చేయడంవల్ల వేలాది మంది నేత కార్మికులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ముఖ్యంగా యంత్రాల ఆధునీకరణతోపాటు ఉత్పాదకతను, కార్మికుల మధ్య ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంచుతుందన్నారు. నాణ్యమైన వస్త్రాలను అందించడంతోపాటు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అట్లాగే యార్న్ డిపో ఏర్పాటువల్ల సిరిసిల్లో నేత కార్మికులకు ముడి సరకులు సులభంగా తక్కువ ధరకు లభిస్తాయన్నారు. ప్రస్తుతం నేత కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, పెరిగిన ఖర్చులవల్ల ముడిసరకులను కూడా కొనుగోలు చేయడం కష్టమైందన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఇస్తున్న సబ్సిడీని 80 శాతానికి పెంచడంతోపాటు పావులా వడ్డీకే రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బండి సంజయ్ విజప్తిపట్ల జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ సానుకూలంగా స్పందించారు. యార్న్ డిపో ఏర్పాటుతోపాటు పవర్ లూం క్లస్టర్ మంజూరుపై చర్చించి సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. 80 శాతం సబ్సిడీ, పావులా వడ్డీకే రుణాలు వంటి అంశాల అమలు సాధ్యాసాధ్యాలపై ఉన్నతాధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

# సిర్పూర్ పేపర్ మిల్లు నుండి విచ్చలవిడిగా కాలుష్య ఉద్గారాలు

- కలుషితం అవుతున్న గాలి, పెద్దవాగు నీరు
- కంటి, శ్వాసకోశ వ్యాధులతో ప్రజల ఇబ్బందులు
- కలుషిత పెద్దవాగు నీరు తాగి రోగాల బారిన మూగజీవాలు
- ఎమ్మెల్యే హరీష్ బాబు ఫిర్యాదు చేసిన పట్టించుకోని కమిషనర్



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో (జనం సాక్షి) :** పరిశ్రమల స్థాపనతో ఆ ప్రాంత ప్రజానీకానికి మేలు కలుగుతుంది. స్థానిక యువతకు ఉద్యోగాల కల్పనతో పాటు, స్థానికంగా సంక్షేమ కార్యక్రమాలు జరుగుతాయి. కానీ ఇవేమీ పట్టించుకోకుండా స్థానిక సిర్పూర్ పేపర్ మిల్లు ( జెకె పేపర్ మిల్లు) యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. శతాబ్ద కాలం పైన చరిత్ర కలిగి ఉన్న సిర్పూర్ పేపర్ మిల్లు ఇప్పుడు స్థానికంగా ప్రజలకు మేలు చేసే దానికంటే నష్టమే ఎక్కువగా చేస్తుందని మెజారిటీ ప్రజల భావన. 2014 లో నష్టాల పేరిట పేపర్ మిల్లును అప్పటి బిర్లా యాజమాన్యం మూసివేసింది. 4 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత అప్పటి ప్రభుత్వం( టి.ఆర్.ఎస్) లోని పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు చొరవతో పేపర్ మిల్లు తిరిగి 2018 మార్చి నెలలో పునః ప్రారంభమైంది. ఈ సందర్భంగా పేపర్ మిల్లు నిర్వహణ ను అప్పటి ప్రభుత్వం జెకె పేపర్ మిల్లు యాజమాన్యానికి అప్పగించింది. కానీ అనంతరం పేపర్ మిల్లులో యాజమాన్యం స్థానికులకు ఉద్యోగాలు అంతంత మాత్రమే కల్పించి , స్థానికతరులకు పెద్దపీట వేసిందని పలు సందర్భాల్లో కార్మిక సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు విమర్శలు గుప్పించారు. అయినప్పటికీ పేపర్ మిల్లు యాజమాన్యం విధానాల్లో మార్పు కనబడలేదు. దీనికి తోడు ప్రజల ఆరోగ్యంతో సంబంధం లేకుండా విచ్చలవిడిగా రసాయన, దుమ్ము ధూళి కాలుష్య ఉద్గారాలను విడుదల చేసి ఈ ప్రాంత ప్రజానికం ఆరోగ్యం కు నష్టం కలిగిస్తుంది. గత శాసనసభ ఎన్నికల అనంతరం గత ఏప్రిల్ 14న తొలిసారిగా సిర్పూర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు సిర్పూర్ పేపర్ మిల్లు కాలుష్యం పై హైదరాబాదులో కార్మిక శాఖ కమిషనర్ శ్రీకృష్ణ ఆదిత్యను కలిసి వినతి పత్రం అందజేశారు. పేపర్ మిల్లు కాలుష్య ఉద్గారాల వల్ల ఈ ప్రాంతంలో ప్రజలకు ఆరోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. అదేవిధంగా పేపర్ మిల్లు నుండి రసాయన ఉద్గారాల వల్ల పెద్దవాగు జలాలు కలుషితం అవుతున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీష్ బాబుకు కార్మిక శాఖ కమిషనర్ కాలుష్య ఉద్గారాల నివారణపై హామీ ఇచ్చారు. కానీ పేపర్ మిల్లు యాజమాన్యం విచ్చలవిడిగా రసాయన, బొగ్గు, కాస్టిక్ ఇతరత్రా దుమ్ము దులిపదార్థాలను గాలిలోకి, పెద్దవాగు జలాల్లోకి వదిలి ఈ ప్రాంతంలో ప్రజల ఆరోగ్యం, పశువుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. దీంతో కాగజ్ నగర్ పట్టణ ప్రజల తో పాటు సిర్పూర్ నియోజకవర్గం లోని ప్రజలు శ్వాసకోశ, కంటి సమస్యలతో రోగాల బారిన పడుతున్నారు. మరి ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత కార్మిక శాఖ ఉన్నత అధికారులు చర్యలు చేపట్టి, ఈ ప్రాంతంలో కాలుష్యాన్ని నివారించి, స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఆర్టీసీ ప్రయాణికులు పదిశాతం డిస్కౌంట్

- విజయవాడ-హైదరాబాద్ రూట్‌లో వర్తింపు



**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** భారీ వర్షాలు, వరదలు తెలుగు రాష్ట్రాలను అతలాకుతలం చేస్తున్నాయి. దీంతో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులు గత కొన్ని రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్-విజయవాడ మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులకు టికెట్ ధరలో 10 శాతం రాయితీ ఇవ్వనున్నట్టు ప్రకటించింది. రాజధాని, ఏసీ, సూపర్ లగ్జరీ బస్సులలో ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపింది. ముందస్తు రిజర్వేషన్ కోసం టికెట్లు బుక్ చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు. ఇదిలా ఉండగా.. ఇటీవల భారీ వర్షాల నేపథ్యంలో వరదలు పోటెత్తడంతో హైదరాబాద్ – విజయవాడ మధ్య రాకపోకలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. దాదాపు 36 గంటల పాటు రాకపోకలు స్తంభించాయి. వరద ఉధృతి స్వల్పంగా తగ్గడంతో మళ్లీ రాకపోకలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులకు టికెట్లపై రాయితీని ప్రకటించింది.

# అధికార మత్తు వదలని హరీష్ రావు




- విపత్తు సమయంలో బురద రాజకీయాలు
- పదేపదే విమర్శలు చేయడంపై మండిపడ్డ జగ్గారెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** అధికారంలో లేకున్నా ఆ మైకం నుంచి హరీష్ రావు ఇంకా బయటకు రావడం లేదని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణలో ప్రతిపక్షాలు రాజకీయం చేయడానికి ఇదే సమయం కాదంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చాలా వ్యత్యాసం ఉందని చెప్పుకొచ్చారు. జగ్గారెడ్డి బుధవారం మీడియాతో మాట్లాడుతూ..'ప్రతిపక్ష నేతలు ఖమ్మంలో పర్యటించి ప్రజల నుంచి వచ్చిన సూచనలను ప్రభుత్వానికి ఇవ్వండి. ప్రతిపక్షం ఎలా ఉండాలి అనేది కాంగ్రెస్ పక్షాన నేను ట్రైనింగ్ ఇస్తాను. హరీష్ ఇంకా అధికారం ఉందనే మైకంలోనే ఉన్నారు. ప్రభుత్వం, ప్రతిపక్షం మొదట ప్రజలను సేఫ్ జోన్‌లోకి తేవాలి. ప్రతిపక్షాల రాజకీయానికి ఇది సమయం కాదు. ప్రభుత్వం మీద బురద చల్లెందుకు బీఆర్ఎస్ లేనిపోని మాటలు చెబుతోంది. మన రాష్ట్ర ప్రతిపక్ష నాయకు కేసీఆర్ ఇంట్లో ఉంటే బీఆర్ఎస్ నేతలు బయట కామెంట్స్ చేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చాలా తేడా ఉంది. కాంగ్రెస్ వాస్తవాలకు దగ్గరగా ఉంటుంది. కాంగ్రెస్ శ్రద్ధగా పని చేస్తుంది. కానీ, ప్రచారానికి ప్రయారిటీ ఇవ్వదు. బీఆర్ఎస్ నేతలు 90 శాతం పబ్లిసిటీ చేసి.. 10శాతం పని చేస్తారు. ప్రభుత్వం ప్రజలను కాపాడేందుకు వంద శాతం ప్రయారిటి ఇస్తుందని అన్నారు. ఐదు రోజుల నుంచి వర్షాలు తెలంగాణ, ఆంధ్రలో కురుస్తున్నాయి. పెద్ద మొత్తంలో వర్షాలు రావడంతో చెరువులు, వాగులు, అలగులు పడుతున్నాయి. జంట నగరాల్లో కూడా ఇప్పుడు వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయి. ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షం కారణంగా హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఖమ్మం జిల్లాలో ఇండ్లు మునిగి పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి మూడు రోజులుగా వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. సహాయక చర్యలు అందిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఖమ్మంలో వరద ప్రాంతాల్లో పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలు తీసుకుంటూనే.. అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నారు. ఇప్పటికే 7వేల కోట్ల నష్టం జరిగింది. తక్షణ సాయం కోసం కేంద్రం రెండు వేల కోట్లు విడుదల చేయాలని ప్రధాని మోదీకి సీఎం రేవంత్ లేఖ రాశారని కామెంట్స్ చేశారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు భైంసా ఉపాధ్యాయుడు ఎంపిక



**భైంసా, సెప్టెంబర్ 04 (జనంసాక్షి) :** రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా భైంసా పట్టణానికి చెందిన పల్సి శ్రీనివాస్ ఎంపిక కావడం పట్ల పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సెప్టెంబర్ ఐదు ను పురస్కరించుకుని రాష్ట్ర ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చేతులమీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించబోతున్నారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుగా అవార్డు తీసుకోబోతున్న శ్రీనివాస్ కి పలువురు అభినందనలు తెలియచేస్తున్నారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370